అనుదినం... జనస్వరం

# నవతెలంగాణ

బుధవారం 7-2-2018

సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 4 సంచిక : 40 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | W O W | 14 + 16 పేజీలుm వెల : 5.00W

## మీ బిడ్డలకు పకోడీ షాపులు పెట్టిస్తారా?

### బీజేపీ నేతలనుద్దేశించి సీపీఐ(ఎం) ఎంపీ సలీం ప్రశ్న

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

'పకోడీలు అమ్ముకోవడం కూడా ఉపాధి అని బీజేపీ నేతలంటున్నారు. మరి ఎంతమంది బీజేపీ నేతలు తమ కొడుకులకు పకోడీ దుకాణాలు పెట్టిస్తారు?' అని సీపీఐ(ఎం) ఎంపీ ఎండీ సలీం లోక్‌సభలో ప్రశ్నిం చారు. ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన బీజేపీ పెద్దలు... ఆ హామీని విస్మరించి నిరుద్యోగ యువతకు పకోడీలు అమ్ముకోవాలని అంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం పేదల, అణగారిన వర్గాల, దళితుల, మహిళల, కార్మికుల గోడు పట్టించుకోవడం లేదని, కేవలం కార్పొరేట్ల ప్రయోజనాలను కాపాడుతోందని విమర్శించారు. ఇక రాష్ట్రపతి ప్రసంగంలో భీమా- కోరేగావ్ దళితులపై మతోన్మాదుల దాడి, నిరుద్యోగం, వ్యవసాయ ...9లో




## అందరికీ ఒకే సిరంజీ

- 46 మందికి హెచ్ఐవీ
- యూపీలో దారుణం

వివరాలు 9లో



# ఆర్థిక, సామాజిక పోరాటాలు నిర్మిద్దాం



## వామపక్ష ప్రజాతంత్ర ఫ్రంట్ ఏర్పాటే లక్ష్యం

### బీఎల్ఎఫ్ ఆవిర్భావం ఓ ముందడుగు

### సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్‌కరత్

నర్రా రాఘవరెడ్డి నగర్ (నల్లగొండ) నుంచి
బొల్లె జగదీశ్వర్

దేశవ్యాప్తంగా వామపక్ష ప్రజాతంత్ర ఫ్రంట్ ఏర్పాటే తమ లక్ష్యమని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్‌కరత్ అన్నారు. నల్లగొండలో జరుగుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర ద్వితీయ మహాసభల్లో మూడో రోజు మంగళవారం ప్రతినిధులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం మహాసభ, కోల్‌కతా ప్లీనంలో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణం గానే తెలంగాణలో పార్టీ కార్యక్రమాలు జరుగుతు న్నాయని చెప్పారు. తెలంగాణలో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) ఆవిర్భవించడం ఓ ముందడుగు అని అభిప్రాయపడ్డారు. ఆర్థిక పోరాటాలతోపాటు సామాజిక అంశాలపైనా పోరాటాలు నిర్మించాలని అన్నారు. అప్పుడే సామాజిక న్యాయం వస్తుందన్నారు. దేశంలో వామపక్ష ప్రజాతంత్ర శక్తులను ఏకం చేయాల్సిన అవసరముం దన్నారు. సీపీఐ(ఎం) సొంత బలాన్ని పెంచుకోవాలని చెప్పారు. మహాజన పాదయాత్ర నిర్వహించడం, బీఎల్ఎఫ్ ఏర్పాటు చేయడం ఇందులో భాగమేనని అన్నారు. వర్గ దోపిడీకి, సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కుల సమస్యలు, సామాజిక అంశాలు, పేదలు, కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు ఇలా ఒక్కో రంగంపై కేంద్రీకరించి పనిచేయాలని సూచించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, ఇక్కడ కేసీఆర్ ప్రభుత్వం కార్మికవర్గంపై దాడి చేస్తున్నాయని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న సరళీకరణ విధానాలతో కార్మికులు హక్కులు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. హక్కుల సాధనకు కార్మికులు ఐక్య పోరాటాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. దేశంలో వ్యవసాయ సంక్షోభం నెలకొందని చెప్పారు. మహారాష్ట్ర, రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో రైతులు ఆందోళన చేస్తున్నారని గుర్తు చేశారు. రైతులను సమీకరించి సమరశీల పోరాటాలు చేయాలని కోరారు. వామపక్షాల ఐక్యత ఎంతో కీలకమని అన్నారు. సమస్యలపై కలిసి పోరాడాలని సూచించారు. ఏప్రిల్ 18-22 వరకు హైదరాబాద్‌లో జరిగే అఖిల భారత మహాసభలు పార్టీ విస్తరణకు, అభివృద్ధికి దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.



## 10 ఆవిరైన సంపద లక్షల కోట్లు

### మూడు రోజులు..1711 పాయింట్లు

### కొనసాగిన నష్టాలు... సెన్సెక్స్ మరో 561 పాయింట్ల పతనం

### ఇంట్రా ట్రేడింగ్‌లో 1200 ఫట్

### కొత్తగా అమెరికా భయాలు



వివరాలు 12లో

## మగబిడ్డలేడని...

### ఇంటిపోరు భరించలేక పిల్లలతో సహా భార్యాభర్త ఆత్మహత్య

నవతెలంగాణ - మేడ్చల్ కలెక్టరేట్

'ఇద్దరూ ఆడబిడ్డలే. వంశోద్ధారకుడు లేడు' అంటూ అత్తామామల వేధింపులు. ఆడపడచుల సూటిపోటి మాటలతో విసిరి వేసారిన ఆ మహిళ భర్తకు చెప్పుకుంది. భార్యభర్తలిద్దరూ కూర్చొని మదనపడ్డారు. మగబిడ్డల్లేరంటూ ఇంటి పోరు ఎక్కువవ్వటంతో లోలోన కుమిలిపోయారు. చివరకు ఆడబిడ్డల్ని తీసుకుని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ విషాద ఘటన మేడ్చల్ జిల్లా కీసరలో మంగళవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం ఘట్‌కేసర్‌లోని కొండాపూర్‌కి చెందిన మడిపడిగె రమేష్(26)కు శామీర్‌పేట ...9లో



## ఉపాధి కల్పనలో బీజేపీ ఘోర వైఫల్యం



- పకోడి, చాయ్,వ్యాపారులను అవమానిస్తున్న మోడీ
- తెలంగాణకు వచ్చిన నిధులపై శ్వేతపత్రం ప్రకటించాలి: బివి రాఘవులు

వివరాలు 11లో

## అబద్ధాల్లో మోడీకి ఆస్కార్

### 'అబద్ధాలే ఆయుధాలు' పుస్తకావిష్కరణలో వీఎస్ఆర్



వివరాలు 11లో

## అసెంబ్లీ ప్రోరోగ్

### నోటిఫికేషన్ విడుదల చేసిన గవర్నర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

శాసనసభ, శాసనమండలి సమావేశాలను ప్రోరోగ్ చేస్తూ రాష్ట్ర గవర్నర్ ఈఎల్ఎస్ నరసింహన్, అసెంబ్లీ కార్యదర్శి వి నరసింహాచార్యులు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈమేరకు మంగళవారం నోటిఫికేషన్ జారీ అయింది. అక్టోబర్ 27న అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత కొన్ని రోజులకు ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి బీసీలపై ప్రత్యేకంగా చర్చించడం, కొత్త పంచాయతీరాజ్ ...9లో



## అగ్ని-1 విజయవంతం

- అణ్వాయుధాలను మోసుకుపోగల క్షిపణి
- ఒడిషా నుంచి ప్రయోగం...

బాలాసోర్(ఒడిషా): అణ్వాయుధాలను మోసుకుపోగల అగ్ని-1 ఖండాంతర క్షిపణి ప్రయోగం విజయవంతమైంది. ఉపరితలం నుంచి ఉపరితలంలో 700 కి.మీ. పరిధిలోని లక్ష్యాలను చేరుకోగల అగ్ని-1ను విజయవంతంగా ప్రయోగించినట్టు రక్షణశాఖ తెలిపింది. మంగళవారం ఉదయం 8-30కి ఒడిషా తీరం బాలాసోర్‌లోని అబ్దుల్ ...9లో

## రగిలిన కంది రైతులు

### పోలీసులు, రైతులకు తోపులాట.. పలువురికి స్వల్పగాయాలు

### పత్తాలేని మార్క్‌ఫెడ్, డీసీఎంఎస్ అధికారులు

### చివరికి ఉన్నతాధికారుల హామీతో విరమణ

కొనుగోలు కేంద్రాలను రాత్రికి రాత్రే ఎత్తేయడంతో కడుపుమండి కంది రైతులు రోడ్డెక్కారు. కొనుగోలు కేంద్రాలను తిరిగి ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ వికారాబాద్ జిల్లాలో రెండు చోట్ల మంగళవారం ధర్నాలు చేశారు. పురుగుల మందు డబ్బాలు చేతబట్టుకొని, సమస్యను పరిష్కరించకుంటే ఆత్మహత్య చేసుకుంటామని రైతులు హెచ్చరించారు. రైతులకు పలు పార్టీల నాయకులు మద్దతు తెలిపారు. 9లో



రాస్తారోకో చేస్తున్న కంది రైతులు

## జాబివ్వని దద్దమ్మ కేసీఆర్

### 2 లక్షల ఖాళీలు.. భర్తీ చేసింది 7 వేలే...

### బస్సు యాత్ర ప్రారంభోత్సవంలో ఉత్తమ్, కుంతియా

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ వస్తే ఇంటికో ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ఊరికో ఉద్యోగం కూడా ఇవ్వలేదని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఈ నాలుగేండ్లలో నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వలేని దద్దమ్మ ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు అని విమర్శించారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చే నాటికే లక్షా 7 వేల ఉద్యోగాలు ఖాళీ ఉండగా నేడు పదవీ విరమణ చేసిన వారు, కొత్తగా ఏర్పడిన ఖాళీలతో రెండు లక్షల ఉద్యోగాలు ఖాళీలుగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఇంతవరకు ఏడు వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేక పోయిందన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో




యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అనిల్‌కుమార్ నేతృత్వంలో 'రాజీవ్ రథం' పేరుతో నిరుద్యోగ చైతన్య బస్సు యాత్రను ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి రామచంద్రకుంతియా ...9లో

## కొక్కొరోకో..



అవునురా.. ఇన్ని దారుణాలు,
మోసాలు మర్డర్లు జరుగుతున్నాయిగా..
ఖైదీలు లేకపోవడమేంటీ..?
సబ్ జైళ్లు మూసేయడమేంటీ..!!

# దళిత రైతు భూమిలో పెన్నా తవ్వకాలు

దళిత రైతు భూమిలో పెన్నా సిమెంట్ పరిశ్రమ ముడిపదార్థాల కోసం అక్రమ తవ్వకాలు చేపట్టింది. ఇదేంటని ప్రశ్నించిన రైతుపై బెదిరింపులకు దిగింది. ఆ పరిశ్రమపై బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి ఏడు నెలలు గడుస్తున్నా చర్యలు శూన్యం. బాధితుడు రెవెన్యూ అధికారులకు అర్జీ పెట్టుకున్నా...'మా దృష్టికి రాలేదు' అంటూ రెవెన్యూ యంత్రాంగం తనకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నది.

## ప్రశ్నించినందుకు బెదిరింపులు

### పోలీసులకు ఫిర్యాదు చేసి ఏడునెలలైనా చర్యలు శూన్యం

నవతెలంగాణ-పాలకవీడు

సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం గణేష్‌పహాడ్‌లో పెన్నా సిమెంట్ పరిశ్రమ ఉంది. అదే మండలంలోని రావిపహాడ్ గ్రామ పంచాయతీ పరిధిలో గల మహంకాళిగూడెం రెవెన్యూ శివారులో గల సర్వే నెంబర్ 8లో నన్నెపంగు నర్సయ్యకు నాలుగెకరాల పట్టా భూముంది. ఆయన మరణానంతరం 1995లో ఆ భూమిని నలుగురు కుమారులు పుల్లయ్య, రాములు, జైరామ్, ఏసు తలా ఎకరం చొప్పున పట్టా చేయించుకున్నారు. అందులో పుల్లయ్య మృతిచెందాడు. ఆయన భార్య వజ్రమ్మ పేరు మీదకు పట్టా మార్చారు. ఆ భూమిని మిగతా ముగ్గురు అన్నదమ్ముళ్లు సేద్యం చేసుకుంటున్నారు. ఈ భూమిలో గతంలో వర్షాధార పంటలైన జొన్న, కంది, పత్తి, సజ్జలు పండించారు. 2011లో ఆ భూముల చివరి అంచు నుంచి రైల్వే లైను వేశారు. రైల్వేలైన్‌లో ఎకరా 25గుంటల భూమిని ఆ అన్నదమ్ముళ్లు కోల్పోయారు. దానికి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం కూడా అందింది. మిగిలిన భూమిలో సేద్యం చేసుకుంటున్నారు. ఏడు నెలల కింద ఆ భూమిలో పెన్నా సిమెంట్ పరిశ్రమ మైనింగ్ మేనేజర్ రామచంద్రరావు, సూపర్‌వైజర్ సాంబయ్య వచ్చి మైనింగ్ పరీక్షలు నిర్వహించారు. రైతు ...9లో



భూమిలో తవ్వకాలు

నవతెలంగాణ

## ఫలహారాలకు అరకోటికిపైనే ...

**బీజేపీ ముఖ్యమంత్రి తీరు ఇది..**

**ఉత్తరాఖండ్ సీఎం స్నాక్స్ ఖర్చు..**

**ఆర్టీఐతో వెలుగులోకి..**



డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్ గతేడాది మార్చిలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడింది. మార్చి 18న త్రివేంద్ర సింగ్ రావత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అప్పటి నుంచి 10 నెలల్లో అతిథులకు టీ, స్నాక్స్ కోసం ఆయన ఖర్చు చేసిన మొత్తం అక్షరాలా రూ. 68,59,865. అంటే అరకోటి దాటిపోయింది. పదవిలోకి వచ్చి సంవత్సరం కూడా దాటకుండానే... చిరుతిండ్ల కోసం ప్రభుత్వ ఖజానా నుంచి ఆయన పెట్టిన ఖర్చు చూసి అంతా నోరెళ్లబెడుతున్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా హేమంత్ సింగ్ అనే ఆర్టీఐ కార్యకర్త అడిగిన ప్రశ్నకు అధికారి ఈ వివరాలను అందించారు. ఆయన దగ్గరకు వచ్చిన అతిథులకు ఫలహారాలు, స్నాక్స్ కోసమే సీఎం ఇంతమెత్తంలో ఖర్చుచేయడం గమనార్హం.

## లైంగికదాడిని ప్రతిఘటిస్తే.. చంపేశారు



**లక్నో :** వరుస లైంగికదాడులు వెలుగుచూస్తున్న ఉత్తరప్రదేశ్‌లో మరో దుర్మార్గ ఘటన వెలుగులోకి వచ్చింది. లైంగికదాడిని ప్రతిఘటించిన 40 ఏండ్ల మహిళను ఆరుగురు వ్యక్తులు అతి కిరాతకంగా కొట్టి చంపారు. ప్రతాప్‌గఢ్‌లోని కొత్వాలీ ప్రాంతంలో శనివారం రాత్రి ఈ ఘటన జరిగింది. ఒంటరిగా ఉంటున్న ఆ మహిళ ఇంట్లోకి చొరబడిన ఆరుగురు వ్యక్తులు ఆమెపై లైంగికదాడికి ప్రయత్నించారని పోలీసులు తెలిపారు. ప్రతిఘటించడంతో ఇనుస రాడ్లతో ఆమెను తీవ్రంగా కొట్టినట్టు చెప్పారు. రక్తపు మడుగులో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న ఆమెను అక్కడే వదిలేసి పరారయ్యారు. ఆమె కేకలు విన్న పొరుగింటివారు లోపలికి వెళ్లి చూసేసరికి.. కొన్ని శరీరభాగాలు వేలాడుతూ కనిపించాయి. పోలీసులకు సమాచారం ఇవ్వగా వెంటనే అక్కడకు చేరుకుని ఆమెను హుటాహుటిన అలహాబాదులోని ఎస్ఆర్ఎన్ మెడికల్ కాలేజీకి తరలించారు. కొద్ది గంటలపాటు మృత్యువుతో పోరాడిన ఆమె చివరకు ఆదివారం ఉదయం తుదిశ్వాస విడిచింది.

**మైనరుపై ఏడాదిగా తొమ్మిది మంది ..**

ముంబయిలో మైనరుపై స్నేహితులైన తొమ్మిది మంది ఏడాదిగా లైంగికదాడికి పాల్పడుతున్న ఘటన వెలుగులోకి వచ్చింది. ఆమెతో సన్నిహితంగా ఉన్న ఒక వీడియో క్లిప్‌ను ఒకడు తన ఎనిమిది మంది స్నేహితులకు పోస్టు చేశాడు. ఆ వీడియోను అడ్డంపెట్టుకొని ఆమెపై మిగిలిన వారు పదేపదే లైంగికదాడికి పాల్పడుతున్నారు. కుటుంబ గౌరవాన్ని దృష్టిలో పెట్టుకొని విషయాన్ని ఆమె కనీసం తల్లిదండ్రులకు కూడా చెప్పకుండా దాచిపెట్టిందనీ, వారి వేధింపులు భరించలేక ఇటీవల తల్లికి విషయం చెప్పగా.. వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**ఆలయం సాక్షిగా...**

మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో నిర్మాణంలో ఉన్న ఓ శివాలయంలో విద్యార్థినిపై లైంగికదాడికి పాల్పడ్డారు కామాంధులు. ధామ్నోద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. తన స్నేహితుడిని కలవడానికి బాధితురాలు పాట్లవాద్ గ్రామానికి వచ్చింది. అతను రాకపోవడంతో బస్టాప్‌లోనే కూర్చుని ఎదురుచూస్తున్నది. ఇది గమనించిన ఓ వ్యక్తి ఆమె దగ్గరకు వచ్చి.. ఇక్కడ సేఫ్ కాదని.. సమీపంలో ఉన్న గుడిలోకి వెళ్లి కూర్చోమని సలహా ఇచ్చాడు. అది నమ్మిన ఆమె గుడిలోపలికి వెళ్లింది. ఆమె వెనుక వెళ్ళిన ముగ్గురు ఆలయంలో లైంగికదాడికి పాల్పడి పరారయ్యారు. ఘటన నుంచి తేరుకున్న ఆమె.. పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. వారి బైక్ నెంబరును గుర్తుపెట్టుకున్న ఆమె పోలీసుకు తెలపడంతో.. నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.

## మత ఘర్షణల్లో యూపీ టాప్

**న్యూఢిల్లీ:** గత ఏడాది అత్యధిక మత ఘర్షణలు చోటుచేసుకున్న రాష్ట్రంగా ఉత్తరప్రదేశ్ నిలిచింది. కర్నాటక ఆ తర్వాత స్థానంలో ఉన్నదని మోడీ సర్కారు వెల్లడించింది. మంగళవారం ఎంపీలు సి.హరి, టీజీ వెంకటేష్ బాబు పార్లమెంటులో అడిగిన ప్రశ్నకు హోం శాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ ఈ వివరాలను సభ ముందుంచారు. ఎంహెచ్ఏ సమాచారం ప్రకారం, తాజాగా కాస్‌గంజ్ లో మతపరమైన అల్లర్లు ఇంకా చల్లారలేదు. మరోవైపు అదే ఉత్తరప్రదేశ్‌లో గతేడాది 195 మత ఘర్షణలు చోటుచేసుకోగా, 44 మంది ప్రాణాలు కోల్పోయారు. 542 మంది గాయపడ్డారు. అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న కర్నాటకలో 100 ఘర్షణలు జరిగాయని,ఇలా కర్నాటకరెండో స్థానంలో ఉంది. ఇక్కడ జరిగిన ఘర్షణల్లో 9 మంది మృతి చెందగా 229 మంది గాయపడ్డారు. ఈ ఏడాదిలోనే అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉన్న మరో రాష్ట్రం రాజస్థాన్‌లోనూ 91 మత ఘర్షణలు చోటుచేసుకున్నాయి. 12 మంది మృతి చెందగా 175 మంది గాయపడ్డారు.కాగా, మత ఘర్షణలు చోటుచేసుకున్న రాష్ట్రాల్లో బీహార్ నాలుగో స్థానంలో ఉంది.ఇక్కడ 85 ఘర్షణలు చోటుచేసుకుని ముగ్గురు మృతిచెందగా, 321 మంది గాయపడ్డారు. దీంతోపాటు ఈ ఏడాదిలో ఎన్నికలు జరగాల్సి ఉన్న మధ్యప్రదేశ్‌లో 60 మత ఘర్షణలు చోటు చేసుకుని తొమ్మిదిమంది చనిపోగా, 191 మంది గాయపడ్డారు. గుజరాత్‌లో 50 మత ఘర్షణలు జరిగాయి. 8 మంది మ తిచెందగా, 125 మంది గాయపడ్డారు. మొత్తంమీద...దేశవ్యాప్తంగా 2017లో 822 మత ఘర్షణలు జరిగాయి. 111 మంది మృతిచెందగా, 2,384 మంది గాయపడ్డారు.

# చైర్మెన్ అవకాశమివ్వట్లేదు..



**విపక్షాల రాజ్యసభ బహిష్కరణ**

- ప్రతిపక్షాల గొంతునొక్కుతున్నారని ఆవేదన
- రెండు రోజులుగా ప్రశ్నోత్తరాలు, జీరో అవర్ బంద్
- సభను నేరుగా మధ్యాహ్నానికి వాయిదా వేస్తున్న చైర్మెన్ వెంకయ్య

**నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో**

రాజ్యసభలో విపక్షాల గొంతునొక్కుతున్నారని ప్రతిపక్ష నేతలు విమర్శించారు. దేశంలో చోటుచేసుకుంటున్న ముఖ్యమైన పరిణామాలతో పాటు ఆయా రాష్ట్రాల విషయాలపై సభలో మాట్లాడేందుకు చైర్మెన్ వెంకయ్యనాయుడు అనుమతి ఇవ్వడం లేదని ఆరోపించారు. చైర్మెన్ ఇదే వైఖరి అవలంబిస్తే 'తగిన చర్యలు' తీసుకుంటామని హెచ్చరించారు. చైర్మెన్ వైఖరికి నిరసనగా మంగళవారం ఒక రోజు పెద్దల సభను బహిష్కరించినట్టు తెలిపారు. విపక్షాలు అనుమతించకపోవడం అంటే ప్రజలు గొంతునొక్కడమేనని అన్నారు. అలాంటప్పుడు పార్లమెంట్ ఎందుకని నిలదీశారు.

విపక్షాలు మంగళవారం రాజ్యసభా కార్యకలాపాలను బహిష్కరించాయి. సభాపతి వెంకయ్యనాయుడు సభలో మాట్లాడేందుకు అవకాశం కల్పించడం లేదని, ప్రభుత్వ అంశాలను లేవనెత్తేందుకు అనుమతివ్వడం లేదని ఆరోపించాయి. ప్రధాన ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీతో పాటు సీపీఐ(ఎం), సీపీఐ, తృణమూల్‌కాంగ్రెస్, ఎన్సీపీ, డీఎంకే, ఎస్పీ, ఆమ్‌ఆద్మీపార్టీ తదితర విపక్షాలన్నీ సభను బహిష్కరించాయి. మంగళవారం ఉదయం రాజ్యసభలో టీడీపీ, వైసీపీతో పాటు టీఎంసీ ఎంపీలు ఆయా రాష్ట్ర అంశాలపై మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని పట్టుబట్టారు. దీంతో చైర్మెన్ వెంకయ్యనాయుడు సభను ఏకంగా మధ్యాహ్నం రెండు గంటల వరకు వాయిదా వేశారు. అనంతరం సభ ప్రారంభమైన తరువాత డిప్యూటీ చైర్మెన్ కురియన్ వచ్చారు. ఈ సమయంలో రాజ్యసభా విపక్ష నేత గులాంనబీ ఆజాద్ మాట్లాడుతూ.. సభలో విపక్షాలను మాట్లాడనివ్వడం లేదని అన్నారు. ఆజాద్ లేవనెత్తిన అంశానికి ఎస్పీ నేత నరేష్ అగర్వాల్ మద్దతు తెలిపారు. టీఎంసీ ఎంపీ దేరీక్ ఓబ్రెయిన్ సైతం రాష్ట్రపతి ప్రసంగ ధన్యవాద తీర్మానాన్ని నిలుపుదల చేసి తమ రాష్ట్ర అంశాలపై చర్చకు అవకాశం కల్పించాలని కోరారు. దీనిపై కురియన్ స్పందిస్తూ 'ఈ అంశాన్ని నేను ఇక్కడ పరిష్కరించలేను. మీరు రాజ్యసభ చైర్మెన్ ఛాంబర్‌లో సంప్రదించండి' అని సూచించారు. కురియన్ సమాధానంపై విపక్ష నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమయంలో కొంత గలాట చోటుచేసుకోవడంతో సభను మూడు గంటలకు వాయిదా వేస్తున్నట్టు కురియన్ ప్రకటించారు. ఈ సమయంలో గులాంనబీ ఆజాద్ జోక్యం చేసుకుంటూ.. తాము(విపక్షాలు) సభను బహిష్కరిస్తున్నట్టు ప్రకటించారు.

మూడు గంటలకు సభ ప్రారంభమైన తరువాత విపక్షాల నుంచి ఏ ఒక్కరూ సభకు హాజరుకాలేదు. అంతకముందు ఇదే అంశంపై పార్లమెంట్ ఆవరణలోని మీడియా పాయింట్ వద్ద విపక్ష నేతలు మాట్లాడారు. 'బయట విపక్షాల గొంతులను నొక్కేస్తున్నారు. సభలోనూ ఇదే స్థితి కావొద్దని ఆశిస్తున్నాం. ఉదయం నుంచి ప్రభుత్వానికి సంబంధించిన అంశాలను లేవనెత్తాలని ప్రయత్నిస్తున్నాం. కానీ అవకాశం ఇవ్వడం లేదు. అందుకే రోజంతా సభను బహిష్కరించాం' అని గులాంనబీ ఆజాద్ తెలిపారు. 'దురదృష్టవశాత్తు గతం వారం రోజులుగా రాజ్యసభ రూల్స్‌కు అనుగుణంగా దేశంలో చోటుచేసుకుంటున్న అంశాలను ప్రస్తావించేందుకు అనుమతించడం లేదు' అని ఆజాద్ వాపోయారు. ప్రతిపక్షాలను మాట్లాడేందుకు అనుమతించడం లేదని, అలాంటప్పుడు పార్లమెంట్ ఎందుకని ఎస్పీ నేత నరేష్ అగర్వాల్ వాపోయారు. ఇదే అంశంపై చైర్మెన్‌కు లేఖ రాస్తామని కాంగ్రెస్ నేత ఆనంద్‌శర్మ చెప్పారు. సాధారణంగా రాజ్యసభలో ఉదయం సెషన్‌లో జీరో అవర్, ప్రశ్నోత్తరాలు ఒక్కో గంట పాటు నిర్వహిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండు గంటల వరకు భోజన విరామ సమయం. అనంతరం బిల్లులపై చర్చ చేపడతారు. జీరో అవర్‌లో సభ జరిగే ముందు రోజు జరిగిన విషయాలను లేదా ఆ రోజు ఉదయం చోటుచేసుకునే పరిణామాలను సభ్యులు లేవనెత్తుతారు. అయితే రెండు రోజులుగా ఛైర్మన్ వెంకయ్యనాయుడు సభను నేరుగా మధ్యాహ్నానికి వాయిదా వేస్తున్నారు. ఫలితంగా ప్రశ్నోత్తరాలు, జీరో అవర్‌ను విపక్షాలు కోల్పోయాయి.

# డిగ్రీలు తెచ్చుకుని, పకోడీలు చేత పుచ్చుకుని..

**బెంగళూరులో విద్యార్థుల పకోడీల నిరసన**



*డిగ్రీలు తెచ్చుకుని, చిప్ప చేత పట్టుకుని*
*ఢిల్లీకి చేరాం... దేహి దేహి అంటున్నాం*
*దేశాన్ని పాలించే భావిపౌరులం బ్రదర్....'* ఇది ఆకలి రాజ్యం సినిమా కోసం ఆత్రేయ రాసిన పాట. అందులో డిగ్రీ పట్టా చేతపట్టుకొని పట్నం వచ్చిన హీరో... చిన్నపాటి ఉద్యోగం కోసం పడేపాట్లను ఈ పాట ద్వారా కండ్లకు కట్టారు. మరి నేడు జరుగుతున్నదేమిటీ? కొత్త ఉద్యోగాలు లేవు.. ఉన్న ఉద్యోగాలు ఊడుతున్నాయి.. ఎన్నికలకు ముందు కోటి ఉద్యోగాలు కల్పిస్తామంటూ వాగ్దానాలు చేసిన మోడీ సర్కార్.. డిగ్రీలు సంపాదించుకున్న యువకులను పకోడీలు అమ్ముకోమంటున్నది. కాగా, ప్రధాని నరేంద్ర మోడీ, పార్లమెంటులో అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై బెంగళూరులో విద్యార్థులు ఆందోళనకు దిగారు. వర్సిటీ స్నాతకోత్సవం రోజున ధరించే దుస్తులను వేసుకొని విద్యార్థులు పకోడీలు అమ్ముతూ తమ నిరసనను వ్యక్తం చేశారు. రోడ్డు పక్కన పకోడీలు వేసుకుని అమ్ముకుంటే అది మీ ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగామా? అంటూ విద్యార్థులు ప్రశ్నించారు. మోడీ లాంటి వ్యక్తి ప్రధానిగా ఉంటే మాలాంటి విద్యావంతులకు ఉద్యోగాలు రావనీ, చివరికి పకోడీలు వేసుకుని అమ్ముకోవాల్సిందే అంటూ వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. బెంగళూరులోని ఐటీకేంద్రంగా ప్రసిద్ధిగాంచిన మెఖ్రి సర్కిల్స్ సమీపంలో విద్యార్థులు ఈ ఆందోళనకు దిగారు. ప్రధాని నరేంద్ర మోడీ ఇటీవల ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ తాను ప్రధాని అయిన తరువాత భారతదేశంలో ఉద్యోగ అవకాశాలు పెరిగాయని చెప్పారు. నిరుద్యోగులు సైతం ఖాళీగా ఉండకుండా రోడ్డు పక్కన తోపుడు బండి పెట్టుకుని పకోడీలు వేసుకుని రోజుకు రూ. 200 నుంచి రూ. 300 సంపాధిస్తున్నారని అన్నారు.

## మేం చెత్త ఏరుకునేవాళ్లం కాదు..

- కేంద్రంపై సుప్రీం ఆగ్రహం

**న్యూఢిల్లీ :** ఘన వ్యర్థాల నిర్వహణ (సాలీడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్) విషయమై కేంద్ర ప్రభుత్వంపై సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. 'మేము చెత్త ఏరుకునే వాళ్లం కాదు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఘన వ్యర్థాల నిర్వహణ కోసం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఎలాంటి చర్యలు చేపడుతున్నాయో తెలపాలంటూ డిసెంబరు 12న కేంద్ర ప్రభుత్వాన్ని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. 'దీనిపై అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు రాష్ట్ర స్థాయి సలహా బోర్డులను ఏర్పాటు చేశాయా? చేస్తే.. ఎప్పుడు చేశాయి? సభ్యులు ఎవరు? తదితర వివరాలతో నివేదిక ఇవ్వండి' అని స్పష్టమైన ఆదేశాలను ఇచ్చింది. దీంతో కేంద్రం తరపు కౌన్సిల్ ఆయా వివరాలతో 845 పేజీల అఫిడవిట్‌ను కోర్టుకు మంగళవారం సమర్పించింది. ఈ అంశంపై విచారణ చేపట్టిన జస్టిస్ మదన్ బి. లోకూర్, జస్టిస్ దీపక్ గుప్తాలతో కూడిన ధర్మాసనం కొన్ని ప్రశ్నలు వేయగా.. కౌన్సిల్ సరిగ్గా సమాధానం చెప్పలేకపోయింది. దీంతో న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. 'మీరు అసలు ఏం చేయాలనుకుంటున్నారు? ఈ చెత్తంతా మా మీద పడేయ్యాలని చూస్తున్నారా? అఫిడవిట్‌లో ఏముందో మీరే పూర్తిగా చూడలేదు. కానీ, మేం చూడాలని అనుకుంటున్నారా? ఇలాంటి పనులు ఇంకెప్పుడూ చేయకండి. మేం చెత్త ఏరుకునే వాళ్లం కాదు' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. 'ఈ అఫిడవిట్లో ఎలాంటి సమాచారం లేదు. మేం దీన్ని పరిగణనలోకి తీసుకోలేం' అని తెలిపింది.

# విభజన హామీలపై ఏపీ ఎంపీల సమరం

**ఉభయసభలు పలుమార్లు వాయిదా**

- పత్తాలేని టీఆర్ఎస్ ఎంపీలు
- విభజన హామీలపై నోరుమెదపని వైనం

**నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో**

విభజన చట్టంలో పొందుపరిచిన హామీల అమలు కోసం ఆంధ్రప్రదేశ్ ఎంపీలు పోరుబాట పట్టారు. పార్లమెంట్ లోపల, బయట ఆందోళనలతో అట్టుడికించారు. పార్లమెంట్ సాక్షిగా ఆంధ్రప్రదేశ్‌కు హామీనిచ్చిన ప్రత్యేక హోదాతో పాటు పోలవరం, రాజధాని నిర్మాణం, ఆర్థికలోటు పూడ్చడం తదితర అంశాలపై స్పష్టమైన హామీ ఇవ్వాలని పట్టుబట్టారు. నాలుగేండ్ల ఎదురుచూపుల్లోనే కాలం గడిపారని, ఇంకెప్పుడు ఆంధ్రకు న్యాయం చేస్తారని నిలదీశారు. ఫలితంగా పలుమార్లు ఉభయసభలు వాయిదా పడ్డాయి. ఇక లోక్‌సభలో ఆందోళన చేస్తున్న టీడీపీ ఎంపీలపై స్పీకర్ సుమిత్రా మహాజన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఎంపీలను బెదిరించినంత పని చేశారు. అయినప్పటికీ ఎంపీలు తమ నిరసనను రోజంతా కొనసాగించారు. కాగా ఏపీ అంశాలపై చర్చించేందుకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని ఢిల్లీకి పిలిపిస్తున్నామని జైట్లీ ఉభయసభల్లో ప్రకటన చేశారు. విభజన హామీల అమలుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. విభజన చట్టంలో పొందుపరిచిన హామీలను అమలు చేయాలని, ఏపీకి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆ రాష్ట్రానికి చెందిన అధికార టీడీపీ, ప్రతిపక్ష వైసీపీ ఎంపీలు వేర్వేరుగా ఆందోళన చేపట్టారు. మంగళవారం ఉదయం పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద టీడీపీ ఎంపీలు ప్లకార్డులు ప్రదర్శించగా.. వైసీపీ ఎంపీలు పార్లమెంట్‌లోని ప్రధాన ద్వారం వద్ద నిరసన చేపట్టారు. చేతిలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఏపీకి న్యాయం చేయండి అని నినదించారు. అనంతరం సభ ప్రారంభమైన తరువాత లోక్‌సభలోనూ ఎంపీలు నినాదాలతో హోరెత్తించారు. 'మిత్రధర్మం పాటించండి' 'ప్రత్యేక హోదా ఏమైంది?' 'ఏపీకి న్యాయం చేయండి' అంటూ నినాదాలు చేశారు. ఫలితంగా సభ ప్రశ్నోత్తరాల్లో పది నిమిషాల పాటు వాయిదా పడింది. అనంతరం సభ ప్రారంభమైనప్పటికీ ఎంపీలు ఆందోళన కొనసాగించారు. ఏపీ ఎంపీల నినాదాల నడుమే స్పీకర్ సుమిత్రా మహాజన్ రాష్ట్రపతి ప్రసంగ ధన్యవాద తీర్మానంపై చర్చ చేపట్టారు. ఒకానొక సమయంలో టీడీపీ ఎంపీ మాగంటి బాబు ప్లకార్డులను స్పీకర్ స్థానం వద్ద ప్రదర్శించేందుకు ప్రయత్నించారు. దీంతో ఆగ్రహం చెందిన స్పీకర్ 'ప్లకార్డు నేను పట్టుకోవాలా. ఏంటి ఇది?' అని అన్నారు. పార్లమెంట్ వ్యవహారాల మంత్రి అనంతకుమార్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌ది సున్నితమైన అంశమని చెప్పారు. అన్ని అంశాలను కేంద్రం పరిశీలిస్తోందని, సభను నడవనీయాలని కోరారు. చివరకు జైట్లీ ప్రకటనతో ఆందోళన విరమించారు. రాష్ట్రపతి ప్రసంగ ధన్యవాద తీర్మానం చర్చ సందర్భంగా ఏపీ టీడీపీ ఎంపీ తోట నరసింహం మాట్లాడారు. 'రాజధాని నిర్మాణానికి కేవలం రూ.2,500 కోట్లు మాత్రమే ఇచ్చారు. విభజన చట్టంలో హామీనిచ్చినట్టుగా రాజధాని నిర్మాణానికి అవసరమైన నిధులన్నీ ఇవ్వాలి. అలాగే పోలవరం ప్రాజెక్టు బాధ్యత కేంద్రానిదే. కానీ ఈ బడ్జెట్‌లో పోలవరం ప్రస్తావించలేదు. ఈ బడ్జెట్‌లో ఏపీ ప్రజలకు కేంద్రం విశ్వాసం కల్పించలేకపోయింది' అని అన్నారు. ఇక ప్రత్యేక హోదా బదులు ప్యాకేజీ ఇస్తామన్నారని, కానీ అది కూడా ప్రకటనకే పరిమితమైందని చెప్పారు. 'ఈ బడ్జెట్‌లో రాష్ట్ర ప్రజలను తీవ్రంగా అవమానించారు. మేం ఈ బడ్జెట్‌ను వ్యతిరేకిస్తున్నాం' అని అన్నారు.

**కాంగ్రెస్ గతే బీజేపీకీ : వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి**

విభజన చట్టంలో పొందుపరిచిన హామీలు అమలు చేయకపోతే కాంగ్రెస్ పార్టీకి పట్టిన గతే బీజేపీకి పడుతుందని వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి హెచ్చరించారు. ఎన్నికల ముందు స్వయంగా ప్రధానమంత్రి ప్రత్యేక హోదా హామీనిచ్చారని గుర్తు చేశారు. నాలుగేండ్ల కాలంలో రాష్ట్రంలో లక్షా 30 వేల కోట్ల నిధుల లోటు ఉందన్నారు. ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో ఉద్యోగులకు వేతనాలు కూడా చెల్లించలేని పరిస్థితి వస్తుందని అన్నారు. ఇక పోలవరం ప్రాజెక్టు పై స్పష్టత కరువైందని వాపోయారు. 'అసలు ఈ ప్రాజెక్టు వ్యయం భరిం చేది కేంద్రమా రాష్ట్రమా అన్నది స్పష్టతలేదు. బాధితుల పరిహారం ఎవరు భరించాల న్నదానిపై స్పష్టత కరువైంది' అని అన్నారు. 'కేంద్రం ఏపీని ఇతర రాష్ట్రాలతో సమానంగా చూడటం లేదు. రాష్ట్రాన్ని విభజించి కాంగ్రెస్, బీజేపీ మోసం చేశాయి. బీజేపీ వైఖరి మారకపోతే కాంగ్రెస్‌కు పట్టినగతే పడుతుంది' అని స్పష్టం చేశారు.


**పత్తాలేని టీఆర్ఎస్ ఎంపీలు...**

విభజన హామీలతో పాటు ప్రత్యేక హైకోర్టు, కాళేశ్వరం ప్రాజెక్టుకు నిధులు, మిషన్ కాకతీయ, భగీరథకు ఆర్థికసాయాన్ని విస్మరించిన కేంద్రంపై పోరాటం చేస్తామన్న టీఆర్ఎస్ మాటలు ప్రకటనలకే పరిమితం అయ్యాయి. విభజన చట్టంపై పక్క రాష్ట్రం ఎంపీలు పెద్దఎత్తున ఆందోళన చేస్తున్న సమయంలో పార్లమెంట్‌లో టీఆర్ఎస్ ఎంపీలు పత్తాలేకుండా పోయారు. రెండు రాష్ట్రాల ఎంపీలు కలిసి కేంద్రంపై మరింత ఒత్తిడి చేస్తే రెండు రాష్ట్రాలకు ఎంతోకొంత మేలు జరిగేదని పలువురు భావిస్తున్నారు.

**అంతర్జాతీయం**

## మొగదీషు పేలుళ్ల కేసులో...

## దోషికి ఉరిశిక్ష : మిలిటరీ కోర్టు



**మొగధీషు :** సోమాలియా రాజధాని మొగధీషులో పేలుళ్లకు పాల్పడ్డ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కీలక నిందితున్ని మిలిటరీ కోర్టు మంగళవారం దోషిగా తేల్చింది. పేలుళ్ల సూత్రధారికి ఉరిశిక్ష విధిస్తున్నట్టు తీర్పు ఇచ్చింది. ప్రాసిక్యూషన్ వెల్లడించిన వివరాల ప్రకారం...మొగధీషులో గతేడాది అక్టోబర్14న ట్రక్కు బాంబు పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 512 మంది మృతి చెందగా, మరో 316 మంది గాయపడ్డారు. ఈ కేసులో అల్-షాబాబ్ ఉగ్రసంస్థకు చెందిన హస్సన్ అదాన్ ఇషాక్ (23) సహా ముగ్గురిపై అభియోగాలు నమోదయ్యాయి. ఈ కేసుపై మిలిటరీ కోర్టు విచారణ చేపట్టింది. పేలుళ్ల సూత్రధారిగా ఇషాక్‌ను నిర్ధారించి ఉరిశిక్ష విధించింది. పేలుళ్లకు సహకరించిన మరో దోషికి జీవిత ఖైదు విధించింది.

## కాంగోలో ఉన్మాది వీరంగం...

- **ఆస్పత్రిలోకి చొరబడి 12మంది రోగులపై కత్తితో దాడి**

**బ్రజావిల్లే :** కాంగోలో ఓ ఉన్మాది వీరంగం సృష్టించాడు. స్థానిక గోమా ఆస్పత్రిలోకి మంగళవారం అర్ధరాత్రి చొరబడి 12 మంది రోగులపై కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో రోగులు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. ఈ ఘటనకు బాధ్యత వహిస్తున్నట్టు ఏ ఉగ్రసంస్థ కూడా ప్రకటించుకోలేదు. కాగా, ఇస్లామిస్ట్ అలైడ్ డెమోక్రటిక్ ఫోర్సెస్ (ఏడీఎఫ్) మిలిటెంట్లు గత కొన్నేండ్లుగా కాంగోలో బీభత్సం సృష్టిస్తున్నారు. గతనెలలో 14 మంది ఐరాస సహాయక సిబ్బందిని హతమార్చారు. బెనీ ప్రాంతంలో ఏడీఎఫ్ జరిపిన దాడుల్లో 700 మంది మృతిచెందినట్టు ఐరాస పేర్కొన్నది. గోమా ఆస్పత్రిపై దాడికి పాల్పడింది ఏడీఎఫ్ సభ్యుడేనని పోలీసులు అనుమానిస్తున్నారు.

## అమెరికా నటుడు జాన్ మహోని కన్నుమూత

**వాషింగ్టన్ :** అమెరికా నటుడు జాన్ మహోనీ (77) మృతి చెందారు. గత కొంతకాలంగా ఆయన క్యాన్సర్ వ్యాధితో బాధ పడుతూ చికాగో నగరంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో మంగళవారం తుదిశ్వాస విడిచినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. జాన్ మృతి పట్ల పలువురు ప్రముఖులు, సినీ నటీనటులు ప్రగాఢ సంతాపం తెలిపారు. జాన్ అంచెలంచెలుగా సినీ పరిశ్రమలో ఎదిగారు. తనకంటూ ఓ ప్రత్యేకతను చాటుకున్నారు. విలక్షణ నటుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన ప్రతిభ గుర్తింపుగా 2000లో ఎస్ఏజీ అవార్డు, టోనీ అవార్డులు దక్కాయి.

# మాల్దీవుల్లో టెన్షన్...టెన్షన్

- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అరెస్ట్
- మాజీ అధ్యక్షుడి గృహనిర్బంధం
- శరవేగంగా మారుతున్న పరిస్థితులు



**మాలే:** హిందూ మహా సముద్రంలోని ద్వీప దేశమైన మాల్దీవుల్లో రాజకీయ సంక్షోభం క్రమక్రమంగా ముదురుతోంది. ఇక్కడి పరిస్థితులు శరవేగంగా మారిపోతున్నాయి. జైళ్లలో ఉన్న రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని సుప్రీంకోర్టు గతవారం ఆదేశించింది. అయితే, మాల్దీవుల అధ్యక్షుడు అబ్దుల్లా యామీన్ సుప్రీం ఆదేశాలను బేఖాతర్ చేశారు. రాజకీయ ఖైదీలను విడుదల చేసేందుకు ఆయన ససేమిరా నిరాకరించారు. దీంతో, మాల్దీవుల్లో రాజకీయ సంక్షోభం ప్రారంభమైంది. యామీన్ పార్లమెంటును సస్పెండ్ చేసి సోమవారం నుంచి 15 రోజులపాటు దేశంలో అత్యవసర పరిస్థితి ప్రకటించారు. మంగళవారం తెల్లవారుజామున ప్రధాన న్యాయమూర్తి అబ్దుల్లా సయీద్, మరో న్యాయమూర్తి అలీ హమీద్‌తో పాటు మాజీ అధ్యక్షుడు మౌమున్ అబ్దుల్ గయూమ్‌ను ప్రత్యేక బృందాలు అదుపులోకి తీసుకున్నాయి. వీరిని ఎందుకు అరెస్ట్ చేయాల్సి వచ్చిందో వెల్లడించకపోవడంతో మాల్దీవుల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. మాల్దీవుల రాజ్యాంగ నిబంధనల ప్రకారం... దేశాధిపతికి ఉన్న ప్రత్యేక హక్కుల మేరకు ఎమర్జెన్సీ విధించినట్టు స్థానిక మీడియా తన వార్తా కథనాలలో వెల్లడించింది. ఎమర్జెన్సీ పర్యాటక రంగాన్ని ఏ మాత్రం ఇబ్బంది పెట్టబోదని, రిసార్ట్స్, విమాన సర్వీసులు, యధావిధిగా పనిచేస్తాయని ప్రభుత్వం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.

**మాల్దీవుల్లో రాజకీయ సంక్షోభం...**

వివిధ కేసుల్లో మాజీ అధ్యక్షుడు మొహమద్ నషీద్ సహ పలువురు రాజకీయ నాయకులపై జరుగుతున్న విచారణ చెల్లదని సుప్రీంకోర్టు గత వారం తీర్పునిచ్చింది. నిర్బంధంలో ఉన్న తొమ్మిది మంది ప్రతిపక్ష ఎంపీల విడుదలకు ఆదేశాలు జారీ చేసింది. తన రాజకీయ ప్రత్యర్థులను కోర్టు ఆదేశాలకు అనుగుణంగా విడుదల చేయడానికి అధ్యక్షుడు అబ్దుల్లా యామీన్ నిరాకరించడంతో మాల్దీవుల్లో సంక్షోభం తలెత్తింది. మొహమద్ నషీద్‌పై 2015లో చేపట్టిన విచారణ రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు తన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. నషీద్ ప్రస్తుతం ప్రవాసంలో ఉన్నారు. మాల్దీవుల్లో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన తొలి అధ్యక్షుడు ఆయనే. సుప్రీంకోర్టు ఉత్తర్వులను అమలు చేస్తానని ప్రకటించిన మాల్దీవుల పోలీస్ కమిషనర్‌ను ప్రభుత్వం ఇప్పటికే తొలగించింది. అధ్యక్షుడు అబ్దుల్లా యామీన్‌ను అభిశంసించేందుకు లేదా పదవీచ్యుతుడిని చేసేందుకు జరిగే ఎలాంటి ప్రయత్నాలనైనా అడ్డుకోవాలని సైన్యాన్ని ఆదేశించింది.

**అబ్దుల్లా యామీన్ రాజీనామా చేయాలి: నషీద్**

ప్రతిపక్షంతో జట్టు కట్టిన మాజీ అధ్యక్షుడు అబ్దుల్ గయూమ్‌ను అబ్దుల్లా యామీన్ ప్రభుత్వం గృహ నిర్బంధంలో ఉంచింది. తాను ఏ తప్పూ చేయలేదని, తనను ప్రభుత్వం అరెస్టు చేయజాలదని మద్దతుదారులను ఉద్దేశించి చేసిన వీడియో ప్రసంగంలో అబ్దుల్ గయూమ్ చెప్పారు. అందరూ ధైర్యంగా ఉండాలని వారికి ఆయన పిలుపునిచ్చారు. మాజీ అధ్యక్షుడు నషీద్ మీడియాతో మాట్లాడారు. అబ్దుల్లా యామీన్ ప్రభుత్వ చర్యలు చట్టవిరుద్ధమన్నారు. అధ్యక్ష పదవికి ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. హిందూ మహాసముద్రంలో ఉండే మాల్దీవులు సుమారు 1200 దీవుల సముదాయం. దేశ ఆర్థిక వ్యవస్థకు పర్యాటకమే వెన్నెముక. అబ్దుల్లా యామీన్ 2013లో అధికార పగ్గాలు చేపట్టారు. అప్పటి నుంచి దేశంలో భావ ప్రకటనా స్వేచ్ఛ, న్యాయవ్యవస్థ స్వతంత్రత కొరవడ్డాయనే విమర్శలు, ప్రత్యర్థుల నిర్బంధంపై విమర్శలు ఉన్నాయి. తాజా పరిణామాల నేపథ్యంలో ప్రతిపక్షాల మద్దతుదారులు నిరసనలకు దిగుతుండటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు.

### భారత సైన్యం సాయం కోరిన నషీద్

**ప్రస్తుతం తీవ్రమైన రాజకీయ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న మాల్దీవుల్లో పరిస్థితిని చక్కదిద్దేందుకు అవసరమైన జోక్యం చేసుకోవాలని ఆ దేశ మాజీ అధ్యక్షుడు మహ్మద్ నషీద్ భారత్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం శ్రీలంకలో వున్న ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాలను అక్కడి ప్రభుత్వం వ్యతిరేకించటం అంతా ఓ కుట్ర ప్రకారమే జరుగుతోందన్నారు. నియంతృత్వ భావజాలమున్న యమీన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నిర్బంధంలో ఉన్న రాజకీయ ఖైదీల విడుదలకు భారత సైన్యం సహకారం కోరారు.**

# మద్దతు ధరలపై కేంద్రం మోసపూరిత ప్రకటన

- రైతు బడ్జెట్ అని చెప్పడం పరిహాసమే
- అఖిల భారత రైతు పోరాట సమన్వయ సమితి



మాట్లాడుతున్న ఎఐకెఎస్‌సీసీ నాయకులు

**నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్**

మద్దతు ధరలపై కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రకటన మోసపూరితమని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతు బడ్జెట్ అని చెప్పడం పరిహాసంగా ఉన్నదని అఖిల భారత రైతు పోరాట సమన్వయ సమితి (ఎఐకెఎస్‌సీసీ) విమర్శించింది. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. అరిబండి ప్రసాదరావు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ నిర్దిష్ట కేటాయింపులతో కాకుండా ఒక ఎన్నికల మేనిఫెస్టో మాదిరిగా ఉందని విమర్శించారు. అన్ని పంటల ఉత్పత్తి ఖర్చులకు 50 శాతం అదనంగా కలిపి మద్దతు ధర నిర్ణయించిందని చెప్పడం వాస్తవం కాదన్నారు. వాస్తవ లెక్కల ప్రకారం సమగ్ర ఉత్పత్తి ఖర్చు (సి2)పై 2017 రబీలో వివిధ పంటలకు ఇచ్చిన మద్దతు ధరలు పరిశీలిస్తే మూడు శాతం నుంచి 38 శాతం వరకు మాత్రమే ఉన్నదని చెప్పారు. ఉత్పత్తి ఖర్చు నిర్ధారణ మార్చి లెక్కవేసినట్లు ఉందని విమర్శించారు. రైతు స్వరాజ్య వేదిక నేత విస్సా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త ఫార్ములా ప్రకారం వరి పంట కనీస మద్దతు ధర రూ. 1550 కాకుండా రూ.1675గా నిర్ణయించాల్సి ఉందన్నారు. కందుల విషయానికొస్తే రూ.5450 నుంచి రూ.4977కు పడిపోయిందన్నారు. ఈ నేపథ్యంలో 2022కల్లా రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న మోడీ ప్రభుత్వానికి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. అఖిల భారత రైతు కూలీ సంఘం అధ్యక్షులు వేములపల్లి వెంకటరామయ్య మాట్లాడుతూ ఎమ్‌ఎస్ స్వామినాథన్ కమిటీ చేసిన సిఫారసులను ఏ ప్రభుత్వాలూ అమలు చేయడం లేదని విమర్శించారు. 2017 ఒక్క ఖరీఫ్ సీజన్‌లోనే కనీస మద్దతు ధరలు, మార్కెట్‌లో ఉన్న ధరలకు తేడాను పరిశీలిస్తే దేశ వ్యాప్తంగా 32,700 కోట్ల రూపాయలు నష్టపోతున్నారని వివరించారు. 2018–19 కేంద్ర బడ్జెట్‌లో మార్కెట్ జోక్యం, మద్దతు ధరల పథకానికి రూ.950 కోట్ల నుంచి రూ.200 కోట్లకు తగ్గించిందన్నారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ మాట్లాడుతూ రైతు బడ్జెట్‌గా చెబుతున్నట్టు కేటాయింపులు చేయలేదన్నారు. ఒక్క ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకానికి మాత్రం రూ.13 వేల కోట్లకు పెంచారని, ఈ పథకం ద్వారా లాభపడేది బీమా కంపెనీలే అని అన్నారు. ప్రకృతి వైపరీత్యాల ప్రస్తావ లేదన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతాంగా సమాఖ్య నాయకులు ఉపేందర్‌రెడ్డి, తెలంగాణ రైతాంగ సమితి నేత గోపాల్, తెలంగాణ రైతు కూలీ సంఘం నాయకులు భూతం వీరన్న, స్వరాజ్ అభియాన్ నేత శేషగిరి, తెలంగాణ రైతు జేఏసీ నేత కన్నెగంటి రవి తదితరులు పాల్గొని ప్రసంగించారు.



## సీపీఎస్ రద్దు కోసం

# ఎస్‌టీయూ పోరుయాత్ర

**నవతెలంగాణ బ్యూరో– హైదరాబాద్**

కొత్త పింఛన్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పోరుయాత్ర నిర్వహిస్తున్నామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి భుజంగరావు, జి సదానందంగౌడ్ తెలిపారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 11న హన్మకొండలో రాష్ట్రస్థాయి మహాధర్నా నిర్వహిస్తున్నామనీ, దానికి సన్నాహకంగా అన్ని జిల్లాల్లో సదస్సులు, సమావేశాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర నాయకత్వంలో బుధవారం నుంచి పోరుయాత్ర ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. అందరి ఉద్యోగ బాధ్యతలు ప్రభుత్వానివే అయినప్పుడు కొందరికే పింఛన్ ఇవ్వడం సరికాదని విమర్శించారు.

# నేడు చంద్రబాబు రాక

- పొలిట్‌బ్యూరో, కేంద్ర కమిటీ నేతలతో భేటి
- మోత్కుపల్లి వ్యాఖ్యలపైనా చర్చ ?
- మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య చేరిక

**నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్**

తెలుగుదేశం కేంద్ర కమిటీ అధ్యక్షులు, ఏపీ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు బుధవారం హైదరాబాద్ రానున్నారు. పార్టీ తెలంగాణ పొలిట్‌బ్యూరో సభ్యులు, కేంద్ర కమిటీ నాయకులతో విడివిడిగా సమావేశం కానున్నారు. అనంతరం రాష్ట్రస్థాయి సాధారణ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొంటారు. ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర రాజకీయాలు, పల్లె పల్లెకు తెలుగుదేశం కార్యక్రమంపై సమీక్ష జరగనుంది. అంతేగాక గత నెలలో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో టీడీపీని టీఆర్ఎస్‌లో విలీనం చేయాలని పొలిట్‌బ్యూరో సభ్యులు మోత్కుపల్లి నర్సింహులు చేసిన వ్యాఖ్యలపై చర్చ జరిగే అవకాశాలు ఉన్నట్టు సమాచారం. దీనిపై పార్టీ రాష్ట్ర నాయకత్వం సీరియస్‌గా స్పందించిన విషయం విదితమే. ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి ఇ.పెద్దిరెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి తదితర నేతలు అప్పట్లో మోత్కుపల్లి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఆయనపై విమర్శలకు దిగిన సంగతి తెలిసిందే. బాబుతో ప్రత్యేక భేటిల్లో నాయకులు మోత్కుపల్లిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేసే అవకాశం లేకపోలేదు. అంతేగాక ఇప్పటికే పార్టీ అధ్యక్షులు ఎల్.రమణ, నర్సింహులు వ్యాఖ్యలపై నివేదిక సమర్పించారు. అయితే చంద్రబాబు మోత్కుపల్లితో సమావేశం సందర్భంగా మందలించే అవకాశం ఉందే తప్ప, ఆయనపై చర్యలు తీసుకునే పరిస్థితులు లేవని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మోత్కుపల్లి, బాబుకు ఉన్న సాన్నిహిత్యం నేపథ్యంలో హెచ్చరికలతో సరిపెడతారని పార్టీ సీనియర్ నేతలు చెప్పారు. పల్లె పల్లెకు తెలుగుదేశం కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో సమీక్షించిన అనంతరం చంద్రబాబు భవిష్యత్తు కార్యాచరణను తెలంగాణ పార్టీకి నిర్దేశిస్తారని సమాచారం. ఇదిలావుండగా బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి జరిగిన అన్యాయంపై చర్చ జరిగే అవకాశం ఉంది. తెలుగు రాష్ట్రాలకు ఎన్డీయే ప్రభుత్వం ఎలాంటి కేటాయింపులు చేయలేదని, అన్యాయం చేసిందని రమణ విమర్శించిన విషయం తెలిసిందే. కాగా మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్యతో పాటు మరికొందరు చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరనున్నారనీ ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

# స్టడీ సర్కిల్ అధికారులను సస్పెండ్ చేయాలి

- ఉత్తమ్ కుమార్ రెడ్డి
- అభ్యర్థుల ఆందోళనకు మద్దతు



అభ్యర్థులకు మద్దతు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

**నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్**

తెలంగాణ స్టడీ సర్కిల్‌లో అవినీతికి పాల్పడ్డ అధికారులను వెంటనే సస్పెండ్ చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. అవినీతి అధికారులను తొలగించాలంటూ తెలంగాణ స్టడీ సర్కిల్ ఎదుట గత ఐదు రోజులుగా ఆందోళన చేస్తున్న అభ్యర్థులకు మంగళవారం ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వంలో అవినీతి పేరుకుపోతున్నదని, చివరికి బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థుల డబ్బులను కూడా దోచుకునే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. తెలంగాణ స్టడీ సర్కిల్‌లో జరుగుతున్న అవినీతిపై ఎస్సీ, బీసీ అభ్యర్థులు ఆందోళన చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. సుమారు రూ.7 కోట్లకు పైగా అవినీతి జరిగినట్టు ఆరోపణలు ఉన్నా ఇప్పటి వరకు అధికారులపై సంబంధిత శాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. అవినీతి అధికారులకు ప్రభుత్వమే అండగా ఉంటుందని తెలిపారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చాక అవినీతిపరులపై చర్యలు తీసుకుంటామన్నారు.

**అవినీతిపై నిగ్గు తేల్చాలి – పొన్నం**

తెలంగాణ స్టడీ సర్కిల్‌లో జరిగిన అవినీతి ఆరోపణలపై సర్కార్ నిగ్గు తేల్చాలని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ కోరారు. స్టడీ సర్కిల్‌లోని ఒక్కో అభ్యర్థిపై రూ. 3లక్షలు ఖర్చు చేస్తున్నట్టు లెక్కలు చూపుతున్నారని, వాస్తవానికి అన్ని డబ్బులు ఖర్చు చేస్తున్నారా? లేదా? అన్న అంశాలపై సర్కారు పట్టించుకోవడం లేదని విమర్శించారు.

**అవినీతి అధికారులను శిక్షించాలి – జైభీం యూత్ ఇండియా**

స్టడీ సర్కిల్‌లో అవినీతికి పాల్పడ్డ అధికారులను శిక్షించాలని జైభీం యూత్ ఇండియా ఫౌండర్ చైర్మెన్ ముకురాల శ్రీహరి డిమాండ్ చేశారు. కోట్ల రూపాయల అవినీతి జరిగినా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. స్టడీ సర్కిల్లో విద్యా బోధన కోసం గ్రూప్ 1, గ్రూప్ 2 అధికారులను నియమించడంతో అభ్యర్థులకు నాణ్యమైన బోధన అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. స్టడీ సర్కిల్‌కు ఐఏఎస్ లేదా ఐపీఎస్ అధికారిని డైరెక్టర్‌గా నియమించాలని తెలిపారు. రెకమండేషన్‌ల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయకుండా పోటీ పరీక్ష ద్వారా ఎంపికైన అభ్యర్థులను మాత్రమే స్టడీ సర్కిల్‌కు ఎంపిక చేయాలన్నారు.



# మోడల్‌స్కూళ్లలో అడ్మిషన్ల కోసం 21వేల దరఖాస్తులు

## ఆన్‌లైన్ దరఖాస్తుకు 16 వరకూ అవకాశం

**నవతెలంగాణ బ్యూరో– హైదరాబాద్**

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 194 మోడల్‌స్కూళ్లలో సీట్ల భర్తీకోసం దరఖాస్తులు భారీగా వస్తున్నాయి. జనవరి 23 నుంచి అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. ఏడు నుంచి పదో తరగతి వరకూ ఖాళీగా ఉన్న సీట్లకు (సుమారు 300సీట్లు) ఇప్పటికే 10,275 దరఖాస్తులు అందాయి. ఆరో తరగతిలో అడ్మిషన్ల కోసం ఇప్పటికీ 10,954 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. అత్యధికంగా నిజామాబాద్ జిల్లాలో 923 దరఖాస్తులు, జగిత్యాలలో 843 దరఖాస్తులు అందాయి. అతితక్కువగా నిర్మల్ జిల్లాలో కేవలం 91 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుకు ఈనెల 16వరకు దరఖాస్తుకు గడువు ఉంది. అయితే చివరి వారం రోజుల్లో భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఆరో తరగతిలో ఒక్కో పాఠశాలలో వంద మందికి (రెండు సెక్షన్లు) అడ్మిషన్లు ఇస్తారు. కాగా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 15న రాత పరీక్ష ఉంటుంది. వీరంతా ఏప్రిల్ 11నుంచి 14 వరకు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.







# జూన్‌లోగా భగీరథ పూర్తయ్యేనా..!

- నాలుగు రోజులుగా స్మితసభర్వాల్ వరుస భేటీలు
- తాజా పరిస్థితిపై పూర్తిస్థాయిలో అధ్యయనం



**నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్**

మిషన్ భగీరథ తాగునీటి ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి కార్యదర్శి స్మితా సభర్వాల్ దృష్టిసారించారు. ఇటీవల గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య విభాగం(ఆర్‌డబ్ల్యూఎస్) కార్యదర్శిగా స్మితకు సీఎం కేసీఆర్ బాధ్యతలు అప్పగించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఎస్‌కే జోషీ నియామకం రోజునే స్మితను ఆర్‌డబ్ల్యూఎస్‌కు కార్యదర్శిని చేశారు. ఈ నేపథ్యంలో ఆమె పూర్తిస్థాయిలో భగీరథను అధ్యయనం చేయడం ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 సెగ్మెంట్లల్లో భగీరథ పనులు జరుగుతున్నాయి. దాదాపు రూ.43 వేల కోట్లు ప్రధాన పనులకు, ఇంట్రా విలేజ్‌కు రూ.5500 కోట్లు వ్యయమవుతాయని ప్రభుత్వం పూర్తిస్థాయి ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్)లో తెలియజేసింది. ఇప్పటిదాకా సీఎం ఆదేశాల మేరకు స్మిత ఆయా జిల్లాల్లో జరుగుతున్న పనులను అప్పుడప్పుడు భౌతికంగా తనిఖీ చేయడం, పరిశీలించడం చేశారు. కార్యదర్శిగా బాధ్యతల్లోకి వచ్చాక వైస్‌చైర్మెన్ వేముల ప్రశాంత్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ ఇన్ చీఫ్ బి.సురేందర్‌రెడ్డితో జరిగిన ఉన్నతస్థాయి సమీక్షకు హాజరయ్యారు. గత నాలుగురోజులుగా నేరుగా ఇంజినీర్ ఇన్ చీఫ్, చీఫ్ ఇంజినీర్లతో ఆమె సమావేశాలు నిర్వహిస్తున్నారు. మొత్తం ప్రాజెక్టుపై క్షుణ్ణంగా అవగాహన చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. మంగళవారం భగీరథకు చెందిన నలుగురు చీఫ్ ఇంజినీర్లతో భేటీ అయ్యారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి అంచనా నివేదిక(డీపీఆర్), డిజైన్లు, అటవీ అనుమతులు, రైల్వే క్రాసింగులు, ప్రాజెక్టు కోసం సేకరించిన భూమి, పరిహారం చెల్లింపులపై సమీక్ష చేశారు. అంతేగాక ప్రాజెక్టులో కీలకమైన ఇంటెక్‌వెల్స్ నిర్మాణం, వాటర్ ట్రీట్‌మెంటు ప్లాంట్లు(డబ్ల్యూటీపీ), మెయిన్ పైపులైన్లు, ఇంట్రా విలేజ్ నెట్‌వర్క్ తదితర పనులపై విషయమై చీఫ్ ఇంజినీర్లతో మాట్లాడారు. ఏఏ పనులు ఏ స్థాయి వరకు వచ్చాయి, ఎప్పటి వరకు పూర్తిచేయగలమనే సంగతులను నేరుగా సీఈలతో స్మిత సభర్వాల్ చర్చించినట్టు సమాచారం. అంతేగాక భగీరథ పనులకు నిధులను సొంతం వాణిజ్య బ్యాంకులు, హడ్కో, నాబార్డు తదితర కేంద్ర ప్రభుత్వ సంస్థల నుంచి కూడా రుణాలుగా తీసుకున్నారు. మొత్తం రుణాలు, వడ్డీ వివరాలు, బ్యాంకుల గురించి సమీక్షలో తెలుసుకున్నారు. ప్రతినెలా ప్రాజెక్టు వడ్డీల కోసం రూ.950 కోట్లు ప్రభుత్వం చెల్లిస్తున్నది. ఇప్పటివరకు ప్రాజెక్టుకు సంబంధించి 85 శాతం పనులు పూర్తిచేసినట్టు అధికారులు చెబుతున్నారు. గత డిసెంబరు నాటికే గ్రామాల్లో తాగునీటిని సరఫరా చేస్తామని పదే పదే సీఎం కేసీఆర్ సైతం ఆయా సందర్భాల్లో ప్రకటించారు. అయితే అది జరగలేదు. దీనిపై కార్యదర్శి స్మిత సభర్వాల్ అధికారులో ప్రస్తావించినట్టు తెలిసింది. జూన్ వరకు మొత్తం ప్రాజెక్టు పనులు పూర్తయ్యేలా ఇటు అధికారులను, అటు వర్క్ ఏజెన్సీలను అప్రమత్తం చేసేలా ప్రణాళిక రూపొందించుకుని ముందుకు పోవాలని ఆమె భావిస్తున్నట్టు సమాచారం. ఈమేరకు జిల్లాల వారీగా నివేదికలు ఇవ్వాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ ఇన్ చీఫ్ బి.సురేందర్‌రెడ్డిని ఆదేశించారు. త్వరలోనే సెగ్మెంట్ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి అధికారులు, వర్క్ ఏజెన్సీలతో ప్రత్యేకంగా భేటీ కావాలని నిర్ణయించినట్టు అధికారులు చెబుతున్నారు. పనులు జరుగుతున్న జిల్లాల్లో ఆకస్మిక తనిఖీలు చేసే అవకాశాలు లేకపోలేదని తెలిసింది. ఈనేపథ్యంలో చీఫ్ ఇంజినీర్లు, వర్క్‌ఏజెన్సీల్లో ఒకింత కదలిక వచ్చింది. వచ్చే వేసవికాలంలో నీటిఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులను స్మిత సభర్వాల్ ఆదేశించారు.

సంపాదకీయం

# ప్రధాని పకోడీ ఉద్యోగాలు



ప్రధాని నరేంద్ర మోడీ ఇటీవల ఒక ప్రయివేటు చానల్‌కు ఇంటర్వ్యూ ఇస్తూ రోడ్ల పక్కన పకోడీలు అమ్ముకోవడం కూడా స్వీయ ఉద్యోగమేనని సెలవిచ్చారు. పకోడీలు అమ్ముకునే వ్యక్తి రోజుకు తక్కువలో తక్కువ రూ.200 సంపాదిస్తాడనీ చెప్పుకొచ్చారు. ఈ ఉద్యోగాల లెక్కలు ఏ పుస్తకాల్లోనూ ఏ కాగితాల్లోనూ నమోదు కావన్నారు. ప్రధాని ఉద్ఘాటన మేరకు వీధుల వెంట పకోడీలు, బజ్జీలు, పునుగులు అమ్ముకునేవారు, చిన్న చిన్న సామాను విక్రయించి ఏ పూటకాపూట పొట్టపోసుకునే అల్పాదాయ జీవులందరూ ఉపాధి పరులే. ప్రభుత్వం వల్లనే వారందరికీ సదరు ఉద్యోగాలొచ్చాయి మరి! ఉద్యోగాల కల్పనపై బాధ్యతాయుత స్థానంలో ఉన్న మోడీ ఈ విధమైన ప్రకటన చేయడం విషాదం. మూడున్నరేండ్ల పాలనలో ఉద్యోగ, ఉపాధి కల్పనలో ఎన్‌డీఏ సర్కారు ఘోరంగా వైఫల్యం చెందిందనడానికి పకోడీ వాలాలపై ప్రధాని వక్కాణింపు తిరుగులేని సాక్ష్యం. కాంగ్రెస్ పాలనలో దేశం సర్వనాశనమైందని నిరుద్యోగం పెరిగిందని తాము భిన్నమైన వారమని ఎన్నికల్లో తూలనాడిన మోడీ, తామొస్తే ఏడాదికి రెండు కోట్ల కొత్త ఉద్యోగాలిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఆ వాగ్దానం నెరవేర్చడంలో ఘోరంగా వైఫల్యం చెందారు. తీరా ఎన్నికల ఏడాదిలో పడ్డాక పకోడీ వాలాల సృష్టి సైతం తమ ప్రభుత్వ ఘనతగా నిస్సిగ్గుగా చాటుతున్నారు. సర్కారు వైఫల్యం నుంచి ప్రజలు, ముఖ్యంగా నిరుద్యోగ యువతను పక్కదారి పట్టించేందుకు పకోడీ పంచాంగ శ్రవణాన్ని ఆలాపిస్తున్నారు. బీజేపీ సర్కారు తమకు నిజంగానే ఉద్యోగాలిస్తుందేమోనని కండ్లల్లో వత్తులేసుకొని కొన్నేండ్లుగా ఎదురు చూస్తున్న కోట్లాది మంది నిరుద్యోగుల్లో ప్రధాని పకోడీ సూత్రీకరణపై సహజంగానే ఆగ్రహావేశాలు మిన్నంటాయి. ఆదివారం మోడీ ర్యాలీ సందర్భంగా బెంగళూరు నగరంలో విద్యార్థులు పకోడీలు అమ్మి నిరసన తెలిపారు. పకోడీల అమ్మకమూ స్వయం ఉపాదేనన్న ప్రధాని ఉవాచ నిరుద్యోగులపై సంధించిన క్రూరమైన జోక్ అని సీపీఐ(ఎం) ఆగ్రహం వ్యక్తం చేసింది. మాజీ ఆర్థిక మంత్రి, కాంగ్రెస్ నేత చిదంబరం అయితే వీధుల్లో అడుక్కుతినే వారు కూడా మోడీ సర్కారు దృష్టిలో ఉద్యోగులేనని ఘాటుగా విమర్శించారు.

**ప్రభుత్వ వైఫల్యాల మూలంగా ఉపాధి కోసం కోట్లాది మంది నిరుద్యోగులు నిరీక్షిస్తుండగా పకోడీలు, కూరగాయలు అమ్ముకోవాలని ప్రధానే సలహా ఇవ్వడం దుర్మార్గం. యువతను వంచించిన బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజు తొందర్లోనే ఉంది.**

ఉద్యోగ కల్పన విషయంలో ప్రధాని వ్యాఖ్యలపై సర్వత్రా దుమారం చెలరేగ్గా, నిరుద్యోగులను అపహాస్యం చేయడంపై తప్పు ఒప్పుకొని లెంపలేసుకొని జాతికి క్షమాపణలు చెప్పాల్సిన బీజేపీ, పార్లమెంట్ సాక్షిగా సమర్థించుకోవడం మరీ దారుణం. అధికారపార్టీ అధ్యక్షుడు అమిత్ షా సోమవారం రాజ్యసభలో చేసిన తొలి ప్రసంగంలో ప్రధాని 'పకోడీ' వ్యాఖ్యలు సరైనవేనని కితాబిచ్చారు. నిరుద్యోగులు ఖాళీగా ఉండే బదులు సాయంత్రం వేళల్లో పకోడీలు అమ్ముకొని ఎంతోకొంత సంపాదించడం మంచిదేని ఉద్బోధించారు. బీజేపీ నాయకుల వాలకం చూస్తుంటే నిరుద్యోగులను వీధులపాల్జేసేందుకు కంకణం కట్టుకున్నట్లు కనిపిస్తోంది. ఉపాధి కల్పనపై 2015-16లో వచ్చిన ప్రభుత్వ సర్వే ప్రకారం దేశంలో పని చేయగలిగే వారి (వర్క్‌ఫోర్స్)లో సగం మంది నిరుద్యోగులే. అంటే 120కోట్ల జనాభాలో 60కోట్లమంది ఉపాధి రహితంగా కొట్టుమిట్టాడు తున్నారన్నమాట. వీరిలో 41శాతం మంది చిన్న చిన్న పనులు చేసుకోవడం ద్వారా నెలకు రూ.ఐదు వేల వరకు సంపాదిస్తున్నారు. అటువంటి వారి వార్షిక ఆదాయం రూ.60 వేలు. ప్రజలు ఇలాంటి అల్పాదాయ వనరులపై ఆధారపడటానికి కారణం ప్రభుత్వరంగంలో ఉద్యోగాల భర్తీ నిలిచిపోవడమే. ప్రయివేటురంగంలో అరకొరగా తక్కువ వేతనాలతో ఉద్యోగులను నియమించుకుంటున్నారు. ప్రభుత్వేతర సంఘటిత రంగంలో కాంట్రాక్టు, ఔట్‌సోర్స్ ప్రాతిపదికన అదీ స్వల్ప సంఖ్యలో ఉపాధి దొరుకుతోంది.

ప్రభుత్వాలు అనుసరిస్తున్న నయా-ఉదారవాద విధానాల మూలంగా జరుగుతున్న ఆర్థికాభివృద్ధి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెంచట్లేదు. పెద్ద నోట్ల రద్దు ఉద్యోగావకాశాలను ఘోరంగా దెబ్బతీసింది. గ్రామీణ ప్రాంతాల్లో అసలే ఉపాధి అవకాశాలు తక్కువ. పెద్ద నోట్ల రద్దు వలన వాటికీ కోత పడింది. తయారీ రంగ వృద్ధి వెనకపట్టు పట్టింది. దీంతో కంపెనీలు ఉద్యోగులను తొలగిస్తున్నాయి. వారి చేరికతో నిరుద్యోగ సైన్యం ఇంకా పెరుగుతోంది. స్వయం ఉపాధి రుణాల కోసం సర్కారు అట్టహాసంగా అమలు చేస్తున్న ముద్రా పథకంలో 90శాతం మంది లబ్ధిదారులకు రూ.50 వేల లోపు లోను రావడం కనాకష్టంగా ఉంది. ఈ స్వల్ప పెట్టుబడితో స్వయం ఉపాధి ఎంతమాత్రం సాధ్యం కాదు. ఉద్యోగాల కల్పన కోసమంటూ పెట్టుబడుల కోసం మోడీ తిరిగినన్ని దేశాలను ఏ ప్రధానీ తిరగలేదు. అయినా పెట్టుబడులొచ్చింది లేదు. ఈ కఠోర సత్యం ఇటీవల సర్కారు విడుదల చేసిన ఆర్థిక సర్వేలో నిక్షిప్తమైంది. మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా, స్టార్టప్ ఇండియా వంటివి ప్రచారానికే పనికొచ్చాయి. ప్రభుత్వ వైఫల్యాల మూలంగా ఉపాధి కోసం కోట్లాది మంది నిరుద్యోగులు నిరీక్షిస్తుండగా పకోడీలు, కూరగాయలు అమ్ముకోవాలని ప్రధానే సలహా ఇవ్వడం దుర్మార్గం. యువతను వంచించిన బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజు తొందర్లోనే ఉంది.

# అవకాశవాద సంకీర్ణాలు.. ఆగ్రహంతో జర్మన్ కార్మికవర్గం



ఎం. కోటేశ్వరరావు

మన దేశంలో ఎక్కడ అధికారం వుంటే అక్కడకు చేరే పార్టీలు, చట్టసభలకు ఎన్నికైన వారు అర్రులు చాచటం కనిపిస్తోంది. ఐరోపాకు గుండెకాయ వంటి జర్మనీలో గతేడాది సెప్టెంబరు 24న ఎన్నికలు జరిగినా అధికారం పంచుకోవాలంటే పార్టీలు భయపడే పరిస్థితి నెలకొంది. అధికారం వుంటే బలపడతామని మన దగ్గర అనుకుంటుంటే గద్దెనెక్కితే జనానికి దూరం అవుతామనే భయం అక్కడి పార్టీల్లో ఏర్పడటంతో నాలుగు నెలలు గడిచినా ఇంతవరకూ అక్కడ ప్రభుత్వం ఏర్పడలేదు. క్రిస్టియన్ డెమోక్రటిక్ పార్టీ(సీడీయూ) నాయకత్వంలో అధికార భాగస్వామిగా వున్న సోషల్ డెమోక్రటిక్ పార్టీ(ఎస్‌పీడీ) తాజా ఎన్నికలలో దిమ్మదిరిగే పరాజయాన్ని చవి చూసింది. దాంతో అటు సూర్యుడు ఇటు పొడిచినా, సప్త సముద్రాలు ఇంకిపోయినా తాము తిరిగి సంకీర్ణ కూటమి సర్కార్‌లో చేరేది లేదని ప్రకటించిన ఎస్‌పీడీ మరోసారి సీడీయూతో కలసి ప్రభుత్వ ఏర్పాటుకు దారులు వెతుకుతోంది. సంకీర్ణ ప్రభుత్వంపై ఎస్‌పీడీ యువ నాయకత్వంలో తలెత్తిన వ్యతిరేకతను బుజ్జగించేందుకు పూనుకున్నారు. ఇదే సమయంలో జర్మన్ కార్మికవర్గం 2003 తరువాత తొలిసారిగా తమ డిమాండ్లపై సమ్మెకు దిగింది. పార్లమెంటు రద్దు కాకుండా చూసేందుకు, ఎన్నికలను నివారించేందుకు జర్మన్ పెట్టుబడిదారులు వివిధ పార్టీలపై వత్తిడి తెస్తున్నారు. ఇది రాసే సమాయానికి ప్రయత్నాల గురించి వార్తలు తప్ప నిర్దిష్ట రూపం తీసుకోలేదు.

> **నిజమైన కార్మికవర్గ పార్టీల గురించి మరోసారి కార్మికవర్గంలో పునరాలోచన ప్రారంభమైంది. సోవియట్, తూర్పు ఐరోపాలో సోషలిస్టు వ్యవస్థలను కూల్చివేసిన తరువాత ఇదొక ఆశాజనక పరిణామం. వెంటనే ఏవో పెనుమార్పులు సంభవిస్తాయని చెప్పలేం గానీ, తిరిగి వామపక్ష శక్తుల పెరుగుదలకు ఇది నాంది అని చెప్పవచ్చు.**

పార్లమెంట్‌లోని 709 స్థానాలలో ప్రస్తుత ఛాన్సలర్ ఏంజెలా మెర్కెల్ నాయకత్వంలోని సీడీయూ దాని మిత్రపక్షానికి 246, ప్రధాన ప్రతిపక్షమైన ఎస్‌డీపీకి 153, జర్మనీ ప్రత్యామ్నాయ పార్టీ(ఎఎఫ్‌డీ)కి 94, ఫ్రీ డెమోక్రటిక్ పార్టీకి 80, వామపక్షం(పూర్వపు కమ్యూనిస్టు పార్టీ) 69, గ్రీన్ పార్టీకి 67 వచ్చాయి. గతంలో అవి చేసిన ప్రకటనలు, వాటి విధానాల ప్రకారం ఈ పార్టీలలో ఏ రెండూ భావసారూప్యత కలిగినవి కావు. అయినప్పటికీ చివరి నిమిషంలో అనూహ్య పరిణామం జరిగితే తప్ప సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు సీడీయూ, ఎస్‌పీడీ సిద్ధం అవుతున్నాయి. అయితే ఆ సంకీర్ణం ఎంతకాలం మనగలుగుతుందనేది ప్రశ్నార్థకం. తిరిగి ప్రభుత్వంలో చేరాలా వద్దా అని చర్చించేందుకు డిసెంబరు ఆరున ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్‌పీడీ ప్రతినిధులు సంకీర్ణ కూటమి చర్చలకు అంగీకారం తెలిపారు. అయితే సమావేశం హాలు వెలుపల పార్టీ యువజన విభాగం నిరసన ప్రదర్శనలు చేసింది. జనవరి పన్నెండున తాము ప్రతిష్ఠంభన అధిగమించి ఒక అంగీకారానికి వచ్చామని రెండు పార్టీలు ప్రకటించాయి. జనవరి 21న ఎస్‌పీడీ అసాధారణ పార్టీ సమావేశం జరపగా 642మంది ప్రతినిధులు హాజరయ్యారు. దానిలో సంకీర్ణ ప్రభుత్వంలో చేరేందుకు 362మంది అనుకూలంగా 279మంది వ్యతిరేకంగా ఓటు చేశారు. జనవరి 26న అంతిమంగా రెండు పార్టీలు లాంఛనంగా చర్చలు ప్రారంభించాయి.

రాజకీయ రంగంలో ఈ పరిణామాలు చోటు చేసుకున్న సమయంలోనే జర్మన్ కార్మికులు అనేక పరిశ్రమలలో వాటితో నిమిత్తం లేకుండా ఆందోళనల సన్నాహాలు జరిపి గత కొద్ది వారాలుగా హెచ్చరిస్తున్న విధంగానే సమ్మెకు దిగారు. కార్మికుల్లో తలెత్తిన ఆందోళన ఎస్‌పీడీలో విభేదాలకు తెరతీసిందని చెప్పవచ్చు. జనవరి 31, ఫిబ్రవరి 1,2 తేదీలలో జర్మనీ అంతటా ఆటోమోటివ్, ఎలక్ట్రికల్ పరిశ్రమలలో మూడు రోజుల పాటు 24 గంటల చొప్పున సమ్మె చేశారు. ఇతర పరిశ్రమలకు ఈ ఆందోళన వ్యాపించనున్నట్టు వార్తలు వెలువడ్డాయి. ఎనిమిదిశాతం వేతనాలు పెంచాలని, వారానికి పని గంటలను 28కి తగ్గించాలన్నవి వారి ప్రధాన డిమాండ్లు. లోహ పరిశ్రమలలో కూడా సమ్మె బ్యాలట్ నిర్వహించగా 95నుంచి 100శాతం వరకు కార్మికులు మద్దతు తెలిపారు. నూతన సంకీర్ణ ప్రభుత్వం సామాజిక సంక్షేమంపై దాడులతో పాటు మిలిటరిజం, రాజ్య అణచివేత యంత్రాంగాన్ని పటిష్ట పరచనున్నదనే విశ్లేషణలు వెలువడుతున్న సమయంలోనే కార్మికులు వాటికి వ్యతిరేకంగా సమ్మె సన్నాహాలు చేస్తున్నారు. జర్మన్ కార్మికవర్గానికి సంస్కరణవాదశక్తులు నాయకత్వం వహిస్తున్నాయి. వారి పోరాట పటిమను నీరు గార్చేందుకు గతంలో అవి తీవ్ర ప్రయత్నాలు చేశాయి. ఈ కారణంగానే ఈ శక్తులకు నిలయంగా వున్న ఎస్‌పీడీ దాని చరిత్రలో ఎన్నడూ రానన్ని తక్కువ ఓట్లు తెచ్చుకొని జనం నుంచి ఎంతగా వేరు పడిపోయిందీ నిరూపించుకుంది. ఆ కారణంగానే మరోసారి ప్రభుత్వంలో చేరకూడదని గంభీరంగా ప్రకటనలు చేసినా దాని స్వభావం కారణంగా మరోసారి చేతులు కలిపేందుకు పూనుకుంది.


అమెరికాలోని డెమోక్రటిక్ పార్టీ, బ్రిటన్‌లోని లేబర్ పార్టీలో కూడా ఇలాంటి ధోరణులే ప్రబలంగా వుండగా వాటికి వ్యతిరేకంగా బెర్నీశాండర్స్, జెర్మీ కార్బిన్ మాదిరి కొంత మేరకు ప్రతిఘటించే శక్తులు ముందుకు వస్తున్నట్టు ఎస్‌పీడీలో జరుగుతున్న పరిణామాలు సూచిస్తున్నాయి. అయితే వాటికి ఎన్నో పరిమితులున్నాయి. ఆ పార్టీ 28ఏండ్ల యువనేత కెవిన్ కుహనెట్ నాయకత్వంలోని యువజన విభాగం సంకీర్ణ ప్రభుత్వంలో చేరాలనే ప్రతిపాదనకు వ్యతిరేకంగా చేసిన తిరుగుబాటును పార్టీ నాయకత్వం విఫలం చేసింది. అనేక మంది యువకులు పార్టీ వామపక్ష బాట పట్టాలని వత్తిడి తెస్తున్నారు. మరోవైపు జర్మనీలో పచ్చి మితవాద ధోరణులను కూడా ప్రోత్సహించటం, తాజా ఎన్నికలలో అలాంటి శక్తులు గణనీయమైన సీట్లు సాధించటాన్ని కూడా చూడవచ్చు. గతంలో ఎస్‌పీడీ అధ్యక్షుడిగా పని చేసి ఆ పార్టీ నుంచి విభేదించి విడిపోయి వామపక్ష పార్టీని ఏర్పాటు చేసిన వారిలో ఒకరైన ఆస్కార్ లాఫోంటెయిన్ తాజా పరిణామాల గురించి మాట్లాడుతూ ఒక నూతన వామపక్ష వుద్యమాన్ని ప్రారంభించాల్సిన అవసరం ఏర్పడిందని చెప్పారు. దానిలో వామపక్ష పార్టీ, గ్రీన్స్, ఎస్‌పీడీలోని కొన్నిశక్తులు దగ్గర కావచ్చునని, ఆ వుద్యమంలో సాంప్రదాయ పార్టీలే కాకుండా కార్మికోద్యమనేతలు, సామాజిక సంస్థలు, శాస్త్రవేత్తలు, సాంస్కృతిక కార్యకర్తలు ఇతరులు కూడా తోడు కావాలని ఒక



పత్రికా ఇంటర్వ్యూలో చెప్పారు. వామపక్ష పార్టీ పార్లమెంటరీ పార్టీ నాయకురాలు, లాఫోంటెయిన్ సతీమణి అయిన సారా వాజెన్‌చెట్ ఈ ప్రతిపాదనకు మద్దతు పలుకుతూ ఆ ఉద్యమంలో ప్రముఖులు చేరితేనే ప్రయోజనం ఉంటుందని, రాజకీయంగా తమ దారిలో ఒక కదలిక వున్నదన్న భరోసా, ఆశను జనంలో రేకెత్తిస్తుందని అన్నారు. అయితే కొత్త నిర్మాణాలేమీ అవసరం లేదు బలమైన వామపక్ష పార్టీ ఉంటే చాలనేవారు కూడా లేకపోలేదు. దీనిలో డెమోక్రటిక్ సోషలిజంగా పేరు మార్చుకున్న తూర్పు జర్మనీలోని కమ్యూనిస్టు పార్టీకి చెందిన వారు, ఎస్‌పీడీ నుంచి విడిపోయిన వామపక్ష శక్తులు, ఇతర వామపక్ష శక్తులు, వ్యక్తులతో వామపక్ష పార్టీ ఏర్పడింది. ఎస్‌పీడీ గ్రీన్స్, వామపక్ష పార్టీ కలసి ప్రభుత్వాన్ని ఏర్పరచి కార్మికవర్గ హక్కులను పరిరక్షించవచ్చనే ఒక అభిప్రాయం కూడా లేకపోలేదు. అయితే పార్లమెంటులో బలాబలాలు ఆవిధంగా లేవు, గతంలో ఎస్‌పిడి నాయకత్వంలో సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడినపుడు కార్మికులకు నష్టదాయకమైన చర్యలు తీసుకున్న కారణంగానే లాఫోంటెయిన్ వంటి వారు ఎస్‌పిడి నుంచి బయటకు వచ్చారు.

ఇటీవలి కాలంలో జర్మనీ సహా అనేక ధనిక దేశాలలో వెలువడుతున్న ధోరణుల గురించి జాగ్రత్తగా పరిశీలించాల్సి వుంది. నయా ఉదారవాదం, ఆర్థిక, సామాజిక అసమానతలను వ్యతిరేకించే శక్తులు పచ్చిమితవాద, నయా నాజీశక్తులతో కొన్ని విషయాల్లో పోటీపడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. వలసలను అనుమతించటం ఇటీవలి కాలంలో పెద్ద సమస్యగా వుంది. చౌకశ్రమశక్తిని సొమ్ము చేసుకొనేందుకు కార్పొరేట్ రంగం వలస కార్మికులను అనుమతించాలని పాలకపార్టీలపై వత్తిడి తెస్తోంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో తలెత్తిన అసంతృప్తిని సంఘటిత వుద్యమాలవైపు మరల కుండా నయా ఉదారవాద విధానాలను గట్టిగా సమర్ధించే నయా నాజీలు, మితవాదులు వలస కార్మికులను వ్యతిరేకిస్తూ అసంతృప్తిని దురహంకారంవైపు మళ్లించేందుకు పూనుకున్నారు. నయా ఉదారవాద విధానాలను వ్యతిరేకించే శక్తులు కూడా వలసలను వ్యతిరేకిస్తూ జాతీయవాద భావాలను ప్రోత్సహిస్తున్నారు. నిజానికి ఇవి రెండూ బొమ్మా బొరుసు వంటివే. ఈ ధోరణులు వామపక్ష ఉద్యమాల అభివృద్ధికి ఆటంకం కలిగించేవే. ఉదాహరణకు ప్రత్యామ్నాయ జర్మనీ అనే మితవాద పార్టీ వలసలను పూర్తిగా వ్యతిరేకిస్తున్నది. మరోవైపు 'జర్మనీలో జీవించాలని కోరుకొనే ప్రతి ఒక్కరికీ మనం అవకాశం ఇవ్వలేం' అని వామపక్ష పార్టీ నేతలు చెబుతున్నారు. వలసవచ్చిన వారితో తక్కువ వేతనాల రంగంలో పోటీ పెరుగుతుందని, ఇండ్ల అద్దెల పెరుగుదలతో పాటు పాఠశాలల్లో ఇబ్బందులు పెరుగుతాయని వామపక్ష పార్టీ నేత లాఫాంటెయిన్ పేర్కొన్నారు. ప్రపంచం ధనిక దేశాలను చుట్టుముట్టిన 2008నాటి అర్థిక సంక్షోభం అటు పెట్టుబడిదారులతో పాటు ఇటు దాన్ని వ్యతిరేకించే వివిధ శక్తులలో కూడా ఒక మథనం ప్రారంభానికి దోహదం చేసింది.

ధనిక దేశాలలో సంక్షేమ చర్యలకు కోతతో పాటు, కార్మికవర్గ హక్కులపై నానాటికీ దాడి తీవ్రమవుతోంది. 2008లో ప్రారంభమైన సంక్షోభంలో ధనిక దేశాలలో రెండవ ప్రపంచ యుద్ధం తరువాత సోషలిస్టులుగా, వామపక్ష శక్తులుగా చెలామణి అయిన శక్తుల ఆచరణ మిగతావారికంటే భిన్నంగా లేదనే అంశం గత పదేండ్లలో తేటతెల్లమైంది. అందువల్లనే వాటికి అనేక ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఈ పూర్వరంగంలో నిజమైన కార్మికవర్గ పార్టీల గురించి మరోసారి కార్మికవర్గంలో పునరాలోచన ప్రారంభమైంది. సోవియట్, తూర్పు ఐరోపాలో సోషలిస్టు వ్యవస్థలను కూల్చి వేసిన తరువాత ఇదొక ఆశాజనక పరిణామం. వెంటనే ఏవో పెనుమార్పులు సంభవిస్తాయని చెప్పలేం గానీ, తిరిగి వామపక్ష శక్తుల పెరుగుదలకు ఇది నాంది అని చెప్పవచ్చు. ■



డాక్టర్ చుక్కారామయ్య

# పోరాటాలతోనే పూర్వవైభవం

రామయ్యమాట

నల్లగొండ ఒక పట్టణం మాత్రమే కాదు ఒక ఉద్యమ కేంద్రం. ఆనాడు ఎంతో మందికి స్ఫూర్తినిచ్చిన జిల్లా. అక్కడి ప్రతి ఊరువెనుక ఒక ఉద్యమం. జనగామ నుంచి సూర్యాపేట పోతుంటే వెల్లుట్ల, కామారెడ్డిగూడెం(ఇది బందగి చనిపోయిన స్థలం), మొండ్రాయి, రామవరం ఇలా చెప్పుకుంటూ పోతే జనగామ తాలుకాలోని ప్రతి గ్రామానికీ ఒక వీరగాథ ఉంది. అట్లాంటి వీరగడ్డ నల్లగొండలో సీపీఐ(ఎం) రెండో మహాసభలు జరుగుతున్నాయంటే ఈ ఘటనలన్నీ గుర్తుకు వస్తున్నాయి. అంతేకాదు అప్పట్లో భువనగిరిలో జరిగిన ఆంధ్రమహాసభ నాటి ఉద్యమానికి ఒక కొత్త మలుపునిచ్చింది. అప్పటి వరకూ ఆంధ్రమహాసభ నాయకులు ఆనాటి హైదరాబాద్ ప్రభుత్వానికి మహజర్లిచ్చి సంతృప్తిపడేవారు. కానీ, భువనగిరి ఆంధ్రమహాసభ ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయం తీసుకున్నది. ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి పోరాటం చేయాలని నిర్ణయించింది. ఈ పోరాటమే సాయుధపోరాటానికి బీజాలు వేసింది. అలాంటి ప్రాంతంలో ఈనాడు మరోసారి కమ్యూనిస్టు పార్టీ మహాసభలు జరుగుతుంటే పాత జ్ఞాపకాలన్నీ మదిలో మెదులుతున్నాయి. ఈనాడుండే పరిస్థితులకు అనుగుణంగా కొత్త ఉద్యమాలకు భాష్యం ఇవ్వాలని తెలంగాణలో ఇటీవల బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్‌ఎఫ్) అవిర్భవించింది. చాలా మంది బీఎల్‌ఎఫ్‌ను ఎన్నికల కోసమే అనుకోవచ్చు. కానీ ప్రజాఉద్యమంలో ఎన్నికలు ఒక మైలురాయి మాత్రమే కానీ సర్వస్వం కాదు. ఎన్నికల కన్నా ప్రజాపోరాటాలు ప్రధానం. ప్రజాపోరాటాలు అంటే చేసేది ఏ ప్రజల పక్షానా అనేదీ చూడాలి. దీని అర్థం అణగారిన ప్రజల కోసం చేసే ప్రజాపోరాటం అని. అది ఏ టీవీల్లో రాని ప్రజల పోరాటం. తాగునీళ్ల దగ్గరి నుంచి సాగునీటి వరకూ ప్రతి సమస్య గురించీ పోరాడాలి. అలాంటి ప్రజాపోరాటాలకు కేంద్రంగా ఉన్న నల్లగొండలో మార్క్సిస్టు పార్టీ రాష్ట్ర మహాసభలు జరగడం, నాటి పోరాటాలకు సంబంధించిన ఎన్నో సన్నివేశాలు కార్యకర్తలకు ప్రేరణగా నిలుస్తాయి. మహాసభలు నిర్వహించడం చాలా మంది ఎన్నికల కోసం అనుకుంటారు. కానీ ఇది తప్పు. నల్లగొండలోని చరిత్ర ఎన్నికలతో ఏర్పడింది కాదు. ప్రజాపోరాటాలతో నల్లగొండ చరిత్ర ఏర్పడటమే కాకుండా తెలంగాణకు కొత్తబాటలు వేసిన ప్రదేశం.

ప్రజల్లో ఏవర్గం యొక్క సమస్యలు తీసుకున్నామనేదే చాలా ప్రధానం. కొందరు ఎన్నికల కోసమే కులాల జపం చేస్తారు. మరికొందరు వారి సమస్యలను తీసుకొని పోరాడుతుంటారు లేదా ఆ వర్గం ప్రజల సమస్యలపై అదే ప్రజలను భాగస్వాములు చేస్తారు. ప్రజలు భాగస్వాములు అయితే దాంతో ఏర్పడే కష్ట, నష్టాలను వారు భరిస్తారు. ఆ కష్టాలే వారికి ఉద్యమస్ఫూర్తినిస్తాయి. దాంతో చైతన్యం పెరుగుతుంది. ఆ చైతన్యంతోనే ప్రజలు కమ్యూనిస్ట్ పార్టీకి జేజేలు కొట్టారు. ఆనాడు రావి నారాయణరెడ్డి రెండు లక్షలకు పైగా మెజార్టీతో గెలిచారు. ఇంచుమించుగా అన్ని నియోజక వర్గాల్లోనూ పీడీఎఫ్ అభ్యర్థులే గెలుపొందారు. ఎన్నికల కంటే ముందు ఆ గ్రామాల్లో వచ్చిన వర్గపోరాటమే దానికి కారణం. ఎన్నికల ముందు జరిగే ప్రచారం అభ్యర్థులకు తాత్కాలికమైన మనోధైర్యం, కొంత ఆత్మవిశ్వాసం ఇస్తుంది. కానీ, పోరాటాలు మాత్రమే పునాదిశక్తిని ఇస్తాయి. కాబట్టి ఈనాడు జరుగుతున్న ఈ మహాసభల్లో ఎన్నో ఉద్యమాలకు అంకురార్పణ చేసేలా తీర్మానాలు చేయాల్సి ఉంది. అది పూర్వ చరిత్రకు, వైభవానికి దిక్సూచి అవుతుంది. ప్రజల త్యాగాలే కొత్తచరిత్రకు నాంది పలుకుతుంది.

నల్లగొండలో జరుగుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర ద్వితీయ మహాసభలకు వెళ్లాలని ఉన్నా, శరీరం సహకరించక వెళ్లలేకపోయాను. కానీ ఆ మహాసభలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నాను. మహాసభల్లో యువకుల సమస్యలపై ప్రధానంగా నిరుద్యోగ సమస్యపై చర్చించాలి. దీంతో పాటు వ్యవసాయ రంగంలోని సమస్యలపై, దళితులు, గిరిజనులు, కార్మికులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించాలి. తద్వారా ఆయా వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపించాలి.

- ప్రముఖ విద్యావేత్త, సామాజిక విశ్లేషకులు. ■

# అమిత్‌షా పకోడీ.. మోడీ చాయ్.. నిరుద్యోగ భారత్




ఎం. విప్లవకుమార్

పకోడీలు అమ్ముకోవడం కూడా మేము కల్పించే ఉపాధేనని పార్లమెంటులో ప్రకటించిన ఏకైక దేశంగా ప్రపంచ చరిత్రలో మన ఒక్క దేశమే మిగిలిపోవచ్చు. శ్రమపట్ల గౌరవం, శ్రామికుని పట్ల మర్యాద ఉండాల్సిందే. కానీ, చదివిన చదువుకు చేసే పనికీ సంబంధం లేకుండా ఉంటేనే అభ్యంతరం. అవసరాలు, అవకాశాలు, వనరులు ఎన్ని ఉన్నా బలవంతంగా ఆ పరిస్థితులలోకి నెట్టేస్తూ అడ్డగోలుగా మాట్లాడితే ఎంతటివారిపైనైనా ఆగ్రహం కలగక మానదు. బీటెక్ చేసినవారు బీట్ కానిస్టేబుల్ అవుతున్నారు. ఎంటెక్ చదివినవారు ఖైదీలను కాపలాకాసే జైలర్ అవుతున్నారు. పీజీలు చదివినవారు ఉపాధి హామీ పనిలో ఊపిరి పోసుకుంటున్నారు. చదివిన చదువులకు చేసే పనికి సంబంధం లేకుండా పోయిన పుణ్యం మూటగట్టుకున్నది మాత్రం ప్రభుత్వాలే. రాజ్యాధినేతల వలనే విద్యాధికులు అగౌరవపాలవుతున్నారు. ఉన్నత విద్యనభ్యసించినవారు అడ్డామీద కూలీలుగా మారడానికి కారణం మాత్రం అరిసే ఆకలి పేగులు కాదు పాలకుల విధానాలు మాత్రమేనన్న విషయం మనం గుర్తించాలి.

రాజ్యసభలో రాష్ట్రపతికి ధన్యవాదాల తీర్మానం పెడుతూ బీజేపీ అధ్యక్షులు, ఎంపీ అమిత్‌షా నిరుద్యోగులు పకోడీలమ్ముకొని బతకడం ఉత్తమం అని వ్యాఖ్యానించారు. ఉపాధి కల్పించాల్సిన పాలకులు పకోడీలేసుకుని బతకమని ఉచిత సలహాలు ఇవ్వడం దుర్మార్గం. బువ్వపెట్టకుండా బూస్ట్ తాగిస్తామని బురదనీళ్ళు భుక్తి మార్గమని చెప్పి చేతులెత్తేసిన చందంగా అమిత్‌షా తీరున్నది. నిరుద్యోగులు పకోడీలమ్ముకొని బతికితే మరి ప్రభువులు ఏం చేయడానికి ఉన్నారు అన్న ప్రశ్న ఉత్పన్నం అవుతున్నది. ప్రతి ఏటా 2 కోట్ల ఉద్యోగాలిస్తామని చెప్పి గద్దెనెక్కిన బీజేపీ ఆ రకంగా ఉద్యోగాలను భర్తీ చేయలేదు. మూడేండ్ల ఉత్సవాలను పూర్తి చేసుకున్న కేంద్ర ప్రభుత్వం ఇప్పటికి 6 కోట్ల ఉద్యోగాలివ్వాలి. కానీ, 2 లక్షల 37 వేల ఉద్యోగాలకు మించి ఒక్క ఉద్యోగం కూడా అదనంగా ఇవ్వలేదు. ఇచ్చిన హామీలకు వాటి చేతలకు నక్కకూ, నాగలోకానికీ ఉన్నంత దూరం ఉన్నదనే సామాన్యుల సామెతలానే ఉంది. ముద్ర బ్యాంకు, స్కిల్ ఇండియా, స్టార్టప్ ఇండియా అంటూ 15 వందల కోట్లకు పైగా దుర్వినియోగం చేశారు. నేడు అమిత్‌షా వ్యాఖ్యలు చూస్తే బీజేపీ పాలకులు రేపు పకోడీ ఇండియా అని ప్రకటించినా ఆశ్చర్యపోనవసరం లేదు. పకోడీలమ్ముకోవడమే ప్రభుత్వం కల్పించే ఉపాధి కల్పనైతే మరి ఎంత మంది బీజేపీ నాయకుల పిల్లలకు పకోడీ మార్గాన్ని చూపించారో ప్రకటిస్తే దేశ ప్రజలకు, యువతకు మార్గదర్శకత్వం వహించనట్లుండేది. కానీ, ఆ రకమైన పకోడీ పథకం ప్రజలకు, పైసల పథకం పాలకుల పిల్లలకు అన్నటువంటి భావన వారికి ఉందనిపిస్తున్నది.

అమిత్‌షా కొడుకు జైషా స్థాపించిన టెంపుల్ ఎంటర్ ప్రైజెస్ కంపెనీ 50 వేల ఆదాయంతో మాత్రమే నడిచేది. కానీ, బీజేపీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 80 కోట్ల టర్నోవర్‌ని ఆ కంపెనీ సాధించింది. ఇది 16 వేల శాతం వృద్ధిరేటు పొందిందని "ద వైర్ వెబ్‌సైట్" వెల్లడించింది. ఇంతలా కోట్లాది రూపాయలు దేశ సంపదని కొడుకులకు పకోడీలా వేయించి పెట్టి ఆరగింపచేసిన వారు పకోడీలు అమ్మేవారి కొడుకులు పారిశ్రామికవేత్తలు కావొచ్చు అనడంతో దేశం నివ్వెరపోతోంది. జైషా తండ్రి పకోడీలు వేసుకుంటేనే ఒక్క ఏడాదిలోపే వందకోట్ల దాకా సంపాదించేంతటి పారిశ్రామికవేత్త కాగలిగాడా? అనేది మనం ఆలోచించాలి. ఇప్పటికే దేశంలో పకోడీలు అమ్ముకుని బతికేవారి పిల్లలు బడా పారిశ్రామికవేత్తలు ఎంతమంది అయ్యారన్న ప్రశ్నకు సమాధానం సున్నా మాత్రమే. యువ



భారతంతో ఆటలాడుకునే రాజకీయ నాయకుల ప్రకటనల యెడల జాగ్రత్త వహించాల్సిన బాధ్యత యువజనులదే. 2018 జనవరిలో ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నివేదిక ప్రకారం 2016 మార్చి 1 నాటికి కేంద్ర ప్రభుత్వ శాఖల్లో గ్రూప్-ఎలో 15,284, గ్రూప్-బి గెజిటెడ్‌లో 26,310, గ్రూప్-బి నాన్ గెజిటెడ్‌లో 49,740, గ్రూప్- సిలో 21,418 మొత్తంగా 4,12,752 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతిచ్చినా పాలకులు మాత్రం ఖాళీలు భర్తీ చేయకుండా పకోడీ ముచ్చట్లు చెబుతున్నారు. ఇవి నిరుద్యోగుల పరువు తీసేవిగా, కించపరిచేలా ఉన్నాయి. 44 కోట్ల యువజనంతో నిండిన మన దేశం వారి మేధస్సును, పరిజ్ఞానాన్ని దేశాభివృద్ధికి, ఉన్నతికి ఉపయోగించాల్సిందిపోయి పకోడీలు వేసుకోవడానికి పరిమితం చేసే కుట్ర జరుగుతున్నది.

ప్రపంచం నివ్వెరపోయేంతటి పరిజ్ఞానం మన ఇండియాకున్నప్పటికీ దాన్ని పకోడి పరిధిల్లో కుదించే నిర్దేశాలు, ఆలోచనలు, కుట్రలు చేసే వారు దేశభక్తులై పాలిస్తున్నారు. ఇలాంటి విధానాల మూలంగానే నిలువెల్లా దేశాభిమానం ఉన్న యువత విదేశాలకు వలసబోతున్న పరిస్థితి నెలకొన్నది. మోడీ, షాల స్వరాష్ట్రం గుజరాత్‌లో కూడా నిరుద్యోగ సమస్య తీవ్రమై యువత పూర్తి అసంతృప్తితో ఉన్నారని సాక్షాత్తు ఆ రాష్ట్ర గవర్నర్ ఓపీ కోహ్లీ ప్రకటించాడు. యువత ఉన్నత చదువులకు తగినస్థాయి ఉద్యోగం, ఉపాధి లేకపోవడం మూలంగానే యువతలో అసంతృప్తి నెలకొన్నది. ఇది ఏ సమాజానికైనా ప్రమాదకర హెచ్చరికవంటిదని ఆ గవర్నర్ హితబోధ చేస్తున్నా పట్టించుకోకుండా అమిత్‌షా మాత్రం ఎంతగొప్ప విద్యనభ్యసించినా పకోడీలు వేసుకుంటే పారిశ్రామికవేత్తలు కావచ్చుననడం యువతపట్ల వారి చిత్తశుద్ధిని తెలియజేస్తున్నది. చాయ్ చేసుకుని, పకోడీ వేసుకొని స్వయం ఉపాధి చూసుకునే వారికి పాలకులేదో ఉపాధి కల్పించినట్టు ఆ లెక్కలు తమ అకౌంట్‌లో వేసుకునే ప్రభుత్వ దురుద్దేశం స్పష్టమైంది. చాయ్‌వాలా అని ప్రచారం చేసుకుంటున్న మోడీ ప్రధాని అయ్యాడు, పకోడీలు అమ్మితే పారిశ్రామికవేత్తలవుతారు అంటే మరి నేడు పార్లమెంటులో, క్యాబినెట్‌లో చాయ్‌వాలాలు ఎంతమంది ఉన్నారు? పకోడీలమ్మి పారిశ్రామికవేత్తలైనవారు ఈ దేశంలో ఎంతమంది ఉన్నారంటే.. ఎవరూ కనబడరు. పూటకో ప్రకటన, రోజుకో మాట చెప్పడం ఇచ్చిన వాగ్దానాల నుంచి బయటపడడానికి ఇష్టారీతిన మాట్లాడుతున్నారు అన్న విషయం గమనార్హం.

యువసంపదను ధ్వంసం చేస్తూ తమ సంపదను పెంచుకోవడానికి మాత్రమే కృషి చేసే వారి ఇలాంటి వ్యాఖ్యానాల నుంచి ఏం ఆశించగలం. ఉపాధి కల్పన అంటే పకోడీలు వేసుకోవడం, చాయ్ చేసుకోవడం అనే వారి నుంచి ఏం కోరుకోగలం. దేశమంటే సరిహద్దులు, సన్యాసులు, స్వాములు, కాషాయం, కమండలం అనుకునేవారి నుంచి ఏం నేర్చుకోగలం. అ అంటే అణగారిన బిడ్డ కాదు...అందమైన చిత్రపటం, ఆడంబరాల విగ్రహం అని చూపేటోళ్ల నుంచి ఏం తెలుసుకోగలం. ఆ అంటే ఆకలి తీర్చడం కాదు ఆ కుటుంబాలకు ఉపాధి కల్పించడం అభివృద్ధి కాదు అనీ, ఆవును రక్షించడం, ఆవును కీర్తించడం మాత్రమే అభివృద్ధి అంటూ ఆవుతో రాజకీయం చేసే వారి నుంచి ఏం ఆశించగలం? ఫ్యూచర్ ఇండియా ఎలా ఉండాలో నిరుద్యోగులు యువత నిర్ణయించుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. చాయ్, పకోడీ, ఆవు, అభూతకల్పనలు లాంటి వాటివైపు కాకుండా ఉన్నత ఆలోచనలవైపు, ఉపాధి, ఉద్యోగాల కల్పనతో దేశాన్ని సమున్నత అభివృద్ధివైపు అడుగులు వేయించే బాధ్యత దేశ యువతపై ఉన్నదన్న విషయాన్ని విస్మరించరాదు.

సెల్:9030546896

# సృజనకు ఎన్నో మార్గాలు...



పిల్లలను ఏ స్కూల్లో వేద్దాం..? ఎంత మంచి ట్యూషన్ పెట్టిద్దాం..? ఎన్ని మార్కులు వచ్చాయో చెక్ చేద్దాం..? మొదటి ర్యాంకు తెచ్చేందుకు ప్రయత్నిద్దాం.. ఇలా పిల్లల తెలివితేటలను మార్కులకు, ర్యాంకులకు ముడిపెట్టేస్తున్న కాలం. ప్లే స్కూల్ నుంచే ఐఐటీ, జేఈఈ ఓరియెంటేషన్ ఉండాలని కోరుకుంటున్న తరుణం. ఇలా పెరిగిన పిల్లలు పెద్దయితే ఏమవుతారు? ఒక్కసారి ఆలోచిద్దాం. పిల్లలకు చదువుతోపాటు కొంత కళాత్మక దృష్టిని నేర్పించండి. సృజనాత్మకతను అలవరచండి. దానికి ఎన్నో మార్గాలున్నాయి. అందులో కొన్ని...

### కథలు చెప్పండి

ఏ విజ్ఞానానికైనా ఒక పరిమితంటూ ఉంటుంది. ఊహాత్మకశక్తికి అవధులు ఉండవు. ఒక పుస్తకం చదువుతుంటే అందులోని పాత్రలన్నీ మనకళ్లముందుంటాయి. ప్రదేశాలన్నీ కనువిందు చేస్తుంటాయి. పిల్లల్లో ఊహాశక్తి, సృజనాత్మకత పెరగడానికి ప్రధాన మార్గం కథలు. స్మార్ట్‌ఫోన్‌లు, ట్యాబ్‌లకు అతుక్కుపోతున్న పిల్లలు కథలు వింటారా అన్న అనుమానం రావచ్చు. కానీ మనం ఏం అలవాటు చేస్తే అలాగే ఉంటారు. కథలు తల్లిదండ్రులకు, పిల్లలకు మధ్య అనుబంధాన్ని పెంచుతాయి. కథలు ఆ చిన్నారి ఊహలకు రెక్కలు తొడుగుతాయి. మనసు ప్రపంచమంతా చుట్టి వచ్చే అవకాశం ఉంటుంది. అప్పుడు కచ్చితంగా స జనాత్మకత వెల్లివిరుస్తుంది. భవిష్యత్ ఆవిష్కరణలకు నాంది పలికినవారవుతారు. కథలకు కొదువ లేదు. బోలెడంత బాల సాహిత్యం ఉంది. రాజుల కథలు, వీరుల కథలు... ఆ సన్నివేశాల్లో నుంచే స జనాత్మకత పుడుతుంది.

### వాళ్లతోనే చెప్పించండి

అలా కథలు చెప్పడం వల్ల పిల్లలకు భాష తెలుస్తుంది. కమ్యూనికేషన్ స్కిల్స్ కూడా అలవడతాయి. ప్రపంచంలోని ఆ వైవిధ్యం పసితనంలోనే అర్థమవుతుంది. కొత్తవ్యక్తులతో కలిసిపోయే స్వభావం అబ్బుతుంది. కథలు వినడం వల్ల సూక్ష్మగ్రాహకశక్తి వస్తుంది. కథలు ఊహాశక్తినిస్తాయి. ఉత్తేజాన్నిస్తాయి. స్ఫూర్తినిస్తాయి. విలువలను నేర్పిస్తాయి. పిల్లల వయసును బట్టి కథలు ఎంచుకోవాలి. చిన్న పిల్లలు సహజంగా మనుషుల తరువాత జంతువులనే చూస్తారు కాబట్టి.. వాటి కథలతోనే ప్రారంభించండి. మాటలు రాని వయసు పిల్లలకు కూడా కథలు చెప్పొచ్చు. వయసు పెరిగేకొద్దీ కథల స్థాయిని పెంచండి. సంక్లిష్టమైన ఇతివృత్తాలను మాత్రం ఎంచుకోవద్దు. పాత కథలకు కొంత కొత్తదనం జోడించింది. నేటికి తగ్గట్టు.. అన్వయించండి. బొమ్మలు చూపిస్తూ వాళ్లనే కథలు చెప్పమనండి. వారిలో ఊహాశక్తి పెరుగుతుంది. సృజనాత్మకత అలవడుతుంది.

### సృష్టికర్తలుగా...

పిల్లలకు సృజనాత్మక పనులు అలవాటు చేస్తే.. చదువుకుంటూనే వాటిని కొనసాగిస్తారు. ఆత్మవిశ్వాసం కూడా పెరుగుతుంది. సాధారణంగా పిల్లలకి ఏవో కొన్ని బొమ్మలూ ఇచ్చి ఆడిస్తుంటాం. ఇలా చేసే బదులు ఇంట్లో ఉన్న వస్తువులతో రకరకాల వస్తువులు తయారు చేయమని చెప్పండి. మీరు పక్కనే కూర్చుని చేయించండి. దానివల్ల పిల్లల్లో స జనాత్మకంగా ఆలోచించడం అలవాటు అవుతుంది. ఏ పాత వస్తువులు కనిపించినా.. ఏం చేయాలా అని చూస్తారు. ప్రపంచంలో ప్రముఖ వ్యక్తులు ఎంతో మంది ఉన్నారు. వాళ్ల పాత్రల గురించి చెప్పండి. కావాలంటే వాళ్ల పాత్రలను తయారు చేయించండి. వీలయితే పిల్లలనే అలా తయారు చేయండి. మీ ఇంట్లో పిల్లలతోనే కాదు... చుట్టుపక్కల వాళ్లనీ కలిపి ఫ్యామిలీ బుక్ క్లబ్ ఏర్పాటు చేయండి. ఇందులో సరదాగా పిల్లలంతా కథలు చెప్పుకుంటూ ఒక్కో పాత్రని పోషించాలి. ఇందువల్ల తోటిపిల్లలతో సమన్వయం నేర్చుకుంటారు.





### మెదడు స్పందిస్తుంది...

సంగీతం.. పిల్లల మెదడుకు మేత. లయబద్ధమైన సంగీతం ...సంభాషణల శబ్దాలు పసి పాపాయిల మెదడుపై చక్కగా పనిచేస్తాయనీ, వారు వేగంగా..చురుగ్గా స్పందించేలా చేస్తాయనీ చెబుతోంది ఓ తాజా అధ్యయనం. పిల్లల్లో కాగ్నెటివ్ స్కిల్స్ (అభిజ్ఞ నైపుణ్యాలు) దశలవారీగా వ ద్ధి చెందుతాయి. సంగీతం, భాషల్లో ఓ శక్తివంతమైన లయ విన్యాసం ఉంటుంది. పలికే పదాంశాలను ఇతరులూ సులభంగా గ్రహించగలుగుతారు. ఇది పిల్లల్లో మాట్లాడే సామర్థ్యాన్ని పెంచుతుందని పరిశోధకులు పేర్కొన్నారు. లయబద్ధ సంగీతానికి దూరంగా కార్లు, బ్లాక్‌లు వంటివాటితో ఆడుకున్న శిశువులకూ.... ఆకట్టుకునే ఉత్సాహభరితమైన సంగీతాన్ని విన్నవారికీ మెదడు స్పందనల్లో స్పష్టమైన తేడా ఉంటుంది. కాబట్టి మంచి సంగీతాన్ని వినిపించండి. ఇది మెడిటేషన్‌లాగా కూడా ఉపయోగపడుతుంది.

### సినిమాలు చూపించండి...





సినిమాలు ఆకట్టుకునే మాధ్యమం. పిల్లలకు సినిమాలు చూపించడం ఎంతో అవసరం. కేవలం సినిమాలు చూపించి వదిలేయడం కాదు. తనకి నచ్చిన పాత్ర, ఎందుకు నచ్చిందో తెలుసుకోండి. ముగింపు.. ఇలా కాకుంటే ఇంకెలా ఉంటే బావుండేదో.. చెప్పమనండి. చిన్నపాటి నాటకాలు వేయించండి. అందులోని అన్ని పాత్రలు వేయించండి. అలా చేయడం వల్ల ఎదుటివారి కోణమేంటో అర్థం చేసుకునే అవకాశం వీళ్లకొస్తుంది. రోల్ ప్లే మాత్రమే కాదు.. సమాజాన్ని అవగాహన చేసుకోవడానికీ, సమయస్ఫూర్తిని పెంచడానికి ఉపయోగపడుతాయి.

### రంగుల ప్రపంచాన్ని...

మీ చిన్నారులకు రంగులను అందించండి. వారికి నచ్చిన బొమ్మలను వేయమనండి. బంకమట్టితో ప్రతిమలను తయారుచేయమనండి. ఎలా చేయాలనే అంశాన్ని వారి ఇష్టానికే వదిలేయండి. ఇవన్నీ వారిలో కొత్త ఆలోచనల్ని పుట్టిస్తాయి. చాలామంది ఇళ్లలో వాడని వస్తువులను ఎక్కడో ఓ చోట జమచేస్తూ ఉంటారు. అలాంటి వాటి నుంచి ఉపయోగపడే కొన్ని వస్తువులను తీయమనండి. వాటితో ప్రయోగాలు చేసే అవకాశం ఇవ్వండి. వారి మేధకు పదును పెట్టే పదవినోదాలను పూర్తిచేయమనండి. మరీ చిన్నారులైతే కొన్ని బొమ్మలను ఇచ్చి రంగులను వేయమని కూడా చెప్పొచ్చు. ఆంగ్ల పదాల స్పెల్లింగ్స్, వాటికి తెలుగు అర్థాలు ఇలా ప్రతిదీ వారి మెదడుకు పని కల్పించేవాటిని లక్ష్యాలుగా పెట్టండి. వారి ఊహా శక్తులకు మరింత బలం చేకూరాలంటే వివిధ ప్రదేశాలను వారికి పరిచయం చేయాల్సిందే. తరచూ పార్కులూ, మ్యూజియమ్‌లూ, విహార యాత్రలకు తీసుకువెళుతూ ఉండండి. ❄

# మెరిపించే పెరుగు



- చెంచా పెరుగును అర చెంచా నిమ్మ రసంతో కలపండి. ఈ పేస్టును కొంచెం తడిగా ఉన్న ముఖంపై రాయండి. 10 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయండి. ఈ మాస్క్‌ను వారానికి రెండుసార్లు ప్రయత్నించి మెరిసే చర్మాన్ని పొందండి.
- చేతిలో పట్టినన్ని మెంతులను నీళ్ళలో నానబెట్టండి. మరునాడు పొద్దున 1 చెంచా పెరుగుతో కలపండి. దీన్ని మీ చర్మంపై పట్టించి 10 నిమిషాల పాటు ఉంచి, గోరువెచ్చని నీటితో కడిగేయండి. వారానికోసారి ఈ ఫేస్ మాస్క్ ను ప్రయత్నించి ముఖంలో డల్‌నెస్‌ను పోగొట్టుకోండి.
- 1 చెంచా పెరుగును అర చెంచా ఆలివ్ నూనెతో కలపండి. మీ ముఖంపై ఈ మిశ్రమంను పల్చటి పొరగా రాయండి. దీన్ని 15 నిమిషాలపాటు అలానే ఉంచేసి గోరువెచ్చని నీరుతో కడిగేయండి. వారానికోసారి ఈ మాస్క్‌ను ప్రయత్నించి మెరిసే ముఖాన్ని మీ సొంతాన్ని చేసుకోండి.
- ఈ మాస్క్‌ను 2 చెంచాల పెరుగు, అర చెంచా ఆర్గానిక్ తేనెతో కలిపి తయారుచేయండి. ఈ మిశ్రమాన్ని మీ మొఖం, మెడకి పట్టించండి. 10-15 నిమిషాలు అలానే ఉంచేసి, తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయండి. ఈ మాస్క్‌ను వారానికోసారి వాడి మంచి ఫలితాలు పొందండి. ❄

# ఇల్లు మారుతున్నారా?



బదిలీ మీదో, లేదంటే ఏదైనా అవసరం రీత్యా ఇల్లు మారుతున్నారా? అయితే సామాన్లు సర్దుకునేముందు ఈ జాగ్రత్తలు తీసుకోండి.

- టీవీలూ, కంప్యూటర్లు.. ఇతర ఎలాక్ట్రానిక్ వస్తువుల కనెక్షన్లు గుర్తుంచుకోవడం కాస్త కష్టమైన పనే. అందుకే వాటిని ఒక ఫొటో తీసి పెట్టుకోండి. ఆ తర్వాత సులువుగా వైర్లు అమర్చుకోవచ్చు.
- అన్ని వస్తువులను ఒకేచోట కలిపి సర్దేయకూడదు. గదుల్లోని వస్తువుల్ని బట్టి విడివిడిగా సర్దుకుని వాటిపై రాసుకోవాలి.
- విలువైన వస్తువులన్నింటినీ ప్రత్యేకంగా ఒక బ్యాగులో వేసుకుని మీతోనే పెట్టుకుంటే మంచిది.
- మీరు మారబోతున్న ఇల్లుకు అనుగుణంగా ఎక్కడ ఏం పెట్టాలో ముందుగానో ఆలోచించండి. వెళ్లగానే వాటి వాటి స్థానాల్లో సులువుగా అమర్చేయొచ్చు. వీలైతే ఒక చిన్న చార్టు లాంటిది గీసుకుని చూడండి.
- పింగాణీ పాత్రలూ, గ్లాసులు ఉంటే వాటిని ప్యాకింగ్ చేయడంలో కాస్త శ్రద్ధ తప్పనిసరి. ప్లాస్టిక్ ప్లేట్ల మధ్యలో వాటిని ఒకదానితో ఒకటి తగలకుండా జాగ్రత్తగా ఉంచాలి.
- ఒక్కరోజులోనే పూర్తి చేయాలని కాకుండా కొన్ని రోజుల ముందునుంచే ఒక గంట సర్దడానికి కేటాయించడం వల్ల పని సులువవుతుంది. ఎక్కడ ఏ వస్తువు పెట్టామన్న విషయం కూడా సరిగ్గా గుర్తుంటుంది. ఇలా చేయడం వల్ల మీ పని మరింత సులువవుతుంది.. ❄

### ఇట్ల చేద్దాం

**క్యారెట్ ఎండిపోయినట్లు అనిపిస్తే ఈ విధంగా చేయండి. కొద్దిగా నీటిలో ఉప్ప వేసి అందులో క్యారెట్‌ను గంట పాటు నానబెట్టి బయటకు తీస్తే, తాజాగా ఉంటాయి.**

# ఆదివారం వస్తే చాలు...



బోలెడు పనులు లేదా విశ్రాంతితోనే సమయం గడిచిపోతుంది. కానీ ప్రణాళిక ఉంటే గనక సెలవు రోజును కూడా మనకు నచ్చినట్టుగా ఆనందించొచ్చు. అదెలాగో తెలుసుకోండి మరి..

- ముందు రోజు రాత్రి అంటే శనివారం నుంచి మొదలు పెడదాం. మర్నాడు సెలవు కాబట్టి అన్నీ నిదానంగా చేసుకోవచ్చులే అని అనుకోకూడదు. వారంలోని ఇతర రోజుల్లాగే శనివారం కూడా మరుసటి రోజు పనులు పూర్తిచేసుకోవాలి. అప్పుడే పొద్దుటి పూట కాస్త సమయం మిగులుతుంది.
- సెలవురోజు కాబట్టి కాస్త ఆలస్యంగా నిద్రలేస్తాం. కానీ మిగిలిన రోజుల్లానే పొద్దున్నే నిద్రలేవడం మంచిది. వంటపనీ అన్నీ పూర్తి చేసుకుంటే సమయం మిగులుతుంది.
- సెలవురోజున కుటుంబ సభ్యులంతా కలసి భోజనం చేయడం.. వీలైనంత ఎక్కువసేపు గడపడం... వంటివి ఓ నియమంగా పెట్టుకోవాలి. కేవలం ఈ ఒక్క రోజు సెల్‌ఫోను, కంప్యూటరు, ట్యాబ్ లాంటివాటిని ఎంత దూరంగా పెడితే అంత మంచిది.
- ఓ గంట సమయం పెట్టుకుని రాబోయే వారానికి చేయబోయే పనుల్ని ఓ చోట రాసి పెట్టుకోవడం తప్పనిసరి. కుదిరితే దుస్తులు, వాటికి సంబంధించిన యాక్సెసరీలను సిద్ధంగా పెట్టుకుంటే మిగిలిన రోజుల్లో ఒత్తిడి లేకుండా ఉంటుంది. చివరి నిమిషంలో వెతుక్కునే పరిస్థితి ఎదురుకాదు.
- టీవీ చూస్తూ గడిపేయాలనుకుంటారు చాలామంది. కానీ కుదిరితే స్నేహితులతో, దగ్గరి బంధువులతో ఓ ఐదు, పదినిమిషాలు మాట్లాడటం వల్ల సంబంధాలు మెరుగ్గా ఉంటాయి. ఈ మధ్య చాలా బిజీ అయిపోయావు అనే నిష్ఠూరాలు ఉండదు. కాబట్టి దానికి కూడా కొంత సమయం పెట్టుకునేలా చూసుకోవాలి. ❄

# కారణాలు ఇవే...



మహిళలను వేధించే వైట్ డిశ్చార్జ్ సమస్యకు ఇవే కారణం అంటున్నారు.. వైద్యులు. రక్తహీనత గల వారికి ఈ సమస్య వుంటుంది. నెలసరికి వారానికి ముందు కొందరు మహిళల్లో వైట్ డిశ్చార్జ్ సమస్య ఏర్పడుతుంది. శరీరం వేడైతే, నిద్ర తక్కువైతే.. మానసిక ఆందోళన వంటివి మహిళల్లో వైట్ డిశ్చార్జ్‌కు కారణమవుతాయని ఆయుర్వేద నిపుణులు చెప్తున్నారు.

ఇంకా కాలేయం బలహీనత, శుభ్రత లేని ప్రాంతాల్లో మూత్ర విసర్జన చేయడం ద్వారానూ వైట్ డిశ్చార్జ్ సమస్య ఏర్పడుతుంది. అధిక మానసిక ఒత్తిడి, మానసిక ఆందోళన, పౌష్టికాహార లోపం వంటివి కూడా ఈ సమస్యకు దారితీస్తాయి.

పదే పదే ఆలోచిస్తూ కూర్చోవడం, కారం, ఉప్పు వంటివి అధికంగా తీసుకోవడం ద్వారా ఈ సమస్య ఉత్పన్నమవుతుంది. అందుచేత వైట్ డిశ్చార్జ్‌ను నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించడం మంచిదని ఆయుర్వేద నిపుణులు సూచిస్తున్నారు. ❄

# వాస్తవికతే ప్రాణంగా..

Women of the day



**లారా ఇన్గాల్స్ విల్లర్**

**(7 ఫిబ్రవరి, 1867 - 10 ఫిబ్రవరి, 1957)**


చిన్నతనం నుంచి తాను చూసిన జీవితం.. ఎదురైన వాస్తవిక అనుభవాలను కాస్త కల్పన జోడించి ఆమె రాసిన కథలు చిన్నారులను అలరించాయి. లిటిల్ హౌజ్ సీరిస్‌గా ప్రచురించబడిన ఆమె నవలలు ఆ తర్వాత టీవీ సీరియల్స్‌గానూ వచ్చి ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఆమే లారా ఇన్గాల్స్ విల్డర్.


లారా తల్లిదండ్రులు కారోలిన్, చార్లెస్. అక్క మేరీ అమేలియా. వీరి కుటుంబం మిస్సోరిలోని చరిటోన్ కౌంటీకి వలస వచ్చింది. అక్కడ చార్లెస్ ఒక మిల్లులో పని చేసేవాడు. కొద్దిరోజుల తర్వాత అక్కడి నుంచి మిన్నోసోటాకు తిరిగి వచ్చారు.

ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యారు. పాఠశాల విద్యను పూర్తిచేసిన లారా పెండ్లి జరిగింది. కరువు, అగ్ని, ఆర్థిక సంక్షోభాలను తట్టుకోలేక లారా దంపతులు దక్షిణ డకోటాకు ఆ నుంచి మిస్సోరీ వలస వెళ్లారు. అక్కడ కొద్దిపాటి వ్యవసాయభూమిని సాగుచేస్తూ.. ఆపిల్ తోట పెంచారు. అక్కడే నిర్మించుకున్న కొత్త ఇంటికి "రాకీ రిడ్జ్ ఫార్మ్" అని పేరుపెట్టుకున్నారు.

వ్యవసాయసాగులోని అనుభవాలను ఆమె ఒక వార్తాపత్రికలో కాలమ్‌గా రాయడం ప్రారంభించారు. వీటితో పాటు లారా ఆమె జీవితంలో ఎదురైన ఎన్నో అనుభవాలలో పయనీర్ గర్ల్ పేరుతో ఆత్మకథ రచించారు. మే 1930 లో వచ్చిన ఆమె మొదటి పుస్తకం ఇది. ఆ తర్వాత ఆమె చిన్నారుల కోసం ఎన్నో పుస్తకాలు రచించారు. లిటిల్ హౌజ్ సీరిస్ పేరుతో ఇవి ప్రచురించబడ్డాయి. 1932 నుంచి 1943 వరకు ఆమె రాసిన ఏడు పుస్తకాలను న్యూయార్క్ మార్కెటులో అందుబాటులోకి తీసుకువచ్చారు. 1957లో 90ఏండ్ల వయసులో లారా మరణించారు. ఆమె చనిపోయిన మూడెండ్ల తర్వాత చివరి లిటిల్ హౌజ్ నవల 'ది ఫస్ట్ ఫోర్ ఇయర్స్' ప్రచురించ బడింది.

లారా ఇన్గాల్స్ విల్డర్ హెూమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో "లిటిల్ హౌస్ ఆన్ ది ప్రయరీ" టెలివిజన్ సిరీస్ 1974 లో ప్రారంభించారు. ❄





## గందరగోళంలో నీట్

- నోటిఫికేషన్ విడుదలలో జాప్యం
- విద్యార్థుల్లో ఆందోళన

**హైదరాబాద్ :** నీట్‌ను వివాదాలు వీడటం లేదు. ఎంబిబిఎస్, బిడిఎస్ వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో ఒకే తరహా పరీక్ష విధానం ఉండాలని సుప్రీం కోర్టు ఇచ్చిన సూచనతో ఏర్పాటైన నీట్‌ను మొదటి నుంచి వివాదాలు వెంటాడుతూనే ఉన్నాయి. తాజాగా మరో వివాదంలో చిక్కుకుంది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్ ( ఎన్‌ఐఓఎస్) విద్యార్థులకు అవకాశం కల్పిస్తూ తీసుకున్న నిర్ణయం వివాదాస్పదమవుతోంది. గరిష్ట వయసు నిర్ధారణ విషయంలో తర్జనభర్జన సాగుతుండటంతో నోటిఫికేషన్ విడుదలలో జాప్యమవుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్‌ను కలిసిన ఎన్‌ఐఓఎస్ బృందం తమ విద్యా ర్థులను నీట్‌కు అనుమతించాలని కోరారు. మంత్రి సూచనతో ఈ ఏడాది నుంచి నీట్ పరీక్షకు ఎన్‌ఐఓఎస్ విద్యార్థులను అనుమతించాలని మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్ణయించింది. అందుకు అనుగుణంగా ఈ నెల 22న ఎంసిఐ అధికారిక ప్రకటన విడుదల చేసింది. నీట్-2018కి ఎన్‌ఐఓఎస్ విద్యార్థులను అనుమతిస్తా మని పేర్కొనటంతో పాటు జనరల్ విద్యార్థులకు గరిష్ట వయసును 25గా, రిజ ర్వుడ్ కేటగిరీ అభ్యర్థులకు 30సంవత్సరాలుగా పేర్కొనటం వివాదాస్పదమైంది. ఎంసిఐ విడుదల చేసిన ప్రకటనలో మెడికల్ ఎడ్యుకేషన్, రెగ్యులేషన్ -1997 చట్టానికి వ్యతిరేకంగా ఉంటంతో న్యాయపరంగా ఇబ్బందులు తలెత్తినట్ల య్యింది. దీంతో ప్రకటనను వెనక్కి తీసుకోవాలని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రిత్వశాఖ ఎంసిఐని సూచించింది. కానీ ఎంసిఐ ఎలాంటి నిర్ణయ మూ తీసుకోకపోవడంతో నోటిఫికేషన్ విడుదలలో జాప్యం జరుగుతు న్నట్లు తెలుస్తోంది. నీట్-2018కి సంబంధించి నోటిఫికేష్ విడుదలలో జరుగుతున్న జాప్యంపై విద్యార్థుల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# నిరుపేదలకు 'బహిరంగ' శిక్ష

- మరుగుదొడ్లు లేవని పింఛన్లు, రేషన్ నిలిపివేత
- ఒడిఎఫ్ లక్ష్యం కోసం ప్రభుత్వ నిర్వాకం



పింఛన్లు ఆపేశారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్న బూర్జ మండలం లక్షుమయ్యపేట వృద్ధులు

**శ్రీకాకుళం :** బహిరంగ మలవిసర్జన రహిత (ఏడీఎఫ్) జిల్లాగా మార్చే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు పేదల కు కష్టాలను మిగుల్చుతున్నాయి. మరుగు దొడ్లను నిర్మించుకోని కుటుంబా లకు రేషన్, పింఛను నిలిపేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఫిబ్ర వరి నెలకు సంబంధించి లబ్ధిదారులకు పింఛన్లు, రేషన్ సరుకులు నిలిపి వేశారు. దీంతో పింఛన్లు, రేషన్ సరుకులు వస్తే గానీ పూట గడవని నిరుపేదలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. జిల్లాలో 3,64,865 కుటుంబాలకు మరుగుదొడ్లు లేవని అధికారులు గుర్తించారు. వీటిని పూర్తి చేయడం ద్వారా ఈ ఏడాది మార్చి 31 నాటికి ఒడిఎఫ్ జిల్లాగా మార్చాలన్నది ప్రభుత్వ లక్ష్యం. వాటిలో ఇప్పటివరకూ 84,024 మరుగుదొడ్లు మాత్రమే పూర్తయ్యాయి. 45,888 మరుగుదొడ్ల నిర్మాణాలు ప్రగతిలో ఉన్నాయి. ఇంకా 2,34,453 మరుగుదొడ్ల నిర్మాణం ప్రారంభం కాలేదు. మరుగుదొడ్ల నిర్మాణ లక్ష్యంలో రాష్ట్రంలో శ్రీకాకుళం జిల్లా అత్యంత వెనుకబడి ఉండటాన్ని కలెక్టర్ల కాన్ఫరెన్సుల్లోనూ, వీడియో కాన్ఫరెన్స్‌లోనూ చంద్రబాబునాయుడు పలుమార్లు జిల్లా అధికారులపై అసహనం వ్యక్తం చేశారు.

**నిలిచిపోయిన 'సంక్షేమం'**

సిఎం ఆదేశాల దృష్ట్యా అధికారులు మరుగుదొడ్ల నిర్మాణాన్ని ఉధృతం చేసేందుకు నిర్ణయించారు. ఇందులో భాగంగా మరుగుదొడ్లను నిర్మించుకోని కుటుంబాలకు ఈనెల పింఛన్లు, రేషన్ సరుకులను ఆపేశారు. గ్రామ కార్యదర్శులు ఇంటింటికీ వెళ్లి మరుగుదొడ్లు ఉన్నవారికి మాత్రమే పింఛను అందజేస్తున్నారు. మరుగుదొడ్లు ఉన్నాయని మండల రెవెన్యూ అధికారులు ధ్రువీకరిస్తూ పత్రం అందజేస్తేనే రేషన్ సరుకులు అందిస్తున్నారు. దీంతో, ఇంట్లో ఒంటరిగా ఉంటున్న వృద్ధులు, పరాయిపంచన ఉంటూ బతుకీడుస్తున్న పింఛనుదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎవరి ఆసరా లేకుండా ఉంటున్న తాము మరుగుదొడ్లను ఎలా నిర్మించుకుంటామని వారు ప్రశ్నిస్తున్నారు.

**ప్రజాప్రతినిధులకు మినహాయింపు!**

అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో వంద మంది సర్పంచులకు, వెయ్యిమంది వార్డు మెంబర్లకు మరుగుదొడ్లు లేవు. నిరుపేదలకు రేషన్, పింఛన్లు నిలిపేస్తున్న అధికారులు వారి జోలికి వెళ్లడం లేదు. 70మంది వరకూ కిందిస్థాయి ప్రభుత్వోద్యోగులకు మరుగుదొడ్లు లేవు.



# ఛత్తీస్‌గఢ్‌లో దారుణం..

- శవాన్ని కూడా వదలని సామాజిక బహిష్కరణ




**జాంజ్‌గిర్:** ఛత్తీస్‌గఢ్‌లోని జాంజ్‌గిర్ జిల్లాలో సామాజిక బహిష్కరణ ఓ వ్యక్తిని చావు తర్వాత కూడా వెంటాడింది. చంపా పోలీస్‌స్టేషన్ పరిధిలోని కురాదా గ్రామానికి చెందిన గణేశ్ పటేల్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. తన కుటుంబంపై సామాజిక బహిష్కరణ విధించడంతో ఆవేదనతోనే ఆత్మహత్యకు పాల్పడినట్టు గణేశ్ తన సూసైడ్ లేఖలో తెలిపారు. ఆయన శవాన్ని పోస్ట్ మార్టం కోసం ఆస్పత్రికి తరలించేందుకు ప్రయివేట్ వాహనాల యజమానులెవరూ ముందుకు రాలేదు. తమ వాహనంలో తరలించేందుకు పోలీసులూ నిరాకరించారు. పైగా శవాన్ని ఆస్పత్రికి తరలించే బాధ్యత మృతుడి కుటుంబసభ్యులదే అంటూ పోలీసులు ఒత్తిడి చేశారు.

కులాంతర వివాహమే కారణం

గణేశ్‌పటేల్ తమ్ముడు సంతోష్‌పటేల్ రెండేండ్ల క్రితం చేసుకున్న కులాంతర వివాహమే ఆ కుటుంబంపై సామాజిక బహిష్కరణకు కారణమైంది. గ్రామంలోని పెత్తందార్లు గణేశ్ కుటుంబానికి ఎవరూ సహకరించొద్దంటూ హుకుం జారీ చేశారు. దాంతో, గణేశ్ మరో తమ్ముడు, సోదరిని వివాహమాడేందుకు ఎవరూ సాహసించలేదు. సంతోష్ పటేల్ తన భార్యతో కలిసి వేరే గ్రామంలో కాపురం పెట్టారు. కుటుంబం ఎదుర్కొంటున్న ఇబ్బందులను భరించలేక గణేశ్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆయన శవాన్ని తీసుకెళ్లేందుకు ఎవరూ సహకరించకుండా ఆ గ్రామ పెత్తందార్లు ఒత్తిడి చేసినట్టు తెలుస్తోంది. చివరికి ఓ తోపుడు బండిపై గణేశ్ శవాన్ని ఆస్పత్రికి తరలించి, పోస్ట్‌మార్టం అనంతరం తిరిగి ఇంటికి తీసుకొచ్చారు.

# న్యాయం జరిగే వరకూ పోరాటం

- టీడీపీ ముఖ్యనేతలతో చంద్రబాబు
- భూ కేటాయింపులపైనా చర్చ



**అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం జరిగే వరకూ పార్లమెంటులో పోరా డాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పార్లమెంటు సభ్యులకు సూచించారు. హామీలతో సరిపెట్టొద్దని ఆదేశించారు. పార్లమెంటులో ఆందోళన నేపథ్యంలో మంగళవారం ఉదయం టీడీపీ కీలక నేతలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉండవల్లిలోని తన నివాసంలో సమావేశమయ్యారు. ప్రధాని కార్యాలయం నుండి ఫోన్ వచ్చిన నేపథ్యంలో అక్కడ తీసుకోవాల్సిన నిర్ణయాలపై అత్యవసరంగా చర్చించారు. సమావేశానికి ఎవరిని పంపిం చాలనే అంశంపై చర్చించి, సుజనా చౌదరిని పంపించాలని నిర్ణయించారు. అప్పటి వరకూ తీవ్రస్థాయిలో ఆగ్రహావేశాలతో ఉన్న నాయ కత్వం మొత్తం ప్రధానితో సమావేశం అనం తరం చల్లబడింది. మరోవైపు అరుణ్‌జైట్లీ, పియూష్ గోయల్ కూడా దీనిపై స్పందించ డంతో పార్లమెంటు సభ్యులు కొంత శాంతిం చారు. సాయంత్రానికి ఆందోళనను విరమించారు. అయితే ఉండవల్లిలో జరిగిన సమావే శంలో మాత్రం కేంద్రం నుండి స్పష్టమైన ప్రకటన వచ్చే వరకూ ఊరుకునేది లేదని, ఇదే విషయాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లాలని సూచించినట్లు తెలిసింది. లేకపోతే క్షేత్రస్థాయి లో నష్టపోతామని, పార్టీపరంగా అది అంత మంచి నిర్ణయం కాదన్నట్లు సమాచారం. మరోవైపు మంత్రి యనమల తదితరులు కూడా దీనిపై కొంత జాగ్రత్తగానే వ్యవహ రించాలని సూచించినట్లు సమాచారం. ముఖ్యంగా మూడు రోజులుగా రాష్ట్రంలో జరుగుతున్న ఆందోళనకు తోడు పార్లమెంటులో నూ ఎంపిలు నిరసనలు చేపట్టంలో కేంద్రంలో కదలిక వచ్చిందని, ఈ ఒత్తిడికి సడలింపునిస్తే కేంద్రం తప్పుకుంటుందని అన్నట్లు సమా చారం. ఈ నేపథ్యంలో ఆందోళనను కొనసాగించాలని సూచించారు. అయితే మంగళవారం రాత్రికి అందరూ చప్పబడిపోయారు. వీటితోపాటు బడ్జెట్ విషయంలో కేంద్రంపై వివిధ పత్రికలు, ఛానళ్లలో వస్తున్న వార్తలు, సర్వేలపైనా చర్చిం చారు. ప్రతిపక్షం విషయంలో తీసుకోవాల్సిన ఎత్తుగడపై మాట్లాడారు. దీంతో పాటు చంద్రబాబు విదేశీ పర్యటన, రాజధాని పరిధిలో భూ కేటాయింపుల అంశం పైనా చర్చించారు. భూ కేటాయింపుల ఉప సంఘం సమావేశమవుతున్న నేపథ్యం లో దానిపైనా సుదీర్ఘంగా చర్చించారు.

## 22 జిల్లాల్లో తగ్గిన భూగర్భ జలాలు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో భూగర్భ జలమట్టం తగ్గుతున్నది. జనవరి నెలలో రాష్ట్రంలో సగటున 0.68 మీటర్ వరకూ ఈ తగ్గుదల కనిపించిందని భూగర్భ జలశాఖ తాజా నివేదికలో వెల్లడించింది. 2017 డిసెంబర్‌లో రాష్ట్రంలో భూగర్భ జలాలు సగటున 9.18 మీటర్ల లోతులో ఉండగా కేవలం నెల రోజుల కాలంలో 10.94 మీటర్ల లోతుకు పడిపోయింది. 2017-18 నీటి సంవత్సరంలో రాష్ట్రంలో సగటు వర్షపాతంలో తగ్గుదల ఉన్నందువల్లే భూగర్భ జలాలపై ప్రభావం పడిందని అధికారులు అంటున్నారు. రాష్ట్రంలో సాధారణ సగటు వర్షపాతం 852 మిల్లీమీటర్లు కాగా 776మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయింది. జనవరి 1నుంచి రాష్ట్రంలో రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తున్నందువల్ల రాబోయే కాలంలో భూగర్భ జలాలు మరింత లోతుకు పోయే అవకాశం ఉందని వారు భావిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 31 జిల్లాల్లోని 584 మండలాల్లో 609 ఫిజియో మీటర్ల ద్వారా భూగర్భ జలాల పరిస్థితిని తెలుసుకుంటున్నారు.

22 జిల్లాల్లో భూగర్భ జలమట్టం తగ్గిపోగా 9 జిల్లాల్లో స్వల్పం పెరుగుదల కనిపించింది. అత్యధికంగా మెదక్ జిల్లాలో భూగర్భ జలాలు 16.07 మీటర్ల లోతుకు పడిపోగా వనపర్తి జిల్లాలో 6.25 మీటర్ల పైకి ఉండటం విశేషం. రంగారెడ్డి జిల్లాలో భూగర్భ జలాలు గరిష్ఠంగా 4.16 మీటర్లు పెరిగినట్టు అధికారిక నివేదిక స్పష్టం చేస్తున్నది. గత సంవత్సర కాలంలో హైదరాబాద్ జిల్లాలో భూగర్భ జలాల్లో 0.22 మీటర్ తగ్గుదల కనిపించింది.



# తైవాన్‌లో భూకంపం

## రిక్టర్ స్కేల్‌పై తీవ్రత 6.4గా నమోదు

## భూమిలో కూరుకుపోయిన భవంతులు

**తైపి:** తైవాన్ దేశంలో మంగళవారం అర్థరాత్రి భూకంపం వచ్చింది. పలుచోట్ల భూప్రకంపనలు రావటంతో..ఆ దేశం జనం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రోడ్లపైకి దౌడు తీశారు. అధికారులిచ్చిన సమాచారం ప్రకారం భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 6.4గా నమోదైంది. ఈ ధాటికి బహుళఅంతస్థుల హోటల్ భూమిలో ఓ వైపు ఒరిగిపోయింది. మరో స్టార్ హోటల్‌కు భారీగా నష్టం వాటిల్లినట్టు సమాచారం. ఆ దేశ కాలమానం ప్రకారం మంగళవారం రాత్రి 11.50 నిమిషాలకు భూకంపించినట్టు గుర్తించారు. యూఎస్ జియాలజికల్ సర్వే ప్రకారం..సముద్రతీరంలో ఉన్న అలీనా ప్రాంతానికి 20 కిలోమీటర్ల దూరంలో..భూకంపకేంద్రంగా తేలింది. భూప్రకంపన దెబ్బకు స్టార్ హోటల్ భూమిలో అమాంతంగా కూరుకుపోగా..తైవాన్ నేషనల్ ఫైర్ ఏజెన్సీ రంగంలోకి దిగింది. ఇంకా 30 మంది ఆ హోటల్‌లో బసచేసిన వారు చిక్కుకున్నారని అధికారులు తెలిపారు. వారి రక్షించేపనిలో ఉన్నట్టు చెప్పారు. పలువురు క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించారు. 1996లో రిక్టర్ స్కేల్‌పై 7.6 తీవ్రత నమోదుకాగా, సుమారు 2,400మంది చనిపోయారు. తాజాగా వచ్చిన భూప్రకంపనలవల్ల ఆస్తి నష్టం ఎక్కువగా ఉన్నదని, ప్రాణనష్టానికిసంబంధించిన వివరాలు అందాల్సిఉన్నదని అధికారులు తెలిపారు.

# పురుషోత్తంరెడ్డి కోసం లుక్‌అవుట్ నోటీసులు జారీ

- విదేశాలకు పారిపోకుండా ఏసీబీ ముందు జాగ్రత్త చర్య
- అక్రమాస్తులలో మరో ఫామ్‌హౌజ్, రెండు బ్యాంకు లాకర్లు

**నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి**

అవినీతి తిమింగలం హెచ్ఎండీఏ హైదరాబాద్ ప్లానింగ్ డైరెక్టర్ కట్టా పురుషోత్తంరెడ్డి విదేశాలకు పారిపోకుండా లుక్ అవుట్ నోటీసులు మంగళవారం జారీ చేశారు. అదే సమయంలో మరో ఫామ్‌హౌజ్, రెండు బ్యాంకు లాకర్లను కట్టా కలిగి ఉన్నట్టు ఏసీబీ అధికారులు కనుగొన్నారు. ఆదాయానికి మించి రూ.25 కోట్లకు పైగా ఆస్తులను కలిగి ఉన్న పురుషోత్తంరెడ్డి కేసు మరో మలుపు తిరిగింది. గత ఐదు రోజులుగా కనిపించకుండా పోయిన పురుషోత్తంరెడ్డి, అతని భార్య, బావమరిది బి.శ్రీనివాస్‌రెడ్డిల కోసం ఏసీబీ అధికారులు గాలింపు చర్యలు మరింత తీవ్రమయ్యాయి. రాష్ట్రంతో పాటు అతని బంధువుల ఇండ్లను గాలించిన ఏసీబీ అధికారులు తాజాగా వారు విదేశాలకు పారిపోయే ప్రయత్నం చేస్తున్నట్టు అనుమానిస్తున్నారు. దీనిని నివారించడానికి గాను ఇమిగ్రేషన్ అధికారులతో మాట్లాడి ఈ ముగ్గురు విదేశాలకు వెళ్లకుండా అన్ని ఏయిర్ పోర్టులు, నౌకాశ్రయాలకు లుక్‌అవుట్ నోటీసులు జారీ చేశారు. ఇందులో వారి ఫోటోలు, పాస్‌పోర్టు నంబర్లు, ఇతర వివరాలను పొందుపరిచారు. దీంతో విదేశాలకు పారిపోవాలనే ప్రయత్నాలకు తాము బ్రేకు వేసినట్టు అయ్యిందని ఏసీబీ డీజీ జె.పూర్ణచంద్రరావు తెలిపారు. కాగా తవ్వుతున్న కొద్దీ కొత్తగా పురుషోత్తంరెడ్డి ఆస్తులు వెలుగు చూస్తున్నాయి. తాజాగా షామీర్‌పేట్ మండలం కొల్తూరులో విశాలమైన ఫామ్‌హౌజ్‌ను నిందితుడు కలిగి ఉన్నట్టు ఏసీబీ సోదాల్లో తేలింది. అలాగే మరో రెండు బ్యాంకు లాకర్లు కూడా రెడ్డి కలిగి ఉన్నట్టు బయటపడింది. దీంతో ఈ బ్యాంకు లాకర్లను తెరవడానికి అవసరమైన న్యాయపరమైన చర్యలను ఏసీబీ అధికారులు తీసుకుంటున్నారు. కాగా పురుషోత్తంరెడ్డిని, వారి కుటుంబసభ్యులను ఏసీబీ అధికారులు వేధిస్తున్నారని వారి తరఫున దాఖలైన పిటీషన్‌ను ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం మంగళవారం విచారించింది. అయితే తాము ఎలాంటి వేధింపులకు పాల్పడటం లేదని, పురుషోత్తంరెడ్డి అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచాలన్నదే తమ ప్రయత్నమని ఏసీబీ అధికారులు తమ వాదనను వినిపించారు. దీంతో కేసు దర్యాప్తునకు సహకరించాలని న్యాయమూర్తి పిటిషనర్లను ఆదేశించారని ఏసీబీ వర్గాలు తెలిపాయి. దీంతో తమ ముందు విచారణకు హాజరుకావాలని పురుషోత్తంరెడ్డి సమీప బంధువులు చరణ్‌రెడ్డి, నిపుల్‌రెడ్డిలకు ఏసీబీ అధికారులు నోటీసులు జారీ చేశారు. బుధవారం వారిని విచారించడం ద్వారా పురుషోత్తంరెడ్డి ఆచూకిని కనుగొనడానికి దర్యాప్తు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం.

## గ్రేడ్ 2 పరీక్షకు ఉచిత శిక్షణ

- బీసీ సంక్షేమ శాఖ

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

హాస్టల్‌వెల్ఫేర్ ఆఫీసర్స్ గ్రేడ్ 2 పరీక్ష కోసం ఉచిత శిక్షణ అందజేయనున్నట్టు బీసీ సంక్షేమ శాఖ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆసక్తి గల అభ్యర్థులు ఉచిత శిక్షణ కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపింది. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.5లక్షలు, పట్టణ ప్రాంతాల్లోని అభ్యర్థుల వార్షిక ఆదాయం రూ.2లక్షలకు మించకూడదని పేర్కొంది. ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్, వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్, నల్లగొండ, ఖమ్మం, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో శిక్షణ అందియనుంది.

## బీసీలకు న్యాయం చేసేందుకే సాధికారిక కమిటీ


- టీపీసీసీ ఉపాధ్యక్షులు టి నాగయ్య

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

రాష్ట్రంలో 50 శాతానికి పైగా ఉన్న బీసీల సంక్షేమం, రాజకీయ రంగంలో సరైన న్యాయం చేసేందుకు టీపీసీసీ ఓబీసీ సాధికారిక కమిటి పని చేస్తుందని, ఇది ఎవరికీ వ్యతిరేకం కాదని కమిటీ చైర్మెన్ టి నాగయ్య, కన్వీనర్ మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రగతిశీల ఆలోచనలకు అద్దం పడుతుందన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. అంతకు ముందు బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై వారు చర్చించారు. రాష్ట్ర మంతటా పర్యటించిన 90 రోజుల్లో అధిష్టానికి నివేదిక సమర్పిస్తామని వారు చెప్పారు. బీసీలను కాంగ్రెస్ వైపు మరింత చేరువ చేసేందుకు ఈ కమిటీ ఎక్కువ కషి చేస్తుందన్నారు. రూ 25 వేల కోట్లు కేటాయించి బీసీలకు న్యాయం చేస్తానని చెప్పిన కేసీఆర్ మోసం చేశారని విమర్శించారు.

## బాల్య వివాహాల నివారణకు ఏం చర్యలు తీసుకున్నారు?

### సర్కార్‌ను ప్రశ్నించిన హైకోర్టు



**హైదరాబాద్:** బాల్య వివాహాలను నివారించేందుకు తెలంగాణ సర్కార్ తీసుకునే చర్యలు తెలియజేయాలని హైకోర్టు ఆదేశించింది. బాల్య వివాహాలు తెలంగాణలోనే కాదని, ఏపీలోనూ బాగా ఉన్నాయని బెంచ్ అభిప్రాయపడింది. తెలంగాణ రాష్ట్రం తీసుకునే చర్యల తర్వాత ఏపీలోని బాల్య వివాహాలను అరికట్టేందుకు తీసుకునే చర్యలపై విచారణ చేస్తామని హైకోర్టు స్పష్టం చేసింది. బాల్య వివాహాల వల్ల బాధితులైన వారికి ప్రభుత్వం ఏవిధంగా అండగా ఉంటుందో తెలియజేయాలని తెలంగాణ సర్కార్‌ను హైకోర్టు ఆదేశించింది. బాల్య వివాహాల వల్ల నష్టపోయిన వైనాన్ని వివరిస్తూ బి.మహిలత, 10 మంది రాసిన లేఖను హైకోర్టు ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించింది. దీనిని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి కె.విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం విచారించింది. బాల్య వివాహ బాధితులకు విద్యలో 5 శాతం రిజర్వేషన్లు, ఉచిత వైద్యం, స్వయం సహాయక సంఘాలు, ఆర్థిక భరోసా ఉండే చర్యలు తీసుకోవాలని బాధితులు హైకోర్టును లేఖ ద్వారా కోరారు. వీరి సంక్షేమం కోసం తీసుకునే చర్యల్ని వివరించాలని బెంచ్ తెలంగాణను ఆదేశిస్తూ విచారణ నెల రోజులకు వాయిదా వేసింది.

## అప్పుల బాధతో ఇద్దరు రైతుల ఆత్మహత్య

- నిర్మల్ జిల్లాలో ఘటన
- మంచిర్యాలలో మరో గీత కార్మికుడు..

**నవతెలంగాణ-ముధోల్/దస్తురాబాద్/జన్నారం**

అప్పుల బాధ తాళలేక నిర్మల్ జిల్లాలో ఇద్దరు రైతులు బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. మంచిర్యాలలో ఓ గీత కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనలు మంగళవారం జరిగాయి.

నిర్మల్ జిల్లా ముధోల్ మండలం కోలిగల్లీ గ్రామానికి చెందిన శంకర్(48) తనకున్న రెండెకరాల్లో వరి సాగు చేశాడు. దీనికి గాను రూ.3 లక్షల వరకూ అప్పు చేశాడు. కానీ ఆశించిన మేరకు పంట దిగుబడి రాలేదు. పెట్టుబడి కోసం చేసిన అప్పులకు వడ్డీలు పెరగడంతో వాటిని తీర్చలేననే బెంగతో జనవరి 31న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈ క్రమంలో మంగళవారం వ్యవసాయ బావిలో శవమై కనిపించాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని సీఐ రఘుపతి, ఎస్సై కోదాడి రాజు పరిశీలించారు. మృతునికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇదే జిల్లా దస్తురాబాద్ మండలం గుట్టాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని చెన్నూర్ గ్రామానికి చెందిన కొట్టే వేణు(35) తనకున్న ఎకరం భూమితో పాటు మరో ఐదెకరాలు కౌలుకు తీసుకుని పంట సాగు చేశాడు. దీనికి గాను రూ.7 లక్షల వరకూ అప్పు చేశాడు. దోమపోటుతో ఆశించిన మేర దిగుబడి రాలేదు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలీక మనస్తాపానికి గురై మంగళవారం సాయంత్రం వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

మంచిర్యాల జిల్లా జన్నారం మండలం దేవునిగూడ గ్రామానికి చెందిన సిద్దగోనే రవీందర్‌గౌడ్(40) గీత కార్మికుడు. కొంత కాలంగా కల్లు దిగుబడి తగ్గడంతో కుటుంబ పోషణ కోసం అప్పు చేశాడు. ఉపాధి లేక, వేరే పని చేయలేక చేసిన అప్పు తీర్చలేక పోయాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురై సోమవారం మధ్యాహ్నం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మంగళవారం ఉదయం మృతి చెందాడు. మృతునికి భార్యా, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని సర్పంచ్ లక్ష్మీశ్రీకాంత్ ప్రభుత్వాన్ని కోరారు.

## డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముఠా అరెస్ట్

- రూ.4లక్షల మత్తు పదార్థాలు స్వాధీనం

**నవతెలంగాణ - బేగంపేట**

డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముగ్గురిని హైదరాబాద్ సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్సు డీసీపీ రాధాకిషన్‌రావు తన కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నారాయణగూడ మధుశాల హోటల్ వద్ద ఈ ముఠా ఉన్నట్టు గుర్తించి పట్టుకున్నారు. గోవా నుంచి డ్రగ్స్ తెచ్చి సిటీలో విక్రయిస్తున్న ఒక నైజీరియన్‌తోపాటు, జమ్ముకాశ్మీర్‌కు చెందిన హబిద్ నజీర్, హైదరాబాద్ శివారు ప్రాంతానికి చెందిన యాష్ సుంకరెను అరెస్టు చేశారు. వీరి నుంచి 75 గ్రాముల ఎల్ఎస్‌డీ స్టాంప్స్, 30 గ్రాముల చారస్, గ్రాము హెరాయిన్, 30 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నైజీరియన్‌కు చెందిన అంగోలా అల్మాఫైడే వీసా గడువు ముగిసినా ఇండియాలోనే ఉంటున్నాడు. సులభంగా డబ్బు సంపాదించాలని స్నాప్‌చాట్ యాప్ ద్వారా పరిచయాలు పెంచుకున్నాడు. జమ్ముకాశ్మీర్‌కు చెందిన అబిద్ నీజర్, యాష్ సుంకరితో కలిసి డ్రగ్ సరఫరా చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు నారాయణగూడలో వీరిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి నాలుగు లక్షల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకొని తదుపరి విచారణ కోసం నారాయణగూడ పోలీసులకు అప్పగిస్తున్నట్టు డీసీపీ తెలిపారు.

## భార్య ఆరోగ్యం కోసమే.. పసికందు బలి

- ఇంటి యజమానే బలిచ్చాడా?
- ఇంట్లో ఆధారాలు లభ్యం
- నరబలి కేసులో ఆరుగురు అనుమానితుల అరెస్ట్

**నవతెలంగాణ-సిటీబ్యూరో/ఉప్పల్**

రాష్ట్ర వ్యాప్తంగా కలకలం సృష్టించిన పసికందు నరబలి కేసును పోలీసులు ఛేదించినట్టు సమాచారం. సంపూర్ణ చంద్రగ్రహణం రోజు అర్ధరాత్రి హైదరాబాద్ ఉప్పల్ చిలుకానగర్‌లో మూడు నెలల పసికందు తల డాబాపై లభించిన విషయం విదితమే. జనవరి 31 అర్ధరాత్రి జరిగిన ఈ ఘటన తెల్లారి వెలుగు చూసింది. కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రాచకొండ సీపీ మహేష్‌భగవత్ మల్కాజ్‌గిరి డీసీపీ ఉమామహేశ్వర్‌రావుతో పాటు ఇతర అధికారులను రంగంలోకి దించారు. డాగ్‌స్క్వాడ్, ఎస్ఓటీ, క్లూస్‌టీంలు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టాయి. ఐదు రోజులపాటు కొనసాగిన విచారణలో భాగంగా పోలీసులు మంగళవారం ఇంటి యజమాని రాజశేఖర్, అతని భార్య శ్రీలత, అదే కాలనీకి చెందిన ప్రభాకర్, నరహరితోపాటు పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అయితే, ఇంటి యజమాని రాజశేఖరే పసికందును బలిచ్చాడని పోలీసుల విచారణలో వెల్లడైనట్టు సమాచారం.

**తండా నుంచి కొనుగోలు**

రాజశేఖర్ భార్య శ్రీలత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. చంద్రగ్రహణం రోజు నరబలి ఇస్తే ఆరోగ్యం నయమౌతుందని ఓ పూజారి చెప్పడంతో ఈ ఘాతుకానికి పాల్పడినట్టు తెలుస్తోంది. మూడునెలల పాపను కరీంనగర్ జిల్లాలోని ఓ గిరిజన తండా నుంచి కొనుగోలు చేసి తీసుకొచ్చినట్టు పోలీసులు గుర్తించారు. సంపూర్ణ చంద్రగ్రహణం రోజు రాత్రి రాజశేఖర్ ఇంట్లో క్షుద్రపూజలు చేసినట్టుగా ఆధారాలు సేకరించినట్టు తెలుస్తోంది. రాజశేఖర్ కారులో క్షుద్రపూజలకు సంబంధించిన ఆనవాళ్లు లభించడంతో మంగళవారం పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న భార్య కోలుకుంటుందనే ఈ ఘాతుకానికి పాల్పడినట్టు నిందితుడు పోలీసుల దర్యాప్తులో చెప్పినట్టు సమాచారం. కేసులో మొత్తం ఆరుగురు నిందితులు పోలీసుల అదుపులో ఉన్నారు.

**నిందితులను కఠినంగా శిక్షించాలి: స్థానికులు**

మూడు నెలల పాపను నరబలివ్వడం దారుణమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. రాజశేఖర్ దంపతులు నరబలిచ్చారని తేలితే బస్తీ నుంచి వెళ్లగొడతామన్నారు. నిందితును కఠినంగా శిక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ద.మ.రైల్వేకు పెరిగిన కేటాయింపులు



- ఎంఎంటీఎస్ ఫేజ్-2 డిసెంబర్ నాటికి పూర్తి : జీఎం వినోద్ కుమార్‌యాదవ్

**నవతెలంగాణ-సిటీబ్యూరో**

రైల్వే బడ్జెట్‌లో తెలుగు రాష్ట్రాలకు గతంలో కంటే కేటాయింపులు పెరిగా యని దక్షిణ మధ్య రైల్వే జీఎం వినోద్ కుమార్‌యాదవ్ తెలిపారు. రైల్వే బడ్జెట్‌లో దక్షిణమధ్య రైల్వేకు కేటాయింపుల విషయాన్ని ఆయన మంగళవారం మీడియా సమావేశంలో వెల్లడించారు. 2018-19 ఆర్థిక సంవత్సరానికిగాను తెలంగాణకు ఐదు శాతం, ఆంధ్రప్రదేశ్‌కు ఎనిమిది శాతం మేరకు కేటాయింపులు పెరిగాయని వివరించారు. ఈసారి బడ్జెట్‌లో తెలంగాణకు రూ.1,813 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌కు రూ.3670 కోట్లు కేంద్రం కేటాయిం చినట్టు తెలిపారు. సికింద్రాబాద్-యాదాద్రి వరకు పొడిగిం చిన ఎంఎంటీఎస్ ఫేజ్-2 పనులు యుద్ధప్రాతిపది కన జరుగుతు న్నాయని, ఈఏడాది డిసెంబర్ నాటికి పనులు పూర్తిచేసి రైళ్ల రాకపోకలు కొనసాగి స్తామని అన్నారు. అయితే, చర్లపల్లి స్టేషన్ వద్ద రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయిం చాల్సి ఉందన్నారు. బడ్జెట్‌లో కేంద్రం ప్రకటించిన వివరాలు, కేటాయింపులు, కొత్త లైన్ల సర్వేలు, ప్రాజెక్టులు తదితర వివరాలు తెలిపారు. అయితే, గతంలో ప్రకటించిన కొత్త ప్రాజెక్టులకు సంబంధించిన సర్వేలు, కొత్త రైల్వే లైన్లు, కొత్త రైళ్లు, ఆర్‌ఓబీ, ఆర్‌యూబీల ఏర్పాటు విషయాన్ని జీఎం ప్రస్తావించలేదు. ఆయా విషయాలపై మీడియా అడిగిన ప్రశ్నలకూ సమాధానం ఇవ్వకుండా దాటవేశారు. ఇటీవల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్రలకు చెందిన ఎంపీలతో సమావేశమైన జీఎం వారు సమర్పించిన వినతి పత్రాల్లో ఏ ఒక్కదానిపైనా కేంద్రం పట్టించుకున్నట్టు దాఖ లాలు కనిపించలేదని మీడియా అడిగిన ప్రశ్నలకూ సమాధానం చెప్పలేదు. నామ్‌కే వాస్తే కేంద్రం ఇచ్చిన గ్రీన్ షీట్‌ను తెచ్చి మీడియాకు చదివి వినిపించి జీఎం సమావేశాన్ని ముగించారు.

### విద్యుద్దీకరణకు నిధుల కేటాయింపు

- లింగంపేట జగిత్యాల-నిజామాబాద్ రైలు మార్గంలో 95 కిలోమీటర్ల మేర విద్యుద్దీకరణ పనులకు రూ.80.29 కోట్లు.
- వికారాబాద్-పర్లి వైజనాథ్ (తెలంగాణ, కర్నాటక, మహారాష్ట్ర) మార్గంలో 269 కిలోమీటర్ల వరకు రూ.262.12 కోట్లు.
- గద్వాల-రాయిచూర్ మార్గంలో 57 కిలోమీటర్ల వరకు రూ.46.10 కోట్లు.
- పూర్ణ-అకోలా 209 కిలోమీటర్ల వరకు రూ.211.58కోట్లు.
- తెనాలి-రేపల్లె మార్గంలో 34 కిలోమీటర్ల వరకు రూ.25.98 కోట్లు.
- నంద్యాల-ఎర్రగుంట్ల మార్గంలో 123 కిలోమీటర్ల విద్యుద్దీకరణకు రూ.111.48 కోట్లు.
- ధర్మవరం-పాకాల మార్గంలో 228 కిలోమీటర్ల విద్యుద్దీకరణకు రూ.210.47 కోట్లు.
- ఓబులవారిపల్లె-కృష్ణపట్నం కొత్త రైల్వేలైన్‌కు రెండు వందల కోట్లు.



### కొత్త రైలు మార్గాల సర్వే

- పటాన్‌చెరూ-సంగారెడ్డి-జోగీపేట-మెదక్ వరకు 97 కిలోమీటర్లు.
- నిజామాబాద్-నిర్మల్-ఆదిలాబాద్ వరకు 127కిలోమీటర్లు.
- మానకొండూరు-హుజూరాబాద్, ఎల్కతుర్తి వరకు 60 కిలోమీటర్లు.
- 221 కిలోమీటర్ల వరకు బైపాస్ లైన్ ఏర్పాటుకు
- పెద్దపల్లి-కాజీపేట. పర్లి-వైజనాథ్. ● లాతూర్-పర్లి వైజనాథ్.
- ఖానాపూర్-పర్లి వైజనాథ్ ● వికారాబాద్-వాడి.
- పగిడిపల్లి-భువనగిరి. ● విష్ణుపురం-జాన్‌పహాడ్.
- నిజామాబాద్-ముద్కేడ్-పర్భణి ● కడప-గుంతకల్-బళ్లారి.

### 440 కిలోమీటర్ల వరకు ఫ్లైఓవర్ బ్రిడ్జీల నిర్మాణం

- ముస్తాబాద్-కొండపల్లి. గుంతకల్ వెస్ట్-మలప్పగేట్ వరకు ఆర్ఓబీ, ఆర్‌యూబీ నిర్మాణానికి రూ.400 కోట్లు
- తెలంగాణ రాష్ట్రంలో తొమ్మిది రోడ్లలో రెండు ఆర్ఓబీల నిర్మాణానికి రూ.195.37 కోట్లు కేటాయించింది. ప్రభుత్వ వాటాగా 122.22 కోట్లు, రైల్వే శాఖ వాటాగా రూ.73.14 కోట్లు.
- ఏపీలో 15రోడ్ల వద్ద కొత్తగా 12 ఆర్ఓబీల నిర్మాణానికి రూ.703 కోట్లలో రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.393 కోట్లు కలుపుకుని రైల్వే శాఖ రూ.310 కోట్లు కేటాయించింది. ఫుట్‌ఓవర్ బ్రిడ్జీల నిర్మాణానికి రూ.44.76 కోట్లు.
- లెవెల్ క్రాసింగ్‌ల తొలిగింపునకు రూ.72.32 కోట్లు, రైలు పట్టాల బదలాయింపునకు రూ.800 కోట్లు కేటాయింపు.

# ఉగ్రవాదంపై యువత మొగ్గు

- మోడీ అధికారంలోకి వచ్చాక కాశ్మీర్ లోయలో పెరిగిన తీవ్రవాదం
- మూడేండ్లలో పెరిగిన ఉగ్రవాదులు: శాసనసభలో సీఎం మెహబూబాముఫ్తీ వెల్లడి



**జమ్మూ:** చల్లటి మంచుపర్వతాలతో పర్యాటకులను ఆకర్షించే..కాశ్మీర్ మండుతోంది. మోడీ అధికారంలోకి వచ్చాక..కాశ్మీర్‌లోయలో తీవ్రవాదం వైపు మొగ్గుచూపుతున్న యువత గణనీయంగా పెరుగుతున్నది.ఓవైపు భద్రతా బలగాలు ఉగ్రవాదులను మట్టుబెడుతున్నా ..మరోవైపు ఉగ్రవాద సంస్థల్లో చేరటానికి యువత ఆసక్తిచూపుతున్నారన్న విషయాన్ని జమ్మూకాశ్మీర్ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ ఆ రాష్ట్ర అసెంబ్లీలో వెల్లడించారు. గతేడాది 126 మంది యువకులు వివిధ ఉగ్రవాద సంస్థల్లో చేరినట్టు సీఎం హోదాలో ఆమె అధికారికంగా ప్రకటించారు. 2015లో 66 మంది, 2016లో 88 మంది ఉగ్ర సంస్థల్లో చేరగా.. 2017 నాటికి ఆసంఖ్య 126కు చేరిందని తెలిపారు. 2016లో హిజ్బుల్ ముజాహుదీన్‌కు చెందిన బుర్హన్ వనీ ఎన్‌కౌంటర్ తర్వాత ఈ సంఖ్య మరింత పెరిగిందని ఓ నివేదికలో వెల్లడైంది.బీజేపీ మద్దతుతో జమ్మూ కాశ్మీర్‌లో నడుస్తున్న పీడీపీ సర్కారుకు యువత ఉగ్రవాదం వైపు మళ్లటం పట్ల కత్తిమీదసాములా మారిందని ప్రతిపక్షపార్టీలు అంటున్నాయి.


### పోలీసులపై కాల్పులు జరిపి ఉగ్రవాది పరార్

**ఇద్దరు పోలీసులు మృతి**

**శ్రీనగర్:** పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా ఉగ్రవాది అబు హంజుల్లా అలియాస్ నవీద్ జాట్ పోలీసులపై బహిరంగ కాల్పులు జరిపి పారిపోయాడు. ఈ కాల్పుల్లో ఇద్దరు పోలీసులు మృతి చెందారు. సెంట్రల్ జైల్లో శిక్ష అనుభవిస్తున్న ఆరుగురు ఖైదీలను ఆరోగ్య పరీక్షల నిమిత్తం మంగళవారం శ్రీనగర్‌లోని శ్రీమహరాజా హరిసింగ్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ క్రమంలోనే నవీద్ పోలీసుల నుంచి ఆయుధాలను లాక్కుని భద్రతా సిబ్బందిపై విచక్షణా రహితంగా కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యాడు. పోలీసుల అదుపు నుంచి పరారైన నవీద్ 2015లో అరెస్ట య్యాడు.ఉదంపూర్‌లో బీఎస్ఎఫ్ కాన్వాయ్‌పై దాడికి పాల్పడిన కేసులో ఇతడిని అరెస్ట్ చేశారు. భద్రతా బలగాలు శ్రీనగర్ ప్రాంతంలో గాలిస్తున్నాయి. ప్రస్తుతం ఆస్పత్రిలో అత్యవసర, ఓపి సేవలను నిలిపివేశారు.

# ఎన్డీయే పాలనలో తగ్గుతున్న రైతుల ఆదాయం

### తీవ్రమౌతున్న వ్యవసాయ సంక్షోభం: బిజెపి నేత యశ్వంత్ సిన్హా



**కోల్‌కతా :** నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి వ్యవసాయం సంక్షోభం తీవ్రమైందని ఒక అధ్యయనం వెల్లడించిందని, సంక్షోభ పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవటం లేదని బీజేపీ నాయకులు యశ్వంత్‌సిన్హా ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. రైతులు తీవ్ర కష్టాల్లో ఉన్నారని, . గత నాలుగేళ్లలో రైతుల ఆదాయం 1.30 శాతం క్షీణించిందని ఆయన చెప్పాడు..కోల్‌కతా చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో యశ్వంత్ సిన్హా మాట్లాడుతే 'దేశంలో గ్రామీణ ప్రాంత పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉంది. వ్యవసాయ వృద్ధి క్షీణించడం, రైతులు కష్టాల్లో ఉండటం దీనికి కారణాలు. కనీస మద్దతుతో ధరతో పోలిస్తే అందులో మూడో వంతు లేదా 50 శాతం ధర కూడా రైతుకు లభించడం లేదని ఆయన తెలిపారు. యూపీఏ ప్రభుత్వం తొలి నాలుగేళ్లలో వున్న వ్యవసాయ వృద్ధి 3.8తో పోలిస్తే మోడీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయ వృద్ధి 1.9 శాతం తగ్గిందని సిన్హా వివరించారు. అలాగే గతంలో రైతుల ఆదాయంతో పోలిస్తే ఈ నాలుగేళ్లలో వారి ఆదాయం 1.30 శాతం తగ్గిందని కూడా తెలిపారు. 2022 నాటికి రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తామని చెబుతున్నారని, కానీ నాలుగేళ్లలో వారి ఆదాయం క్షీణించిందని, మరో నాలుగేళ్లలో ఏమీ సాధిస్తారని సిన్హా ప్రశ్నించారు. అలాగే ఈ నెల ఒకటిన ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌ను 'చిత్తు కాగితాలు'గా సిన్హా విమర్శించారు. బడ్జెట్‌లో పేర్కొన్న ప్రతి ప్రతిపాదనకు ఆర్థిక మద్దతు ఉండాలని, లేకపోతే, బడ్జెట్ పత్రాలు చిత్తు కాగితాలుగా మారతాయని ఆయన చెప్పారు.

**బీజేపీ నుంచి బయటకు వెళ్లను**

బీజేపీ నుంచి బయటకు వెళ్లనని యశ్వంత్ సిన్హా తెలిపారు. నరేంద్ర మోడీ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న నేపథ్యంలో ఆయన ఈ వివరణ ఇచ్చారు. పార్టీ నుంచే తాను వెళ్లనని, వాళ్ళే తనను పంపితేనే బయటకు వెళతానని, బీజేపీ అధికారంలో లేనప్పుడు 2004 నుంచి 2014 నుంచి పార్టీ కోసం తాను చాలా కష్టపడ్డానని, తాను ఎందుకు బయటకు వెళ్లాలని ప్రశ్నించారు. మోడీకి అనేక లేఖలు రాసానని, కానీ ఎలాంటి ప్రతిస్పందన రాలేదని అన్నారు. బిజెపి ఎన్నికల హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## సర్కారు బడులకు ఉచిత విద్యుత్ ఇవ్వండి

### మంత్రి జగదీశ్‌రెడ్డికి పీఆర్‌టీయూటీ వినతి

**నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్**

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని పీఆర్‌టీయూతెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. బుధవారం విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డిని ఆ సంఘం నేతలు కలిసి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా 24గంటల ఉచిత విద్యుత్ సరఫరాకు సంబంధించి పీఆర్‌టీయూటీ రూపొందించిన మాసపత్రికను మంత్రి ఆవిష్కరించారు. అనంతరం పీఆర్‌టీయూటీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మారెడ్డి అంజిరెడ్డి, ఎం చెన్నయ్య మాట్లాడుతూ...ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ విద్య, డిజిటల్ పాఠాలు నిర్వహిస్తుండటంతో విద్యుత్ వినియోగం పెరిగిందని, దీంతో బిల్లులపెక్కువగా వస్తున్నాయని అన్నారు.

బిల్లులు కట్టకపోవడంతో అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారనీ, దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గురుకుల పాఠశాలల్లో కొత్త నియామకాల సందర్భంగా ఉపాధ్యాయులకు ముందస్తు షరతులతో బాండ్ తీసుకోవడాన్ని నిలిపివేయాలని మంత్రిని కోరారు.

## 'రెండు వారాల్లో టీడీఎన్ పూర్తి'

- డ్రైపోర్ట్, నిమ్జ్ మెగా ఫుడ్, టెక్స్‌టైల్ పార్కులపై సమీక్ష

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

టీ ఫైబర్ ఆధ్వర్యంలో చేపడుతున్న టెక్నాలజీ డెమోన్‌స్ట్రేషన్ నెట్‌వర్క్ (టీడీఎన్) పనులను రెండు వారాల్లో పూర్తి చేస్తామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. మహేశ్వరంలోని నాలుగు గ్రామాల్లో ఈ నెట్వర్క్ పనులు కొనసాగుతున్నాయని, అవి పూర్తయితే ఈ హెల్త్, ఈ ఎడ్యుకేషన్, ఈ గవర్నెన్స్ రంగాల్లో టీ ఫైబర్ ప్రాజెక్టు ద్వారా రానున్న మార్పులను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం ఉందాన్నరు. సోమవారం టీఎస్ఐఐసీ కార్యాలయంలో పరిశ్రమలు, ఐటీ శాఖ పరిధిలో కొనసాగుతున్న పలు కార్యక్రమాలపై అధికారులతో మంత్రి సమీక్షించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికి ఇంటర్నెట్ ద్వారా కలిగే ప్రయోజనాలను రానున్న వరల్డ్ ఐటీ కాంగ్రెస్ సదస్సులో ఈనెట్ వర్క్ ద్వారా ప్రదర్శిస్తామన్నారు. వచ్చే వారం ఈనెట్ వర్క్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్‌ను ఆదేశించారు. టీవర్క్ డిజైన్లకు తుది ఆమోదం లభించిందని తెలిపారు. ఈడిజైన్, టీవర్క్ మొదటి దశ జూన్ నాటికి పూర్తవుతుందని చెప్పారు. వరంగల్ మెగా టెక్స్‌టైల్ పార్కుకు పర్యావరణ శాఖ అనుమతులు లభించాయని అధికారులు తెలిపారు. పార్క్ లే అవుట్ పూర్తయిందని, త్వరలోనే రోడ్లు, నీటి సౌకర్య పనులు కూడా పూర్తవుతాయని చెప్పారు. పార్కులను వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. భువనగిరి, జహీరాబాద్ జడ్జచర్లతో పాటు రాష్ట్ర నలుమూలలో డ్రై పోర్ట్ ఏర్పాట్ల కోసం పరిశీలించాలని అధికారులకు తెలిపారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, టీఐఐసీ ఎండీ నర్సింహారెడ్డి, టీఫైబర్ ఎండీ సుజయ్ కారంపూరి పాల్గొన్నారు.

# ఇక్కడా మనమే.. అక్కడా మనమే!

జై

అన్ని రోజులూ మనకు అనుకూలంగా ఉండవు. "తాటిని తన్నే వాడుంటే.. వాడి తలను తన్నే వాడు ఇంకొకడు ఉంటాడ"నేది సామెత. ఇప్పుడు, ఆ మాట దేశీయ ఈ-కామర్స్, సర్వీస్ సెక్టార్లో పాతుకుపోయిన రెండు బయటి కంపెనీలకు సరిగ్గా అతికినట్టు సరిపోతుంది. ఆ నేపథ్యంపై 'నవతెలంగాణ' స్పెషల్ స్టోరీ..

## అమెజాన్ కి స్వదేశంలో షాక్ ఇవ్వబోతున్న ఫ్లిప్ కార్ట్

- ఉబెర్ కి విదేశాల్లో చెక్ పెట్టిన ఓలా
- ఆశ్చర్యం కలిగిస్తోన్న దేశీయ సంస్థల మార్కెట్ స్కెచ్
- రానున్న కాలంలో విదేశీ సంస్థలు చాపచుట్టాల్సిందేనా?

గత వారంలో జరిగిన రెండు పరిణామాలు దేశీయ మార్కెట్ వర్గాల్లో కొత్త ఆశలకు జీవం పోయడంతో పాటు.. అంతర్జాతీయంగా భారత కంపెనీల సత్తాను ఇనుమడింపజేసే విధంగా ఉండటం ఆహ్వానించదగ్గ పరిణామం. వ్యాపారరంగంలో తమ పరిధిలను మరింతగా విస్తరించుకొని.. తద్వారా, తమ ప్రాబల్యాన్ని చెక్కుచెదరకుండా ఉండేలా చేసుకోవడానికి దేశీయ సంస్థలు ఫ్లిప్ కార్ట్, ఓలాలు వేసిన స్కెచ్ ప్రత్యర్థులైన విదేశీ సంస్థలు అమెజాన్, ఉబెర్ లకు చుక్కలు చూపిస్తుండటం విశేషం.

**ఫ్లిప్ కార్ట్ స్కెచ్ కు అమెజాన్ విలవిల?**

తీవ్ర నష్టాలు వస్తున్నప్పటికీ, అమెరికాకు చెందిన అంతర్జాతీయ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్.. భారత్‌లో తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించాలన్న తపనతో.. కోట్ల రూపాయలను పెట్టుబడులుగా పెడుతుండటం తెలిసిందే! ఐతే, అమెజాన్ కు దేశీయ ఆన్ లైన్ అంగడి సంస్థ ఫ్లిప్ కార్ట్ తాజాగా ముచ్చెమటలు పట్టిస్తోందన్న వాదన వినిపిస్తోంది. దీనికి కారణం రిటైల్ దిగ్గజం వాల్‌మార్ట్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ లో మైనార్టీ వాటా (15-20 శాతం) కొనుగోలుకు ఆసక్తి చూపడమే!

**ఎందుకు కొంటుంది?:**

వాల్‌మార్ట్ సంస్థ ఫ్లిప్ కార్ట్ లో పెట్టుబడులు పెట్టుటకు ముఖ్యంగా మూడు కారణాలై ఉండొచ్చని మార్కెట్ పండితులు అంచనా వేస్తున్నారు.

- స్వతహాగా, ఈ-కామర్స్ లో ఎంటర్ అయ్యి ఇప్పటికే, మార్కెట్లో పాతుకుపోయిన అమెజాన్, ఫ్లిప్ కార్ట్ లను ఢీకొట్టే కన్నా, దేశీయ(భారత) ఈ-కామర్స్ సంస్థతో కలిసి పనిచేయడం మంచిదన్న భావన ఉండటం.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరికల్లా భారత ఈ-కామర్స్ రంగం రూ. 2,14,500 కోట్ల స్థాయికి చేరుకోవచ్చన్న నిపుణుల అంచనా.
- ఇప్పటికే అతిపెద్ద స్టోర్ల ద్వారా దేశ రిటైల్ రంగంలోకి అడుగుపెట్టిన వాల్‌మార్ట్ కు.. ఆన్‌లైన్‌లోనూ విస్తరించాలన్న కోరిక ఉండటం..

**ఇప్పుడంత కష్టం కాదు**

మాతృ సంస్థ నుంచి సుమారు రూ.8 వేల కోట్ల నిధులను తాజాగా సమీకరించిన అమెజాన్ ఇండియాను తట్టుకోవడం ఫ్లిప్ కార్ట్ కు సాధ్యమవుతుందా? అంటే, అది ఇప్పుడు అంత కష్టమేమి కాదంటున్నారు విశ్లేషకులు.. దీనికి కారణం.. వాల్ మార్ట్ సంస్థ ఫ్లిప్ కార్ట్ లో దాదాపు రూ.6,400 కోట్లను పెట్టుబడిగా పెట్టడమే గాకుండా.. సంస్థ తదుపరి వ్యాపార విస్తరణలో పూర్తి సహకారాన్ని అందించే దిశగా ఆలోచనలు చేస్తుండటమే! అంతేనా, ఈ ఆర్థిక సంవత్సరంలో ఫ్లిప్‌కార్ట్ ఇప్పటికే, ఏకంగా రూ. 26,000కోట్ల నిధులను సాఫ్ట్ బ్యాంక్, టెన్సెంట్, మైక్రోసాఫ్ట్, ఈబే సంస్థల నుంచి సమకూర్చుకోవడం గమనార్హం.



**'ఓలా'లా అనిపిస్తుందిగా!:**

2011లో ఇండియాలో ప్రారంభించబడి 110 నగరాల్లో ప్రతిరోజూ 20 లక్షల రైడ్స్ తో దూసుకెళ్తున్న దేశీయ ఓలా క్యాబ్స్.. ప్రముఖ రైడ్ సర్వీసుల సంస్థ ఉబెర్‌కు ఇండియాలోనే గాక, ఆస్ట్రేలియాలో కూడా గట్టి షాక్ నే ఇచ్చింది. మెల్‌బోర్న్, సిడ్నీ, పెర్త్ నగరాల్లో తమతో కలిసి పనిచేయాలంటూ ప్రైవేట్ వెహికిల్ ఓనర్లను, డ్రైవర్ పార్టనర్లను ఓలా తాజాగా ఆహ్వానిస్తూ.. క్యాబ్ సేవలను ఆస్ట్రేలియాలో ప్రారంభిస్తుండటం విశేషం. కాగా, ఇప్పటివరకు ఆస్ట్రేలియాలో అగ్రగామిగా ఉన్న ఉబెర్ కు ఓలా సంస్థ అక్కడ కూడా గట్టి పోటీని ఇవ్వగలదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**విదేశాల్లోకి ఇప్పుడే ఎందుకు?**

ఓలా సంస్థ విదేశీ మార్కెట్ పై కన్ను వేయడానికి ముఖ్యంగా మూడు కారణాలై ఉండొచ్చని మార్కెట్ ఎనలిస్టులుసెలవిస్తున్నారు.

- డ్రైవర్లకు ప్రోత్సాహకాలు, ప్యాసింజర్లకు డిస్కౌంట్లు, నిర్వాహణ బ ందంలో వివాదాలు అన్నిటికీ మించి ఓలాతో పోటీ.. ఇవన్నీ దేశంలో ఉబెర్ సంస్థను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇప్పటికే, సుమారు రూ. 8338కోట్లను భారత మార్కెట్లో కుమ్మరించి నష్టాలను మూటగట్టుకుంటున్న ఉబెర్.. అమెరికా, యూరప్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో సైతం స్థానిక కంపెనీలనుండి తీవ్రమైన పోటీని ఎదురుకోవడం ఓలాకు కలిసొచ్చింది.
- వివిధ దేశాలు పర్యావరణహిత వాహనాలకు ప్రాధాన్యతనిస్తుండటం.. ఎలక్ట్రిక్ వెహికల్స్, ఇకో ఆటోలు, సైకిళ్ళ సెక్టార్లో ఓలా ఇప్పటికే పరిశోధనలు ప్రారంభించడం..
- విదేశాల్లో పాపులర్ అవుతోన్న కనెక్టెడ్ కారు ప్లాట్‌ఫామ్‌ను అభివృద్ధి చేయడానికి మైక్రోసాఫ్ట్ టెక్నాలజీ ఇప్పటికే, ఓలా సొంతమవడం..

**ఇప్పుడంత కష్టం కాదు**

టెన్సెంట్, సాఫ్ట్ బ్యాంక్, యూసీ-ఆర్‌ఎన్‌టీ, ఫాల్కన్ ఎడ్జ్ వంటి సంస్థల నుండి అమోఘమైన పెట్టుబడులు( దాదాపు రూ. 7055కోట్లని అంచనా ) ఓలాకు రావడాన్ని చూస్తే, నిధుల సమీకరణ ఇప్పుడు సదరు సంస్థకు అంత కష్టంగా అనిపించట్లేదనే చెప్పాలి. అందుకే, అదే ధీమా ఆస్ట్రేలియా మార్కెట్లోకి ఓలా సంస్థ కాలుమోపడానికి రాచమార్గాన్ని ఏర్పరిచిందన్న విషయాన్ని కాదనగలమా?

# రగిలిన కంది రైతులు

- పోలీసులు, రైతులకు తోపులాట
- పలువురికి స్వల్పగాయాలు
- పత్తాలేని మార్క్‌ఫెడ్, డీసీఎంఎస్ అధికారులు
- చివరి ఉన్నతాధికారుల హామీతో విరమణ

**నవతెలంగాణ-యాలాల/పెద్దేముల్**

వికారాబాద్ జిల్లా యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని కనీసం నెల రోజులు కూడా కొనసాగించకుంటే పంటను ఎక్కడ అమ్ముకోవాలని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం 14రోజులు కేంద్రాన్ని కొనసాగించారని, అప్పుడూ దళారులు తెచ్చిన పంటకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారని రైతులు వాపోయారు. వెంటనే ఆర్డీఓ, మార్క్‌ఫెడ్ అధికారులు కేంద్రం వద్దకు వచ్చి తిరిగి కందుల తూకాలు ప్రారంభించేలా ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా వినలేదు. తాండూరు డీఎస్పీ రామచంద్రుడు నేతలతో ఫోన్‌లో మాట్లాడినా ఫలితం లేకపోయింది. దీంతో తాండూరు టౌన్ సీఐ ప్రతాప్‌లింగం ఆధ్వర్యంలో డివిజన్ పోలీసులు వచ్చి చెదరగొట్టే ప్రయత్నం చేయగా తోపులాట జరిగింది. ఈ తోపులాటలో పలువురు రైతులకు స్వల్ప గాయాలయ్యాయి. అనంతరం రైతులతో కలిసి నాయకులు కేంద్రం దగ్గరకు వెళ్లి ఆర్డీఓ, యాలాల తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. రైతుల సమస్యను పరిష్కరించాలని కోరడంతో తహసీల్దార్ అశోక్‌కుమార్ కేంద్రానికి వచ్చారు. విషయాన్ని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ జ్యోతితో రైతుల ఎదుటనే ఫోన్‌లో మాట్లాడారు. రాష్ట్ర మార్కెటింగ్ శాఖ ఆదేశాల మేరకే కందుల కొనుగోలు కేంద్రాలను నిలిపేశామని ఆమె చెప్పారు. ఆ తర్వాత కొనుగోలు చేసేందుకు సుముఖత వ్యక్తం చేశారు. వారం రోజులుగా తూకాలు చేయని కందులను అక్కడే తూకం వేయాలని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ నుంచి యాలాల తహసీల్దార్ అశోక్‌కుమార్ ఆదేశాలు జారీ అయ్యాయి. దాంతో ఆయన వెంటనే మార్క్‌ఫెడ్, డీసీఎంఎస్ నిర్వాహకులతో మాట్లాడి రైతులకు టోకెన్లు పంపిణీ చేశారు. ఇక నుంచి వచ్చే కందులను రైతులు ప్రధాన కేంద్రానికి తీసుకెళ్లాలని సూచించారు.

**పెద్దేముల్‌లో..**

పెద్దేముల్ మండలంలోనూ రైతులు పురుగుల మందుతో రోడ్డుపై బైటాయించారు. అక్కడే వంటావార్పు చేసుకున్నారు. దాదాపు 5గంటలు రోడ్డుపై బైటాయించారు. తాండూరు డివిజన్ ఆర్డీఓ మధుసూదన్, తహసీల్దార్ రాములు, పెద్దేముల్ తహసీల్దార్ తులసిరాం, ఎస్ఐ వెంకటశ్రీను ఘటనా స్థలానికి చేరుకొని రైతులకు నచ్చజెప్పేందుకు యత్నించారు. తమకు స్పష్టమైన హామీ ఇచ్చే వరకు కదిలేది లేదని రైతులు భీష్మించుకుకూర్చున్నారు. అనంతరం తాండూరు రూరల్ సీఐ సైదిరెడ్డి, వికారాబాద్ డీఎస్పీ శిరీష, సీఐ వెంకటరామయ్య అక్కడికి చేరకుని ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడాక.. ఇప్పుడు సెంటర్ దగ్గర ఉన్న కందులను తూకం చేస్తామని, తర్వాత వచ్చిన కందులను తాండూరు మార్కెట్‌లో తూకం చేసే విధంగా చర్యలు చేపడుతారని అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు.



పెద్దేముల్‌లో పురుగు మందు డబ్బాలు తెచ్చుకున్న రైతులు

## మద్దతు ధర కోసం రైతుల ఆందోళన

- ఎర్రజొన్న, పసుపును ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్

**నవతెలంగాణ-కమ్మర్‌పల్లి**

మద్దతు ధర కోసం ఎర్రజొన్న, పసుపు రైతులు రోడ్డెక్కారు. మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని 63వ నెంబర్ జాతీయ రహదారిపై మహాధర్నా చేపట్టారు. సుమారు రెండు గంటల పాటు ధర్నా జరగడంతో కిలో మీటరు వరకు వాహనాలు నిలిచి పోయాయి. ఈ సందర్భంగా మాజీ స్పీకర్ కేఆర్.సురేష్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు కష్టపడి పండించిన ఎర్రజొన్న, పసుపుకు మద్దతు ధర కల్పించడం లేదని అన్నారు. 2008లో వ్యాపారి మోసం చేస్తే రైతులకు అండగా నిలిచి 153 జీవో విడుదల చేసి రూ.35 కోట్లు మంజూరు చేశామని గుర్తుచేశారు. ఇప్పటి పరిస్థితులకనుగుణంగా రైతులకు క్వింటా ఎర్రజొన్నకు రూ.4,500 మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి వి.ప్రభాకర్ మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. ఎకరం ఎర్రజొన్న సాగుకు రూ.45,500 ఖర్చవుతుంటే.. ప్రస్తుతం దళారులు, వ్యాపారులు నిర్ణయించిన ప్రకారం రైతుకు రూ.7,500 నష్టం వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకుడు రాజారాం యాదవ్ మాట్లాడుతూ పసుపు క్వింటాకు రూ.15వేల మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ అర్చనకు అందజేశారు.

## అసెంబ్లీ ప్రోరోగ్

(మొదటిపేజీ తరువాయి)

చట్టం తేవాలని ప్రభుత్వం భావించింది. కాబట్టి అసెంబ్లీ ప్రోరోగ్ నోటిఫికేషన్ విడుదల చేయలేదు. ప్రస్తుతం ప్రోరోగ్ నోటిఫికేషన్ రావడంతో బీసీల సమస్యలు, పంచాయతీరాజ్ చట్టం రానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రత్యేకంగా చర్చించే అవకాశం ఉందని అసెంబ్లీ వర్గాలు అంటున్నాయి. ఆ లోపు ప్రభుత్వం వీటిపై ఆర్డినెన్స్ తెచ్చే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి.

## అగ్ని-1 విజయవంతం

(మొదటిపేజీ తరువాయి)

కలాం ద్వీపం(వీలర్ ఐలాండ్) నుంచి ఈ క్షిపణిని పరీక్షించారు. అగ్ని-1 సుమారు 12 టన్నుల బరువు ఉంటుంది. 15 మీ.పొడవు,ఒక మీటర్ వెడల్పు ఉండే ఈ క్షిపణి 1000 కిలోల బరువును మోసుకుపోగలదు. నిర్దేశించిన అన్ని ప్రమాణాలను ఇది పూర్తి చేసిందని అధికారులు తెలిపారు. అగ్ని-1ను అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ల్యాబొరేటరీలో రక్షణ పరిశోధన సంస్థలు డీఆర్‌డీఎల్, ఆర్‌సీఐ రూపొందించాయి. అగ్ని-1కు సంబంధించి ఇది 18వ పరీక్ష. అగ్ని-1ను ఇప్పటికే సైన్యానికి అందుబాటులో ఉంచారు.

## జాబివ్వని దద్దమ్మ కేసీఆర్

(మొదటిపేజీ తరువాయి)

జెండాను ఊపి ప్రారంభించారు.అనంతరం ఉత్తమ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 40 మాసాలు గడుస్తున్నా ఏడు వేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అప్రజాస్వామిక నియంతత్వ నిరంకుశ గడీల పాలనను వ్యతిరేకిస్తూ ఈ యాత్ర సాగుతుందన్నారు. ఏఐసీసీ అధ్యక్షులు రాహుల్‌గాంధీ ఆదేశాలమేరకు యువజన కాంగ్రెస్ రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ యువజనులను చైతన్య పరిచేందుకు 'నిరుద్యోగ చైతన్య యాత్ర' ను చేపట్టిందన్నారు. నేడు ఆలంపూర్ నియోజకవర్గం నుంచి ఈ యాత్ర ప్రారంభమవుతుందని, 49 రోజుల పాటు దాదాపు 119 నియోజకవర్గాలలో తిరుగుతుందన్నారు. నిరుద్యోగులను ప్రభుత్వం ఎలా మోసం చేస్తుందో చెప్పి నిరుద్యోగులను చైతనపరుస్తోందన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగులు ఉద్యోగాలు లేక ఉపాధి కరవై ఆత్మహత్యలు చేసుకుంటుంటే కేటీఆర్ సూటు, బూటు వేసుకొని విదేశాలలో పర్యటిస్తూ విలాసాలు చేస్తున్నారని విమర్శించారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ఒక్క పరిశ్రమ కూడా రాకపోగా, దాదాపు 5 వేల పరిశ్రమలు మూత పడి వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయారని చెప్పారు. నాలుగేండ్ల కాలంలో ఒక్క డీఎస్సీ కూడా వేయలేని చేత కాని దద్దమ్మ పాలకులని, రానున్న కాలంలో అధికారంలోకి కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఖాళీలను భర్తీ చేయడమే కాకుండా నిరుద్యోగులకు నిరుద్యోగ భతి ఇచ్చి వారికి ఉద్యోగాలు వచ్చే వరకు అండగా ఉంటామన్నారు. టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మల్లు భట్టి విక్రమార్క, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, ఉపాధ్యక్షులు పొన్నం ప్రభాకర్, జాతీయ ప్రధాన కార్యదర్శి బి వి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మగబిడ్డలేడని...

(మొదటిపేజీ తరువాయి)

మండలం ఉద్దెమర్రికి చెందిన మానస(23)తో మూడేండ్ల కింద పెండ్లయింది. వీరికి మానశ్రీ (2), గీతశ్రీ (6) ఇద్దరు ఆడబిడ్డలు పుట్టారు. రమేష్ పాలవ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆడపిల్లలు పుట్టారనే నెపంతో అత్తామామ, ఆడపడుచులు తరచూ వేధించేవారు. వారం కింద ఉద్దెమర్రిలో జాతర ఉండటంతో మానస ఇద్దరు పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లింది. సోమవారం కొండాపూర్‌కు వచ్చింది. వచ్చీరాగానే వేధింపులు యధావిధిగా కొనసాగుతుండటంతో మానస భర్తకు మొరపెట్టుకుంది. వారిద్దరూ కూర్చొని లోలోన కుమిలిపోయారు. తీవ్ర మనస్తాపానికి వారిద్దరూ పిల్లలను తీసుకుని స్కూటర్‌పై కీసరలోని పెద్దమ్మ చెరువు వద్దకు వెళ్లారు. ఇద్దరు పిల్లలతోని వారిద్దరూ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. పెద్దమ్మ చెరువు వద్ద స్కూటర్ ఉండటంతో గమనించిన మానస బంధువులు కీసర పోలీసులకు సమాచారమందించారు. కీసర సీఐ సురేందర్ తన సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకున్నాడు. గజ ఈతగాళ్లను పిలిపించి మృతదేహాలను బయటకి తీసుకొచ్చారు. స్థానికులు, మానస బంధువులు చెరువు వద్దకు పెద్దఎ త్తున చేరుకున్నారు. మృతదేహాలను బయటకి తీస్తున్న క్రమంలో వారంతా బోరున విలపించారు. దీంతో ఆ ప్రాంతమంతా విషాద సంద్రంతో నిండిపోయింది. అత్తామామ, ఆడపడుచులు ఆడపిల్లలు పుట్టారని వేధించడంతోనే తన కూతురు, అల్లుడు ఆత్మహత్య చేసుకున్నారని మృతురాలి తల్లిదండ్రులు కన్నీరు పెడుతూ పోలీసులకు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం శవాలను గాంధీ ఆస్పత్రికి తరలించారు.

## దళిత రైతు భూమిలో పెన్నా తవ్వకాలు

(మొదటిపేజీ తరువాయి)

భూమిలో అక్రమంగా తవ్వకాలు చేయించారు. తమ భూమిలో ఎందుకు పరీక్షలు చేస్తున్నారు? ఎందుకు తవ్వుతున్నారు? అని బాధిత రైతులు ప్రశ్నించగా.. పెన్నా కంపెనీకి చెందిన కొందరు భయభ్రాంతులకు గురిచేశారు. ఈ క్రమంలోనే పెన్నా సిమెంట్ పరిశ్రమ అక్రమంగా తవ్వకాలు చేపడుతున్నదని పోలీస్‌స్టేషన్‌లో నన్నే రాములు, అతని కుమారుడు రమేష్, వజ్రమ్మ ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసి ఏడు నెలలు గడిచినా నేటికీ చర్యలు తీసుకోలేదు.

**మా తండ్రి నుంచి ఈ భూమి వచ్చింది : బాధితుడు నన్నెపంగు రాములు**

మాకు ఈ భూమి మా తండ్రి నుంచి సంక్రమించింది. 50 ఏండ్ల నుంచి ఈ భూమినే సాగు చేసుకుంట బతుకుతున్నం. ఏడు నెలల కింద భూమిలో పెన్నా సిమెంట్ పరిశ్రమ వాళ్లు వచ్చి అక్రమంగా తవ్వకాలు జరిపారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. కానీ, ఇంతవరకు అధికారులు చర్యలు తీసుకోలేదు.

**మా దృష్టికి రాలేదు : పద్మావతి, తహసీల్దార్**

బాధితుల నుంచిగానీ, పోలీస్‌స్టేషన్ నుంచిగానీ దరఖాస్తు అందలేదు. అందిన వెంటనే సర్వే చేసి ఆ భూమి ఎవరిదో తేలుస్తాం. బాధిత రైతులదే భూమి అని తేలితే పెన్నా సిమెంట్ పరిశ్రమపై ఉన్నతాధికారులకు తెలిపి చర్యలు తీసుకుంటాం.

**ఏడు నెలల కిందే ఫిర్యాదు అందింది : యాదవేంద్రరెడ్డి, ఎస్ఐ**

ఏడు నెలల కింద ఫిర్యాదు అందిన మాట వాస్తవమే. నిర్ధారణ కోసం రెవెన్యూ కార్యాలయానికి ఆ దరఖాస్తు పంపాం. వారి నుంచి ఇంతవరకు ఎటువంటి వివరణా రాలేదు. అందుకే చర్యలు తీసుకోలేదు.

**మా భూముల్లో మాత్రమే తవ్వకాలు జరిపాం: ప్రకాశ్, పెన్నా సిమెంట్ పీఆర్వో**

మేము ఎవరి భూముల్లో మైనింగ్ కోసం తవ్వకాలు జరపలేదు. గతంలో మా భూముల్లోనే మైనింగ్ కోసం పరీక్షలు నిర్వహించాం.

# రెండింతల ఆదాయ కోసం బీజేపీ నిర్దిష్ట చర్యలేంటి?

- లోక్‌సభ చర్చలో వినోద్‌కుమార్ ప్రశ్న
- టీఆర్ఎస్ సర్కారు పలు చర్యలు చేపట్టిందని వెల్లడి

**నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో**



2022 వరకు రైతుల ఆదాయాన్ని రెండింతలు చేస్తామని కేంద్ర ప్రభుత్వం పేర్కొన్నదని, కానీ ఆ లక్ష్యాన్ని ఎలా సాధిస్తారో అటు రాష్ట్రపతి ప్రసంగంలో ఇటు వార్షిక బడ్జెట్‌లో పేర్కొనలేదని టీఆర్ఎస్ ఎంపీ వినోద్‌కుమార్ ఆక్షేపించారు. రాష్ట్రపతి ప్రసంగంలో పేర్కొన్న కేంద్ర ప్రభుత్వ పథకాలన్నీ స్వాగతిస్తున్నామని, అయితే క్షేత్రస్థాయిలో వాస్తవాలను విస్మరించారని అన్నారు. మంగళవారం లోక్‌సభలో జరిగిన రాష్ట్రపతి ప్రసంగ ధన్యవాద తీర్మానంపై వినోద్‌కుమార్ మాట్లాడారు. రైతుల ఆదాయాన్ని రెండింతలు చేసేందుకు చేపడుతున్న నిర్దిష్ట చర్యలు పేర్కొనలేదని చెప్పారు. 'నూతనంగా ఏర్పాటైన తెలంగాణలో రైతుల ఆదాయాన్ని రెండింతలు చేసేందుకు రూ. 35 వేల కోట్లతో 40 వేల చెరువుల పునరుద్ధరణ చేపట్టాం. ఒకటి రెండు సంవత్సరాల్లో దీని ఫలితాలు వచ్చాయి. రాష్ట్రంలో రైతులకు ఉచితంగా కరెంటు ఇస్తున్నాం. గోదావరి, కృష్ణా నదులపై కాళేశ్వరం, పాలమూరు సాగునీటి ప్రాజెక్టులు నిర్మిస్తున్నాం. ఎన్నికల్లో హామీనిచ్చినట్టుగా రైతు రుణమాఫీ చేశాం. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి ఖరీఫ్, రబీ సీజన్‌లకు కలిపి ఒక్కో ఎకరానికి రూ. ఎనిమిది వేలు పెట్టుబడికి ఇస్తున్నాం' అని వివరించారు. నూతన రాష్ట్రమైన తెలంగాణ ఇన్ని చర్యలు చేపట్టిందని, కేంద్ర ప్రభుత్వం తన హామీని ఎలా అమలు చేస్తుందని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్రం సాయం చేస్తుందని భావించామని, కానీ బడ్జెట్‌లో కేటాయింపులు ఏమీ చేయలేదని అన్నారు. ఇక ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు సామాజిక న్యాయం చేసేందుకు రాష్ట్రంలో రిజర్వేషన్లను 62 శాతం పెంచుతూ బిల్లు ఆమోదించామని తెలిపారు. ఈ బిల్లును రాష్ట్రపతి ఆమోదానికి పంపామని కానీ ఇప్పటి వరకు అడుగు ముందుకు పడలేదని చెప్పారు. 'తెలంగాణ సర్కారు బిల్లుపై మీ వైఖరి ఏంటి?' ఈ ప్రశ్నపై జైట్లీ వివరణలో సమాధానం ఇస్తారని భావిస్తున్నామని అన్నారు. తెలంగాణ కొత్త రాష్ట్రంలో కొత్త రైల్వేలైన్లు మంజూరవుతాయని భావించామని, కానీ బడ్జెట్ నిరాశపరిచిందని చెప్పారు. చివరగా నవోదయ స్కూళ్ల టీచర్ల సమస్యలను పరిష్కరించాలని వినోద్‌కుమార్ కోరారు. లేకపోతే ఈ స్కూళ్ల మనుగడ కష్టమవుతుందని తెలిపారు.

## మీ బిడ్డలకు పకోడీ షాపులు పెట్టిస్తారా?

(మొదటిపేజీ తరువాయి)

సంక్షోభం తదితర సమస్యలను కూడా ప్రస్తావించాల్సిందని అన్నారు.

లోక్‌సభలో మంగళవారం రాష్ట్రపతి ప్రసంగ ధన్యవాద తీర్మానంపై జరిగిన చర్చపై సీపీఐ(ఎం) లోక్‌సభ ఉపనేత మహ్మద్‌సలీం మాట్లాడారు. "సామాజిక, ఆర్థిక ప్రజాస్వామ్యం సాధించకుండా రాజకీయ ప్రజాస్వామ్యం మనుగడ సాధించలేదు' అని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వ్యాఖ్యలను రాష్ట్రపతి ప్రస్తావించడాన్ని స్వాగతిస్తున్నాం. సీపీఐ(ఎం)గా కొన్ని సంవత్సరాలుగా మేం ఇదే చెబుతున్నాం. ప్రజాస్వామ్యం అంటే కేవలం ఓటు వేయడం, ఎన్నికల్లో గెలవడమే కాదు. సామాజిక, ఆర్థిక ప్రజాస్వామ్యం రావాలి. అది సాధించాలంటే ప్రజాస్వామ్య సంస్థలను బలోపేతం చేయాలి" అని అన్నారు. కానీ మోడీ సర్కారు హయాంలో ప్రజాస్వామ్య పునాదులపై దాడి జరుగుతోందని విమర్శించారు. ఇందుకు పార్లమెంట్ ప్రజాస్వామ్య వ్యవస్థ కూడా మినహాయింపు కాదని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా సభా కార్యక్రమాలు జరుగుతున్నాయని అన్నారు.

ఇక కేంద్రంలోని బీజేపీ సర్కారు విశ్వాసం కోల్పోతుందని చెప్పారు. అందుకు టీడీపీ ఎంపీలు వెల్‌లో ఆందోళన చేయడం నిదర్శనమని చెప్పారు. 'నాలుగేండ్లుగా మాటలతో సరిపెట్టారు. ఇప్పుడు కేంద్రమంత్రులు చెప్పినా నమ్మే పరిస్థితి లేదు' అని అన్నారు. శివసేన, బీజేడీ ఎంపీలు సైతం ఇదే వైఖరితో ఉన్నారని అన్నారు. ఒకప్పుడు ఎన్డీయేలో 25 పార్టీలు ఉండేవనీ, అవన్నీ ఎటుపోయాయని ప్రశ్నించారు. 'రాష్ట్రపతి ప్రసంగ ధన్యవాద తీర్మానం బీజేపీ నేతలు ప్రవేశపెడితే.. దాన్ని భాగస్వామ్యపార్టీ బలపరచాలి. కానీ వీరికి(బీజేపీ) ఎవరిపైనా నమ్మకం లేదు. అందుకే రెండూ ఆ పార్టీ నేతలే కానిచ్చేశారు' అని అన్నారు. ఇక ఎన్నికల్లో గెలిచేందుకు బీజేపీ ఎంతకైనా దిగజారుతోందని అన్నారు. 'త్రిపుర ఎన్నికల్లో గెలిచేందుకు అక్కడి వేర్పాటువాద ఉగ్రవాద సంస్థలతో బీజేపీ పొత్తుపెట్టుకుంది' అని విమర్శించారు. జమ్మూకాశ్మీర్‌లో పీడీపీతో జత కట్టిందని అన్నారు. 'ఎన్నికల సమయంలో 55 అంచుల ఛాతి చూపారు. కానీ నియంత్రణ రేఖ వద్ద కాల్పుల ఉల్లంఘనలో దేశ సైనికులు ప్రతిదినం ప్రాణాలు కోల్పోతున్నారు. ఇంతపెద్ద సంఖ్యలో సైనికులు చనిపోయిన దాఖలాలు లేవు. మార్కెటింగ్ వ్యూహంలో పడి 55 అంచుల ఛాతి మరిచారు' అని ప్రధాని మోడీని ఎద్దేవా చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వ్యక్తిగత ఇష్టాలను సహించలేక హత్యలు చేస్తున్నారని విమర్శించారు. దేశంలో ఉద్దేశపూర్వకంగా విద్వేషపూరిత వాతావరణం సృష్టించారని వాపోయారు. ఈ సందర్భంగా కేరళకు చెందిన హదియాతో పాటు యూపీలో దారుణ హత్యకు గురైన బెంగాల్ వలస కార్మికుడి అంశాన్ని ప్రస్తావించారు. ఇక కేంద్ర పథకాల్లో పెద్దఎత్తున అవినీతి జరుగుతోందని సలీం విమర్శించారు. 'కేంద్ర పథకాలకు విడుదల చేస్తున్న నిధులు లబ్ధిదారులకు చేరడం లేదు. ఇందులో అవినీతి జరుగుతోంది. కేంద్రం చర్యలు చేపట్టాల్సిన అవసరముంది' అని అన్నారు. రాష్ట్రపతి ప్రసంగంలో భీమా-కోరేగావ్ దళితులపై మతోన్మాదులు చేసిన దాడిని ఖండించాల్సి ఉండేనని సలీం అభిప్రాయపడ్డారు. దళిత సామాజిక తరగతికి చెందిన రామ్‌నాథ్‌కోవింద్ రాష్ట్రపతి స్థానంలో ఉన్నారని, ఇలాంటి ఘటనలను ఖండిస్తే ఎస్సీల్లో ఓ విశ్వాసం కలిగేదని అన్నారు.

# జీహెచ్ఎంసీ సెంట్రల్ జోన్ ఆఫీస్‌లో అగ్ని ప్రమాదం

- ఆడిట్ విభాగంలోని ఫైళ్లన్నీ దగ్ధం
- గతంలోనూ రెండుసార్లు జరిగాయంటున్న అధికారులు
- సందర్శించిన నాయిని నర్సింహారెడ్డి
- విచారణ జరిపించాలి : మేయర్ బొంతు రామ్మోహన్

**నవతెలంగాణ - సిటీబ్యూరో**

హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని జీహెచ్ఎంసీ సెంట్రల్ జోన్ కార్యాలయం మొదటి అంతస్తులో మంగళవారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఆడిట్ విభాగంలోని కీలక ఫైల్స్ కాలి బూడిదయ్యాయి. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మొదటి అంతస్తులో ఉదయం 6.35 గంటలకు పొగలు వచ్చాయి. వీటిని గమనించిన సెక్యూరిటీ సిబ్బంది యూసుఫ్‌గూడ సర్కిల్ శానిటరీ సూపర్‌వైజర్ విజయ్‌కుమార్‌కు సమాచారమిచ్చారు. వెంటనే ఫైర్ స్టేషన్‌కు ఫోన్ చేయడంతో 15 నిమిషాల్లో చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించగా, సోమవారం రాత్రి 7.45 గంటలకు తాళాలేశారు. రాత్రి 9.10 గంటల సమయంలో సెక్యూరిటీ సిబ్బంది గ్రిల్స్ వేశారు. అర్ధరాత్రి 12.50 గంటల సమయంలో ఆడిట్ విభాగం నుంచి మంటలు వచ్చినట్టు గుర్తించారు. షార్ట్‌సర్క్యూట్ వల్లే మంటలు వచ్చినట్టు పుటేజీ ఆధారంగా తెలిసిందని అధికారులు చెబుతున్నారు. అయితే, గతంలోనూ రెండుసార్లు ప్రమాదాలు జరిగినా పట్టించుకోలేదన్న వార్తలు వినిపిస్తున్నాయి. గతంలో ఇంజినీరింగ్ పనుల్లో చోటుచేసుకున్న అక్రమాలకు సంబంధించిన ఫైల్స్ కోసం ఎవరైనా ఈ పని చేశారా? అని పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.

**కీలక దస్త్రాలు దగ్ధం**

ఆడిట్ విభాగంలో కీలక దస్త్రాలన్నీ కాలిపోయాయి. ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ఛాంబర్ అంతా కాలింది. ఐదు అల్మారాలు, వాటిలోని స్టాక్ ఫైల్స్, పేపర్లు, పీఆర్‌సీ బిల్స్, తొమ్మిది కంప్యూటర్లు, సీపీయూ, మానిటర్స్, ప్రింటర్స్, స్కానర్లు, బీఎస్ఎన్ఎల్ రూటర్, మీడియా కన్వర్టర్ అన్నీ బూడిదయ్యాయి. 295 రన్నింగ్ బిల్స్, మెజర్‌మెంట్ బుక్స్ (ఎంబీ), పెండింగ్‌లో ఉన్న పనులు, మిగిలిన పనులకు సంబంధించిన ఫైళ్లు కూడా దగ్ధమయ్యాయి. అయితే, కాలిపోయిన వాటిలో పర్మినెంట్ రికార్డులు లేవని, స్టాక్ ఫైల్స్ మాత్రమే కాలిపోయాయని అసిస్టెంట్ ఎగ్జామినర్ అకౌంట్స్ చెప్పారు. కాలిపోయిన 295 బిల్స్‌ను ఆన్‌లైన్, ఇన్‌వార్డు ఫైళ్ల ఆధారంగా, ఎంబీలను ఇంజినీరింగ్ విభాగంలోని వివరాల ఆధారంగా తయారు చేసుకోవచ్చని తెలిపారు.

**ఫైర్ సేఫ్టీ లేదు**

నగరంలోని భవనాలకు ఫైర్ సేఫ్టీ లేదని జీహెచ్ఎంసీ అధికారులు పదేపదే చెబుతున్నారు. దీని కారణంగా చాలా ఫైళ్లను అధికారులు పక్కనబెట్టారు. కానీ జీహెచ్ఎంసీ కార్యాలయాలకే ఫైర్ సేఫ్టీలేదు. ముఖ్యంగా సెంట్రల్ జోన్ కార్యాలయానికి ఎలాంటి ఫైర్ సేఫ్టీ లేదు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం పరిస్థితి కూడా అంతంత మాత్రంగానే ఉందని అధికారులు చెబుతున్నారు. మిగిలిన జోనల్ కార్యాలయాల్లో భద్రత చర్యలు శూన్యమని సిబ్బంది అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**విచారణ చేయాలి : మేయర్ బొంతు రామ్మోహన్**

సెంట్రల్ జోన్ కార్యాలయంలో అగ్నిప్రమాదంపై విచారణ జరిపించాలి. ఇరుకుగా ఉన్న సర్కిల్ కార్యాలయాలను ఆయా ప్రాంతాలకు తరలించాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు.

**కేసు నమోదు చేశాం : ఇన్‌స్పెక్టర్, సైఫాబాద్ పోలీస్‌స్టేషన్**

అగ్నిప్రమాదం ఘటనను పరిశీలించిన పోలీసులు క్రైం నెం.58/2018 కేసు నమోదు చేశారు. సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నాం. ఆడిట్ విభాగంలో కీలక ఫైళ్లు ఉన్నాయి. ఇదీ షార్ట్‌సర్క్యూటా? ఇంకేమైనా జరిగిందా? అనేది తెలుసుకోవడానికి ఫైర్, విద్యుత్ శాఖలకు లేఖలు రాస్తున్నాం. పూర్తిస్థాయిలో విచారణ జరుపుతాం.

# మోడల్‌స్కూల్స్ ప్రిన్సిపల్స్ అధికారాలకు కత్తెర

- విద్యాశాఖ మరో వివాదాస్పద ఉత్తర్వులు
- మెటర్నిటీ, మెడికల్ లీవ్స్, ఇంక్రిమెంట్లు డీఈఓల నుంచే...
- వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు



**నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్**

ప్రభుత్వ పాఠశాలల్లో సెలవుల మంజూరుపై రగడ మరువక ముందే పాఠశాల విద్యాశాఖ మరో వివాదాస్పద ఉత్తర్వులు జారీ చేసింది. మొన్న ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులకు అధికారులను కత్తిరించగా, తాజాగా మోడల్ స్కూల్ ప్రిన్సిపల్స్ అధికారులకూ కోత పెట్టింది. పలు రకాల సెలవుల మంజూరును జిల్లా విద్యాశాఖాధికారులకు కేటాయిస్తూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలు జారీచేశారు. ఈ ఉత్తర్వులపై మోడల్ స్కూల్ టీచర్లతో పాటు ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి.

రాష్ట్రంలో 194 మోడల్ స్కూళ్లలో మూడు వేలమంది పీజీటీ, టీజీటీ టీచర్లు పనిచేస్తున్నారు. ఈ పాఠశాలలు ప్రారంభమైన 2013 నుంచి అన్ని రకాల సెలవుల మంజూరు ఆ పాఠశాల ప్రిన్సిపల్ చేతిలో ఉండేది. దీంతో అన్వెల్ గ్రేడ్ ఇంక్రిమెంట్లు (ఏజీఈ) కూడా టీచర్లు ప్రిన్సిపల్‌కు దరఖాస్తు చేసుకుంటే మరుసటి నెల వేతనంతో వారికి ఏజీఈ అందేది. అయితే సెలవులు, ఇంక్రిమెంట్ల మంజూరులో అక్రమాలు జరుగుతున్నాయనే పేరుతో పాత విధానాలకు పాఠశాల విద్యాశాఖ స్వస్తి చెప్పి, ప్రిన్సిపల్ అధికారాలకు కోత పెట్టింది. ప్రిన్సిపల్స్ కేవలం పీజీటీ, టీజీటీ ఉపాధ్యాయులకు క్యాజువల్ లీవ్స్ మంజూరు చేయడంతో పాటు ఆప్షనల్ హాలీడేస్ మాత్రమే ఇచ్చే అధికారులను కట్టబెడుతూ రెండు రోజుల క్రితం అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల ప్రకారం మెటర్నిటీ, ఫెటర్నిటీ, మెడికల్ లీవ్స్ మంజూరు జిల్లా విద్యాశాఖ అధికారులకు అప్పగించారు. మూడు నెలల సమయం కంటే ఎక్కువ రోజులైతే ఆ సెలవుల మంజూరు డైరెక్టరేట్ నుంచి తీసుకోవాలని ఆదేశించారు. తిరిగి పాఠశాలలో చేరాలన్నా డైరెక్టరేట్ అనుమతి తప్పనిసరి చేశారు. దీంతో పాటు అన్వెల్ గ్రేడ్ ఇంక్రిమెంట్ల మంజూరు కూడా డీఈఓలకే అప్పగించారు. ఇటీవల పలు పాఠశాలల్లో జరిగిన అవకతవకలు సాకుగా చూపిస్తూ అధికారులు ఈ ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలుస్తోంది. గతంలో రాష్ట్రంలోని అన్ని పాఠశాలలకు జీవోనెంబర్ 40 ప్రకారం సెలవులు, ఇంక్రిమెంట్ల మంజూరు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకే ఉంది. జీవోనెంబర్ 70 ప్రకారం నాలుగు నెలల వరకు సెలవులు ఇచ్చే అధికారులూ వారికే ఉన్నాయి. తాజాగా ఇచ్చిన ఉత్తర్వులు ఈ జీవోలను అతిక్రమించడమేనని ఉపాధ్యాయ సంఘాల నేతలు చెబుతున్నారు. కాగా ఆ జీవోలు మోడల్ స్కూల్ సొసైటీకి వర్తించవని ఆ శాఖాధికారులు వాదిస్తున్నారు. సెలవులు, ఇంక్రిమెంట్ల మంజూరులో డీఈఓ, పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ అధికారుల అనుమతి తప్పనిసరి చేయడంతో అవినీతి పెరిగే అవకాశమూ లేకపోలేదు. ఇప్పటికే కొందరు ఉపాధ్యాయ సంఘాల నేతలు, అధికార పార్టీకి చెందిన నేతల అండదండలతో ఈ అవతారాన్ని కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం కొత్త ఉత్తర్వుల నేపథ్యంలో వారిదందాకు మరింత ఊతమిచ్చినట్టు అవుతుంది. మారుమూల ప్రాంతాల్లోని టీచర్లకు ఈ ఉత్తర్వులు కొత్త కష్టాలు తీసుకొచ్చినట్టైంది. సెలవులు, ఇంక్రిమెంట్ల కోసం డీఈఓ, డీఎస్ఈ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అయితే ఉత్తర్వులైనా కొనసాగుతాయా..? లేక ఉపాధ్యాయుల ఆందోళనతో రద్దవుతాయా.? అనేది చూడాలి.

**ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి: టీఎస్‌యూటీఎఫ్, టీఎస్ఎంఎస్‌టీఏఫ్**

మోడల్ స్కూళ్ల ఉపాధ్యాయుల సెలవుల వినియోగంపై పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ రాములు, చావ రవి, టీఎస్ఎంఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి కొండయ్య, మహేశ్ డిమాండ్ చేశారు. ఇంటర్మీడియేట్ వరకూ ఉన్న మోడల్‌స్కూళ్లలో సెలవుల మంజూరు కూడా ఇవ్వకపోవడం వారిని అవమానించడమేనని అభిప్రాయపడ్డారు. ఈ ఉత్తర్వులతో కార్యాలయాల్లో పైరవీకారులు పుట్టుకొస్తారని చెప్పారు. అధికారాల వికేంద్రీకరణతో సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం ఏర్పడే అవకాశముందని చెప్పారు.

**ప్రిన్సిపల్స్ అధికారాలకు కోతవద్దు: పీఆర్‌టీయూటీ**

మోడల్‌స్కూళ్లలోని ప్రిన్సిపల్స్ అధికారాలకు కోత విధించడం సరికాదని పీఆర్‌టీయూటీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎం అంజిరెడ్డి, ఎం చెన్నయ్య అభిప్రాయపడ్డారు. డీఈఓ కార్యాలయాలు ఇప్పటికే సిబ్బంది కొరతతో సతమతమవుతుంటే, కొత్తగా ఈ పని అప్పగించడంతో వారిపై మరింత భారం పెరుగుతుందని అన్నారు. దీంతో పనుల్లో జాప్యం ఏర్పడే అవకాశముందని చెప్పారు. ఉపాధ్యాయుల పనితీరును బట్టే ప్రిన్సిపల్స్ ఇంక్రిమెంట్లు ఇస్తారనీ, కాబట్టి ఈ అధికారం ప్రిన్సిపల్స్‌కే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## ఫారెస్ట్ బ్లాక్‌ల అభివృద్ధికి సమన్వయంతో పని చేయండి

- మంత్రి కేటీఆర్
- ఫారెస్ట్ బ్లాక్‌ల అభివృద్ధిపై సమీక్ష

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

ఫారెస్ట్ బ్లాక్‌లను అభివృద్ధి పర్చడానికి వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ చెప్పారు. హెచ్ఎండీఏ పరిధిలోని 194 బ్లాకుల్లో 58,329 హెక్టార్ల అటవీ భూమి ఉందని, వాటిని కాపాడుకుంటూనే ఫారెస్ట్ బ్లాకులను ఏర్పాటు చేయాలన్నారు. మంగళవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కె జోషితో కలిసి మంత్రి ఆర్ఓఆర్ పరిధిలోని ఫారెస్ట్ బ్లాక్‌ల అభివృద్ధిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ పట్టణీకరణ వేగంగా జరుగుతున్న నేపథ్యంలో నగర పౌరులకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించడంతో పాటు, టూరిజంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నగరం నలుమూలల వెల్‌నెస్ టూరిజం, మెడిసినల్ టూరిజం, డిస్టినేషన్ టూరిజం, ఎకోటూరిజం, లాంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని పార్కుల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. కేబీఆర్ పార్క్ తరహాలోనే మూసీ రివర్ ఫ్రంట్‌పై "వాక్ వే"ను నిర్మించాలన్నారు. హైదరాబాద్ అటవీజోన్‌ల అభివృద్ధి కోసం వివిధ శాఖలు మైల్ స్టోన్‌ను ఏర్పాటు చేసుకొని, నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలని ఆదేశించారు. హైదరాబాద్‌లోని పార్కుల అభివృద్ధిపై అటవీ శాఖలో ప్రత్యేక ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా వివిధ శాఖల మధ్య సమన్వయం కోసం నోడల్ అధికారిని నియమించాలని అధికారులను ఆదేశించారు. ఓఆర్ఆర్‌లలో అటవీ బ్లాక్‌ల అభివృద్ధికి కార్యచరణ రూపొందిస్తున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కె జోషి తెలిపారు.

## ఉద్యోగిని కొట్టిన టీచర్ డిప్యూటేషన్ రద్దు

**నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి డిప్యూటేషన్ రద్దు చేస్తూ కమిషనర్ జి కిషన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమెను నిజామాబాద్ డీఈఓకు సరెండర్ చేస్తూ మంగళవారం ఆదేశాలు జారీచేశారు. నిజామాబాద్ జిల్లా దర్పల్లి మండలంలోని సిర్పపల్లి హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్(సోషల్) విజయలక్ష్మి 2014 డిసెంబర్ నుంచి డిప్యూటేషన్‌పై డైరెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్నారు. కాగా సోమవారం డైరెక్టరేట్‌లో పనిచేసే సీనియర్ అసిస్టెంట్ నాగరాజును ఆమె చెప్పుతో కొట్టడంతో ఆయన కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన కమిషనర్..ఆమె డిప్యూటేషన్ రద్దు చేశారు. ఇది వెంటనే అమలులోకి వస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## అందరికీ ఒకే సిరంజీ.. 46 మందికి హెచ్ఐవీ

**లక్నో:** ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఉన్నావో జిల్లా బంగార్‌మావ్‌లో దారుణం చోటు చేసుకుంది. హెచ్ఐవీ ఉన్న వ్యక్తికి వాడిన సిరంజీని మరో 46మందికి వాడటంతో ఆ వ్యాధి అందరికీ సోకింది.బంగార్‌మావ్‌లో గతేడాది నిర్వహించిన హెల్త్‌క్యాంప్‌ల్లో హెచ్ఐవీ కేసులు ఎక్కువగా నమోదయ్యాయి. అధిక సంఖ్యలో కేసులను గుర్తించిన తర్వాత ఆరోగ్యశాఖ ఇద్దరు సభ్యులతో కూడిన ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఆ ప్రాంతంలోని వివిధ గ్రామాల్లో దర్యాప్తు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. హెల్త్‌క్యాంప్ నిర్వహించి 566 మందిని పరీక్షించగా 21 మందికి హెచ్ఐవీ సోకినట్టు గుర్తించారు. మొత్తం 46 మంది వరకు ఎయిడ్స్ బారిన పడ్డారని చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఎస్పి చౌదరి తెలిపారు. విచారణ అనంతరం బూటకపు వైద్యుడిని రాజేందర్ కుమార్‌గా గుర్తించారు.

# నవచిత్రం

# ఆ విషయంలో సంతృప్తిగానే ఉన్నా..


లావణ్య త్రిపాఠి

'భిన్న పాత్రలు రావడం చాలా అరుదు. అలాంటి పాత్రలు తనని తాను కొత్తగా ఆవిష్కరించుకోవడానికి ఉపయోగపడతాయి' అని అంటోంది లావణ్య త్రిపాఠి. సాయిధరమ్ తేజ్, లావణ్య త్రిపాఠి జంటగా నటించిన చిత్రం 'ఇంటిలిజెంట్'. వి.వి.వినాయక్ దర్శకత్వంలో సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సి.కళ్యాణ్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 9న విడుదలవుతోంది. ఈ సందర్భంగా లావణ్య త్రిపాఠితో మంగళవారం మీడియా జరిపిన ఇంటర్వ్యూ విశేషాలు...

**సినిమా నేపథ్యం, మీ పాత్ర తీరెలా ఉంటుంది?**

– ఇంటిలిజెన్స్ నేపథ్యంలో సాగే సినిమా ఇది. తన ఇంటిలిజెన్స్‌తో ప్రత్యర్థుల ఆటను హీరో ఎలా అడ్డుకున్నాడనేదే సినిమా. టిపికల్ కమర్షియల్ చిత్రమే అయినప్పటికీ క్యూట్ లవ్ స్టోరీ కూడా ఉంటుంది. అమెరికా నుంచొచ్చిన సంధ్య అనే అమ్మాయిగా కనిపిస్తాను. విపరీతమైన కోపంతోపాటు డామినేటెడ్‌గా ఉంటూ బిజినెస్‌లో నాన్నకి సహాయం చేస్తుంటాను. అలాంటి నేను ప్రేమలో ఎలా పడిపోయాననేది మాత్రం సస్పెన్స్. నా గత చిత్రాలతో పోల్చితే ఇది భిన్నంగా ఉంటుంది. ఫస్ట్‌టైమ్ ఇలాంటి పాత్రలో నటించాను. అంతేకాదు బాగా గ్లామరస్‌గా కూడా కనిపిస్తాను. దానికి కారణం దర్శకుడే. చాలా అందంగా నా పాత్రను డిజైన్ చేశారు.

**సాయిధరమ్ తేజ్, వినాయక్‌లతో వర్క్ చేయడాన్ని ఎలా ఫీలయ్యారు?**

– సాయిధరమ్ తేజ్‌ను రెండు, మూడు సార్లు కలిసినప్పటికీ పెద్దగా మాట్లాడుకోలేదు. మస్కట్‌లో జరిగిన షూటింగ్ టైమ్‌లో ఇద్దరం మంచి ఫ్రెండ్స్ అయ్యాం. సాయి చాలా ఫన్నీగా ఉంటాడు. డాన్స్‌లు బాగా చేస్తాడు. మా మధ్య కెమిస్ట్రీ బాగా పండింది. వినాయక్ సార్‌తో పనిచేయడాన్ని గౌరవంగా భావిస్తున్నా. పెద్ద స్టార్ డైరెక్టర్ అయినప్పటికీ ఆర్టిస్టులకు కావాల్సినంత కంఫర్ట్ ఇస్తారు. నన్ను చిన్న పిల్లలా ట్రీట్ చేశారు. సినిమా మేకింగ్ పట్ల ఆయనకు మంచి క్లారిటీ ఉంది. చాలా వేగంగా చిత్రీకరిస్తారు. ఆయనతో పనిచేయడం వల్ల చాలా విషయాలు నేర్చుకున్నాను.

**'చమకు చమకు' రీమిక్స్ సాంగ్‌కు మీరెంత వరకు జస్టిఫై చేశారు?**

– నా ఫేవరేట్ హీరో, ఫేవరేట్ డాన్సర్ చిరంజీవి. ఆయన చేసిన 'చమకు చమకు' పాటతో మేం చేసిన పాటని పోల్చలేం. అయితే ప్రజెండ్ ట్రెండ్‌కు అనుగుణంగా మా స్టయిల్‌లో బాగా చేసేందుకు ప్రయత్నించాం. ఈ పాటను షూట్ చేసేటప్పుడు మాకెక్కువ టైమ్ కూడా లేదు. చేసిన కొంచెం ప్రాక్టీస్ మాకు చాలా ఉపయోగపడింది. నిజం చెప్పాలంటే గత చిత్రాలతో పోలిస్తే ఇందులో నేను బెటర్‌గానే డాన్సులు చేశానని భావిస్తున్నా.

**ఫెయిల్యూర్స్ ప్రభావం మీపై ఎంత వరకు ఉంటుంది?**

– సినిమా ఫెయిలైతే పాత్ర పరంగా నేను చేసిన మిస్టేక్స్ ఏంటి?, ఇంకా ఎలా చేయాలి?, ఏ ఏ విషయాల్లో బెటర్‌గా చేయాలనేది రివ్యూ చేసుకుంటాను. అంతేతప్ప అంతకు మించి ఫెయిల్యూర్ ప్రభావం నాపై ఉండదు. సక్సెస్ వచ్చినప్పుడు గాల్లో ఎగరను, భూమ్మీదే ఉంటా. అయితే తప్పకుండా ఫీడ్‌బ్యాక్ తీసుకుంటా. సినిమాగాని, మన నటనగానీ కొంత మందికి నచ్చొచ్చు, నచ్చకపోవచ్చు. పాజిటివ్, నెగటివ్ రెండింటినీ ఒకేరకంగా స్వీకరిస్తాను. 'ఉన్నది ఒక్కటే జిందగీ' చిత్రంలో డిఫరెంట్ క్యారెక్టర్ చేసే ఛాన్స్ వచ్చింది. మొత్తమ్మీద ఇప్పటి వరకు చేసిన అన్ని సినిమాలు, పాత్రల విషయంలో నేను సంతృప్తిగానే ఉన్నాను.

**ప్రాజెక్ట్‌ల నుంచి అర్థంతరంగా తప్పుకోవడం, ప్రొడక్షన్ హౌస్‌లను ఇబ్బంది పెడుతున్నారనే కామెంట్స్ వినిపిస్తున్నాయి..**

– మనం విన్న అన్ని వార్తలూ నిజం కాదు. ఇప్పటి వరకు నేను పనిచేసిన ప్రొడక్షన్ హౌస్‌లతో, నటీనటులతో, దర్శక,నిర్మాతలతో బాగానే ఉన్నా. నా పనితీరుతో వాళ్ళు హ్యాపీగానే ఉన్నారు. కొన్ని సార్లు అనుకున్న కాంబినేషన్లు కుదరవు. తమిళ నిర్మాతలు నాపై ఫిర్యాదు చేశారని అంటున్నారు. వారితో మనకు పడటం లేదన్నప్పుడు తప్పుకోవడం ఉత్తమం. తమిళ సినిమా విషయంలో నేను అదే చేశా.

**కమర్షియల్ పాత్రలు, లేడీ ఓరియెంటెడ్ పాత్రల్లో ఏదీ మీకిష్టం?**


– యాక్టింగ్ అంటే ఇష్టం. భిన్నమైన పాత్రలు రావడం అరుదు. నేను ఎలాంటి పాత్రలైనా చేస్తాను. నటిగా నన్ను నేను కొత్తగా ఆవిష్కరించుకోవడానికి అన్ని రకాల పాత్రలు ఉపయోగపడతాయి. క్రియేటివ్ శాటిస్ఫాక్షన్ కోసం మలయాళంలోనూ నటిస్తున్నాను. నా ఫస్ట్ ప్రయారిటీ టాలీవుడ్. గీతా ఆర్ట్స్‌లో విజయ్‌దేవరకొండతో త్వరలో ఓ సినిమా చేయబోతున్నాను. ఓ నెల రోజులు గ్యాప్ తీసుకున్న తర్వాతే నెక్ట్స్ సినిమాలకు సైన్ చేస్తాను.

## ముంబయిలో పోరాటాలు..


నాగార్జున తాజా చిత్రంలోని ఒక దృశ్యం

నాగార్జున హీరోగా రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతోంది. వీరి కాంబినేషన్‌లో వస్తున్న నాలుగో చిత్రమిది. అత్యంత క్రేజీ ప్రాజెక్ట్‌గా రూపొందుతున్న ఈ సినిమా ఇప్పటికే రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించుకుని, కొన్ని షెడ్యూల్స్‌ను పూర్తి చేసుకుంది. తాజా షెడ్యూల్ ప్రస్తుతం ముంబయిలో జరుగుతోంది. 'నాగార్జున, అజయ్, షాయాజీ షిండే కాంబినేషన్‌లో ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను షూట్ చేస్తున్నాం. బాలీవుడ్ యాక్షన్ కొరియోగ్రాఫర్ ఐజా షేక్ సారథ్యంలో ఈ యాక్షన్ ఎపిసోడ్ షూటింగ్ జరుగుతోంది. ముంబయిలోని ఎస్సెల్ వరల్డ్ అనే ఎమ్యూజ్‌మెంట్ పార్క్‌లో ఈ యాక్షన్ సీక్వెన్స్‌తోపాటు ఛేజింగ్ సీన్స్‌ను షూట్ చేస్తున్నాం. మార్చి 10 వరకు జరగనున్న ఈ షెడ్యూల్‌లో పలు కీలక సన్నివేశాలను కూడా చిత్రీకరిస్తాం' అని చిత్రబృందం తెలియజేసింది.

## ఇప్పుడు మేం మాట్లాడతాం.. ప్రపంచం వింటుంది..


అక్షయ్‌కుమార్

అక్షయ్ కుమార్ నటిస్తున్న తాజాగా చిత్రాల్లో 'గోల్డ్' ఒకటి. దేశభక్తి నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రానికి రీమా కగ్టి దర్శకురాలు. 1946లో జరిగిన ఒలింపిక్స్‌లో హాకీ క్రీడలో భారతదేశానికి బంగారు పతకం తీసుకొచ్చిన ఆటగాడి జీవితం ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. చిత్ర టీజర్ మంగళవారం విడుదలైంది. 'ఇప్పటి వరకు ఇండియా మౌనంగా ఉంది. ఇప్పుడు మేం మాట్లాడుతాం. ప్రపంచం వింటుంది' అని పేర్కొంటూ అక్షయ్ కుమార్ టీజర్‌ను ట్విట్టర్ ద్వారా అభిమానులతో పంచుకున్నారు. ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగే ఈ టీజర్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఇందులో అక్షయ్ హాకీ కోచ్‌గా నటిస్తున్నారు. ఆయన సరసన మౌనీ రాయ్ కథానాయికగా నటిస్తుంది. రితేష్ సిద్వానీ నిర్మాత. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్ట్ 15న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. '2.0', 'మోఘల్', 'కేసరి' వంటి తదితర చిత్రాల్లోనూ అక్షయ్‌కుమార్ నటిస్తున్నారు.

### అప్పుడు డబ్బులేదు : అక్షయ్‌కుమార్

"ప్యాడ్‌మ్యాన్' వంటి సోషల్ చిత్రాలను రూపొందించాలని మొదట్నుంచి ఉండేది. కానీ అప్పుడు నా దగ్గర డబ్బుల్లేవు' అని అక్షయ్ కుమార్ అన్నారు. మహిళలకు సంబంధించి శానిటరీ ప్యాడ్స్ తయారు చేసిన తమిళనాడుకు చెందిన అరుణాచలం మురుగనంథమ్ జీవితం ఆధారంగా 'ప్యాడ్‌మ్యాన్' చిత్రాన్ని తెరకెక్కించారు. ఆర్. బాల్కీ దర్శకుడు. అక్షయ్ కుమార్ భార్య ట్వింకిల్ ఖన్నా నిర్మాత. ఈ నెల 9న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా అక్షయ్ మాట్లాడుతూ, 'సామాజిక అంశాలతో ముడిపడి ఉన్న సినిమాలను రూపొందించాలనుకునేవాడిని. కానీ అప్పట్లో కావాల్సినంత డబ్బు నాదగ్గర ఉండేది కాదు. ఇప్పుడుంది. అందుకే ఇలాంటి సినిమాలు నిర్మిస్తున్నా. అయితే నా భార్య ట్వింకిల్ ఖన్నా అరుణాచలం గురించి చెప్పినప్పుడు దర్శకుడు ఆర్.బాల్కీని కలిశాం. ఆయనపై సినిమా తీయాలని చర్చించి ఈ చిత్రాన్ని రూపొందించాం. శానిటరీ ప్యాడ్స్‌పై హాలీవుడ్‌లో కూడా సినిమా రాలేదు. డాక్యుమెంటరీలు వచ్చాయి కానీ కమర్షియల్ సినిమాలు తీయలేదు. ఈ సబ్జెక్ట్ అంటే సిగ్గు, బిడియం ఉండటం వల్ల ఎవ్వరూ ప్రయత్నించలేకపోయారు. కానీ మేం ప్రయత్నించాం' అని చెప్పారు.

## సరికొత్త అనుభూతినిచ్చే రాజరథం


నిరూప్ భండారి, అవంతిక

నిరూప్ భండారి, అవంతిక జంటగా అనూప్ భండారి దర్శకత్వంలో 'రాజరథం' చిత్రం రూపొందుతోంది. అజయ్ రెడ్డి, అంజు వల్లభనేని, విషు దకప్పగారి, సతీష్‌శాస్త్రి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలోని 'కాలేజ్ డేస్..', 'నీలి మేఘమా..' పాటలు ఇప్పటికే విడుదలై శ్రోతల మన్ననలను పొందుతున్నాయి. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ పాటలకు అనూప్ భండారి సంగీతం సమకూర్చారు. కనువిందు చేస్తున్న ఈ పాట చిత్రీకరణ వెనుక ఉన్న సంఘటనలను, హీరోహీరోయిన్ల కష్టాన్ని చిత్ర బృందం వివరించింది. 'ఈ పాటల చిత్రీకరణలో నటించేటప్పుడు హీరోహీరోయిన్లు వణికారు. అందుకు కారణం రెయిన్ సీక్వెన్స్ కోసం వాడిన నీరు చాలా చల్లగా ఉండటమే. అంతటి చలిలోనూ వణుకుతూ పాటకి తగ్గ ఎక్స్‌ప్రెషన్స్ ఇవ్వడానికి ఎంతో కష్టపడ్డారు. ఇలాంటి పరిస్థితుల్లో కూడా పర్‌ఫెక్షనిస్ట్‌గా పేరున్న దర్శకుడు అనూప్ తానూ అనుకున్న షాట్ వచ్చే వరకు రీటేక్‌లకు పిలిచేవారు. షూటింగ్ అయిపోయాక నిరూప్, అవంతిక చలి దెబ్బకు హీటర్ల ముందుకు ఓ అరగంట కూర్చుంటేగానీ వణుకు తగ్గేది కాదు. హీరోహీరోయిన్లు ఎంతో శ్రమ తీసుకోవడం వల్లే ఈ చిత్ర ట్రైలర్, పాటలు అంత అద్భుతంగా రాగలిగాయి. ప్రేక్షకులను ఆకట్టుకోగలిగాయి. సినిమా కూడా కచ్చితంగా ప్రేక్షకులకు కొత్త అనుభూతినిస్తుంది' అని తెలిపింది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి సినిమాను ఈ నెల 16న విడుదల చేయనున్నారు.

## భారీ క్రేజీ ప్రాజెక్టులు..


నయనతార

ఓ పక్క కమర్షియల్ పాత్రలు, మరో పక్క మహిళా ప్రధాన పాత్రలు.. పాత్రలు ఏవైనప్పటికీ అద్భుతమైన నటనతో ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేస్తోంది నయనతార. ప్రేక్షకులు, అభిమానుల్నే కాదు దర్శక, నిర్మాతల్ని సైతం ఆకర్షితులయ్యేలా చేస్తూ దట్ ఈజ్ నయనతార అనిపించుకుంటోంది. దీంతో నయనకు భారీ క్రేజీ ప్రాజెక్టుల్లో నటించే బంపర్ ఆఫర్స్ వస్తున్నాయి. ఇప్పటికే చిరంజీవి సరసన 'సైరా నరసింహారెడ్డి'లో హీరోయిన్‌గా నటిస్తున్న నయన తాజాగా అజిత్‌తో కలిసి నటించనుంది. 'వీరం', 'వేదాళం', 'వివేగం' వంటి సూపర్ హిట్స్ అనంతరం అజిత్, శివ కాంబినేషన్ మరో సినిమా రాబోతోంది. వీరి కాంబినేషన్‌లో వస్తున్న నాలుగో సినిమాలో అజిత్‌కి జోడీగా నటించేందుకు నయన తార గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో అజిత్ పాత్ర అగ్రెసివ్‌గా గత చిత్రాలను మించి ఉంటుందని తెలుస్తోంది. సత్య జ్యోతి ప్రొడక్షన్ కంపెనీ ఈ సినిమాను నిర్మించనుంది. ఇదిలా ఉంటే హీరోలకు దీటుగా రాణిస్తున్న నయనతార 'భారతీయుడు 2'లో కూడా నటించే అవకాశం ఉందని సమాచారం. కమల్ హాసన్ హీరోగా నటించే ఈ చిత్రానికి శంకర్ దర్శకత్వం వహించనున్నారు. ప్రస్తుతం స్క్రిప్ట్‌ను ఫైనలైజ్ చేసే పనిలో బిజీగా ఉన్నారు. రజనీకాంత్ హీరోగా శంకర్ రూపొందిస్తున్న '2.0' విడుదలైన తర్వాత ఈ సినిమా పట్టాలెక్కే ఛాన్స్ ఉందట. లైకా ప్రొడక్షన్ కంపెనీ ఈ సినిమాను నిర్మించనుంది. నయనతార ప్రస్తుతం 'ఇమైక్కా నోడిగల్', 'కొలైయుథిర్ కాలమ్', 'కొలమవు కొకిలా' వంటి చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.

## ఇక మణికర్ణిక వంతు..



నిన్న మొన్నటి వరకు 'పద్మావత్' చిత్రాన్ని వివాదాలతో హోరెత్తించిన హిందూత్వ శక్తులు ఇప్పుడు 'మణికర్ణిక'ని వివాదాల్లోకి లాగుతున్నారు. ఝాన్సీ రాణి లక్ష్మీభాయి జీవితం ఆధారంగా 'మణికర్ణిక: ది క్వీన్ ఆఫ్ ఝాన్సీ' చిత్రాన్ని దర్శకుడు క్రిష్ రూపొందిస్తున్నారు. వీరనారి ఝాన్సీ లక్ష్మీభాయి పాత్రలో కంగనా రనౌత్ నటిస్తోంది. విజయేంద్రప్రసాద్ దీనికి కథ అందించారు. శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని నిలిపి వేయాలని రాజస్థాన్‌కు చెందిన సర్వ బ్రాహ్మణ్ మహాసభ (ఎస్‌బీఎం) రాజస్థాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఇందులో ఝాన్సీ లక్ష్మీభాయ్‌కి, బ్రిటీష్ వ్యక్తికి మధ్య ప్రేమ బంధాన్ని చూపిస్తున్నారని, చరిత్రను వక్రీకరిస్తున్నారని ఆ సంస్థ ఆరోపిస్తోంది. 'ఈ సినిమాను విదేశీయులు రాసిన పుస్తకం ఆధారంగా తీస్తూ మహారాణి పేరు, ప్రతిష్టల్ని దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నారు. రాజస్థాన్‌లో చిత్రీకరణ జరిపిన ప్రాంతాల్లో ఉన్న మా స్నేహితుల ద్వారా ఈ విషయం తెలిసింది. ఆమెకు ప్రేమ బంధం ఉందని తప్పుగా ఊహించడానికి కూడా ఎవరూ ఇష్టపడరు. యుక్త వయసులో దేశం కోసం బ్రిటీష్‌కి వ్యతిరేకంగా పోరాడారు. ఆమెపై తీసే సినిమా కచ్చితంగా బయోపిక్ అయి ఉండాలి. నిర్మాతల నుంచి రాష్ట్ర ప్రభుత్వం అఫిడవిట్‌ను తీసుకోవాలని కోరుతున్నాం. ఇదే పని 'పద్మావత్' విషయంలో చేసుంటే ఇన్ని ఆందోళనలు జరిగేవి కావు' అని ఎస్‌బీఎం అధ్యక్షుడు సురేష్‌మిశ్రా అన్నారు. ఈ చిత్రాన్ని జూన్‌లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## సూపర్ 30 షూటింగ్ షురూ..

'కాబిల్' తర్వాత హృతిక్ రోషన్ ఏ చిత్రంలోనూ నటించలేదు. ఆ మధ్య వరుసగా నూతన చిత్రాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో ఏ ప్రాజెక్ట్ ఫస్ట్ సెట్స్‌పైకి వెళ్తుందనే సస్పెన్స్ అభిమానుల్లో నెలకొంది. ఆ సస్పెన్స్‌కు తెరదించుతూ 'సూపర్ 30'కి సంబంధించిన ఓ లుక్‌ను విడుదలైంది. తన ఆధ్వర్యంలో 30 మంది బ్రిలియెంట్ ఐఐటీ విద్యార్థులను తయారు చేసిన గణిత శాస్త్ర మేధావి ఆనంద్ కుమార్ జీవితం ఆధారంగా ఈ 'సూపర్ 30' బయోపిక్ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. వికాస్‌భాల్ దర్శకుడు. తాజాగా విడుదలైన లుక్‌లో సింపుల్‌గా పవర్‌ఫుల్ లుక్‌తో హృతిక్ కనిపిస్తున్నాడు. బెనారస్‌లో సినిమా ప్రారంభమైనట్టు నిర్మాతలు ట్వీట్ చేశారు. వచ్చే ఏడాది జనవరి 25న సినిమాను విడుదల చేయనున్నారు. అయితే ఇందులో కథానాయిక ఎవరన్నది ఇంకా ఫైనల్ కాలేదు. హృతిక్ దీంతోపాటు సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో ఓ సినిమాలో నటించబోతున్నారు. టైగర్ షరాఫ్ మరో హీరో. వాణి కపూర్ కథానాయిక. ఈ ఏడాది ఆగస్ట్‌లో సినిమాను ప్రారంభించి వచ్చే ఏడాది అక్టోబర్ 2న గాంధీ జయంతి కానుకగా సినిమాను విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. థ్రిల్లర్ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో టైగర్ షరాఫ్‌కి గురువుగా హృతిక్ రోషన్ కనిపించనున్నారు.


హృతిక్ రోషన్

## హీరోల స్థాయిలో..


సాయిపల్లవి

తొలి సినిమా 'ఫిదా'తోనే తెలుగు చిత్ర పరిశ్రమలో హాట్‌టాపిక్‌గా మారింది సాయిపల్లవి. తనదైన శైలిలో తెలంగాణ స్లాంగ్ డైలాగులు, నటనతో తెలుగు ప్రేక్షకులందరినీ ఫిదా చేసింది. నానితో నటించిన 'ఎంసీఏ'తోనూ మంచి పేరు తెచ్చుకుంది. రెండు సినిమాలతోనే ప్రేక్షకులకు మరింత దగ్గరైన సాయిపల్లవి భారీ రెమ్యూనరేషన్ డిమాండ్‌తో దర్శక,నిర్మాతలకు మాత్రం దూరమవుతోందట. ప్రస్తుతం ఈ విషయం సోషల్ మీడియాలో విపరీతంగా హల్‌చల్ అవుతోంది. శర్వానంద్ సరసన నటించే సినిమాకు ఏకంగా రూ.1.5కోట్ల రెమ్యూనరేషన్ కావాలని డిమాండ్ చేసిందట. అయితే ఈ మొత్తాన్ని నిర్మాతలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉండటం విశేషంగా చెప్పుకుంటున్నారు. హనురాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా ఇటీవల కోల్‌కతాలో ప్రారంభమైన విషయం విదితమే. హీరోలతో సమానంగా రెమ్యూనరేషన్‌ను డిమాండ్ చేస్తూ సాయిపల్లవి చర్చనీయాంశంగా మారినప్పటికీ తన నటనతో ఫిదా చేయడంతో పోల్చితే అదో పెద్ద లెక్క కాదంటున్నారు పరిశ్రమ వర్గాలు. సాయి పల్లవి ప్రస్తుతం 'కణం', 'కరు', 'మారి 2'తోపాటు సూర్య నూతన చిత్రంలోనూ నటిస్తోంది.

# కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలి

## కాలపరిమితి ముగిసిన జీవోలను సవరించాలి

- బలవంతపు భూసేకరణ ఆపాలి
- 2013 చట్టం ప్రకారమే నిర్వాసితులకు పరిహారమివ్వాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర ద్వితీయ మహాసభ డిమాండ్
- పలు తీర్మానాలు ఆమోదం



**నర్రా రాఘవరెడ్డి నగర్ నుంచి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి**

రాష్ట్రంలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.18 వేలు నిర్ణయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర ద్వితీయ మహాసభ డిమాండ్ చేసింది. కాలపరిమితి ముగిసిన షెడ్యూల్ ఎంప్లాయ్‌మెంట్స్ జీవోలను సవరించాలని కోరింది. నల్లగొండ పట్టణంలో జరుగుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర ద్వితీయ మహాసభల్లో భాగంగా మంగళవారం ఏడు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది. రాష్ట్రంలో కాలపరిమితి ముగిసిన జీవోలను సవరించాలని, కనీస వేతనాలు పెంచాలనే తీర్మానాన్ని చుక్క రాములు ప్రవేశపెట్టగా, పాలడుగు భాస్కర్ బలపరిచారు. బలవంతపు భూసేకరణ ఆపాలని, నిర్వాసితులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలన్న తీర్మానాన్ని బి వెంకట్ ప్రవేశపెట్టగా, జి భాస్కర్, బాలికలు, మహిళలపై పెరుగుతున్న లైంగిక దాడులను అరికట్టాలనే తీర్మానాన్ని బుగ్గవీటి సరళ ప్రవేశపెడితే, పి ప్రభావతి, చేతివృత్తిదారుల అభివృద్ధికి చేయూతనివ్వాలనే తీర్మానాన్ని ఎంవి రమణ ప్రవేశపెట్టగా, జి నాగరాజు, ఎంబీసీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలన్న తీర్మానాన్ని టి జ్యోతి ప్రవేశపెడితే పి ఆశయ్య, మతోన్మాద, సంఘ్‌పరివార్ దాడులను ప్రతిఘటిద్దాం, లౌకికతత్వాన్ని కాపాడుకుందాం అనే తీర్మానాన్ని కె భాస్కర్ బలపరిచారు. సీపీఐ(ఎం) రాష్ట్ర ద్వితీయ మహాసభ ఈ తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు మాట్లాడుతూ సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలు జయప్రదంగా జరుగుతున్నాయని చెప్పారు. ప్రజా సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని అన్నారు. 1948 కనీస వేతనాల చట్టం కోటి మందికి ఉపయోగపడేదని చెప్పారు. కనీస వేతనాలకు సంబంధించిన 73 జీవోలు వర్తిస్తాయని అన్నారు. అందులో 71 జీవోల కాలపరిమితి ముగిసిందని చెప్పారు. ఐదేండ్లకోసారి కనీస వేతనాలు సవరించి కొత్త జీవో ఇవ్వాల్సి ఉంటుందని అన్నారు. కాంగ్రెస్ హయాంలో 46 జీవోలు, టీఆర్ఎస్ హయాంలో 25 జీవోలు కాలపరిమితి ముగిసిందని వివరించారు. అయినా ఈ ప్రభుత్వం కనీస వేతనాల జీవోలను సవరించడం లేదన్నారు. దీంతో కార్మికులు పస్తులు, అర్ధాకలితో ఉంటున్నారని చెప్పారు. కార్మికులకు కనీస వేతనం రూ.18 వేలు ఉండాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు చెప్పిందన్నారు. కాంట్రాక్టు కార్మికులు ఉత్పత్తిలో పాల్గొంటున్నారని చెప్పారు. సీఎం, మంత్రులు, ప్రజాప్రతినిధుల జీతాలు పెరిగాయని, ఇది ఖజానాకు భారమని అన్నారు. పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు పెంచి అమలు చేస్తే ప్రభుత్వంపై భారం ఉండబోదని, యజమానులే చెల్లిస్తారని చెప్పారు. అయినా ఈ ప్రభుత్వం కార్మికుల అండగా లేదని, కార్పొరేట్లు, పారిశ్రామికవేత్తలకు కొమ్ము కాస్తోందని విమర్శించారు. కేరళలో రోజుకూలి రూ.600 నిర్ణయించి అమలు చేస్తోందని చెప్పారు. ఈ లెక్కన నెలకు రూ.18 వేలు వస్తాయన్నారు. కార్మికుల పక్షంగా టీఆర్ఎస్ ప్రభుత్వం ఉండాలన్నారు. సీపీఐ(ఎం) సంపూర్ణంగా సహకరిస్తుందని చెప్పారు. అభివృద్ధి పేరుతో ప్రాజెక్టుల నిర్మాణానికి బలవంతంగా భూమిని సేకరిస్తోందని అన్నారు. అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదన్నారు. ఈ పేరుతో బలవంతంగా భూములు లాక్కోవడం సరైంది కాదని చెప్పారు. రైతులు అంగీకరిస్తే భూములు తీసుకోవాలని, వారికి చట్టబద్ధంగా నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

మల్లన్నసాగర్ వద్ద ఇంకా రైతులు పోరాటం చేస్తున్నారని అన్నారు. భూనిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు. 2013 చట్టం అమలు చేయాలని, 2017 చట్టం తేవడం సరైంది కాదన్నారు. భూనిర్వాసితుల పోరాటానికి సీపీఐ(ఎం) అండగా ఉంటుందని చెప్పారు. ఎంబీసీలు అణచివేతకు గురవుతున్నారని అన్నారు. ఎంబీసీల కార్పొరేషన్ ఏర్పాటు చేసినా, రూ.వెయ్యి కోట్లు కేటాయిం చినా అమలు నిర్దిష్ట కార్యాచరణ రూపొందించలేదని చెప్పారు. మహిళలు, వృత్తిదారుల సమస్యలపై ఈ ప్రభు త్వం దృష్టి సారించాలని కోరారు. ఈ ప్రభుత్వం పరిష్కరిం చకపోతే రాబోయే కాలంలో ఆయా తరగతులను సమీక రించి పోరాటాలకు సన్నద్ధమవుతామని హెచ్చరించారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి వెంకట్ మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రవేశపెట్టిన రాజకీయ నివేదికపై జిల్లాల ప్రతినిధులు చర్చల్లో పాల్గొంటున్నారని చెప్పారు. ప్రత్యామ్నాయ రాజకీయాను నిర్మించేందుకు చేస్తున్న కృషిని అభినందిస్తున్నారని అన్నారు. ప్రజాస్వామ్యం అన్ని స్థాయిల్లోనూ అమలవుతున్నదని చెప్పారు.

### తీర్మానాలు ప్రవేశపెట్టి.. బలపరిచారు..


చుక్క రాములు


పాలడుగు భాస్కర్


బి వెంకట్


జి భాస్కర్


బుగ్గవీటి సరళ


జి నాగరాజు


పి ఆశయ్య


ఎంవి రమణ


పి ప్రభావతి

# అబద్ధాల్లో మోడీకి ఆస్కార్

## 'అబద్ధాలే ఆయుధాలు' పుస్తకావిష్కరణలో వీఎస్ఆర్

**నర్రా రాఘవరెడ్డి నగర్ (నల్లగొండ) నుంచి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి**



అబద్ధాలు చెప్పడంలో ప్రధాని నరేంద్ర మోడీకి ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చని సీపీఐ(ఎం) కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు వి శ్రీనివాసరావు అన్నారు. నల్లగొండ పట్టణంలో జరుగుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర ద్వితీయ మహాసభల సందర్భంగా మంగళవారం 'అబద్ధాలే ఆయుధాలు' పుస్తకాన్ని వి శ్రీనివాసరావు, 'హత్యలు, దాడులు, అసత్య ప్రచారాలతో భావాన్ని అంతమొందించలేరు' పుస్తకాన్ని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఆర్ అరుణ్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రమాదకరమైన విధానాలు అవలంబిస్తోందని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని, లౌకికతత్వాన్ని, రాజ్యాంగ విలువల్ని తుంగలో తొక్కుతోందన్న అంశాలు ఈ పుస్తకాల్లో విపులంగా ఉన్నాయన్నారు. అబద్ధాలు చెప్పడం, చెప్పిన మాట మీద నిలబడకపోవడం బీజేపీ, ఆర్ఎస్ఎస్ ప్రపంచంలోనే నెంబర్‌వన్ అని విమర్శించారు. రాముడి గురించి, రామరాజ్యం గురించి, ఒకేమాట, ఒకే సతి, ఒకే బాణం గురించి మాట్లాడతారని గుర్తు చేశారు. ఎన్నికలకు ముందు ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చారని, ఇప్పుడు 2 లక్షలు కూడా ఉద్యోగాలివ్వకపోగా, ఉద్యోగాలెందుకు పకోడీలు వేసుకొని బతకమంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పకోడీ చేసుకొని అమ్ముకొని బతకడమూ ఉద్యోగమేనా అని ప్రశ్నించారు. అమిత్‌షా పార్లమెంటులో పకోడీలు అమ్ముకుంటే భవిష్యత్తులో బడా పెట్టుబడిదారులు అవుతారని మాట్లాడుతున్నారని చెప్పారు. జనం అజ్ఞానులనుకుంటున్నారా?, వారి చెవిలో పువ్వు పెట్టాలనుకుంటున్నారా? అని ప్రశ్నించారు. ఇది జనాన్ని, దేశాన్ని అవమానించడం అవుతుందన్నారు. ఇంత కన్నా దేశద్రోహం ఇంకొకటి లేదన్నారు. అపారమైన యువశక్తి ఉందని, ఈ మానవ సంపదను ఉపయోగించుకొని ప్రపంచానికి అందించాల్సింది పోయి పకోడీలు, శనక్కాయలు అమ్ముకోవాలని చెప్పడమంటే బీజేపీ నాయకులు మతి ఉండే మాట్లాడుతున్నారా?అని ప్రశ్నించారు. చెప్పేదానికి చేసే దానికి పొంతన లేదన్నారు. అందుకే ప్రజలు తెలుసుకొని ఇటీవల రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్‌లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ అసలు రూపం బయటపడిందని చెప్పారు. దాన్ని ఎలా వదిలించుకోవాలా? అని ఆలోచిస్తున్నారని అన్నారు. రానున్న రోజుల్లో బీజేపీని ప్రజలు తప్పనిసరిగా వదిలించుకుంటారని చెప్పారు. బడ్జెట్‌లోనూ ప్రజలకు నిరాశే ఎదురైందని అన్నారు. మోడీ ప్రభుత్వానికి నూకలు చెల్లాయి, వారి అబద్ధాలు ఇక చెల్లవు అని రుజువయ్యిందన్నారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ అసలు రూపం సవివరంగా ఈ పుస్తకాల్లో ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, నవతెలంగాణ పబ్లిషింగ్ హౌజ్ సంపాదకులు జి విజయారావు, జనరల్ మేనేజర్ కోయ చంద్రమోహన్, మార్కెటింగ్ ఇంఛార్జీ ఖయ్యుం తదితరులు పాల్గొన్నారు.


### ఆదివాసీ ఆత్మగానం పుస్తకావిష్కరణ

**సీపీఐ(ఎం) రాష్ట్ర ద్వితీయ మహాసభల్లో వివిఎన్‌వికె శాస్త్రి రచించిన ఆదివాసీ ఆత్మగానం పుస్తకాన్ని ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే కుంజాబొజ్జి ఆవిష్కరించారు. ఈ పుస్తకం గురించి బండారు రవికుమార్ పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్‌కరత్, ఎమ్మెల్యే సున్నం రాజయ్య, గిరిజన సంఘం ప్రధాన కార్యదర్శి భీంరావు, సీపీఐ(ఎం) నాయకులు కిల్లె గోపాల్, కృష్ణారెడ్డి, పి ఆశయ్య తదితరులున్నారు.**

# ఉపాధి కల్పనలో బీజేపీ ఘోరవైఫల్యం

## పకోడి, చాయ్, బజ్జీ వ్యాపారులను అవమానిస్తున్న మోడీ

- తెలంగాణకు వచ్చిన నిధులపై శ్వేతపత్రం ప్రకటించాలి
- సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు



**నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి**

ఉపాధి కల్పనలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఘోరవైఫల్యం చెందిందని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు విమర్శించారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి మోడీ అధికారంలోకి వచ్చారని, ఉద్యోగాలు ఇవ్వకపోగా ఏటా 70 లక్షల మంది కార్మికులను నిరుద్యోగులుగా మారుస్తున్నారని చెప్పారు. మూడు రోజులుగా నల్లగొండలో జరుగుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర ద్వితీయ మహాసభలను పురస్కరించుకుని మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రం ప్రవేశపెట్టిన చివరి పూర్తిస్థాయి బడ్జెట్ అందర్నీ నిరాశపరిచిందని, సామాన్యులకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. 2014లో అధికారంలోకి రావడానికి అభివృద్ధి ఎజెండా అని చెప్పిన బీజేపీ...పార్లమెంటులో మాత్రం ప్రధాని మోడీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా కొత్త రాజకీయాలను, పకోడి రాజకీయాలు అంటూ తెరమీదికి తెచ్చారని విమర్శించారు. పకోడీలు చేసుకోవడం గొప్పవిషయమని, వారిని అవమానపర్చొద్దని అమిత్‌షా అంటున్నారని. వాస్తవానికి పకోడీ, చాయ్, బజ్జీ వ్యాపారం చేసుకోవడం హీనమైన పని కాదని, గౌరవప్రదమైన పని అని చెప్పారు.

ఇలాంటి పనులను అవమానపరుస్తున్నది బీజేపీ నాయకులేనన్నారు. వ్యవస్థీకృత ఉపాధి చూపిస్తామని అధికారంలోకి వచ్చారని, స్వయం ఉపాధి చూపించేందుకైతే మోడీ, మన్మోహన్, కేసీఆర్, చంద్రబాబు ఎందుకని ప్రశ్నించారు. ఆ బాధ్యతను నెరవేర్చకుండా వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ హయాంలో ఉపాధి కోల్పోయిన వారు పకోడీ వ్యాపారం చేసుకునే పరిస్థితి వచ్చిందన్నారు.

ప్రజలు స్వయంకృషితో బతకడమే తాము చేసిన గొప్ప పని చెప్పడంతోనే ఆ పార్టీ వైఫల్యం బట్టబయలు అయిందన్నారు. ఉపాధి కల్పించడంలోనూ, నిరుద్యోగ భృతి ఇవ్వడంలో ఘోరవైఫల్యం చెందిందన్నారు. 2014 నుంచి ఎంత ఉపాధిని సృష్టించిందో పార్లమెంటుకు పత్రం సమర్పించాలని డిమాండ్ చేశారు. విభజన సమయంలో కాంగ్రెస్ కన్నా ఎక్కువ హామీలను బీజేపీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చాన విభజన చట్టం అమల్లోనూ కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు.

తెలుగు రాష్ట్రాలకు ఇచ్చిన వాగ్దానాలను వమ్ము చేసిందన్నారు. ఇరు రాష్ట్రాల సీఎంలు కేంద్రంపై ఒత్తిడి పెంచకుండా కాలక్షేపం చేశారని విమర్శించారు. బడ్జెట్‌లో బీజేపీ ఏం చేయలేదని ఏపీ సీఎం చంద్రబాబు కొత్త నాటకం ఆడుతున్నారని చెప్పారు. కేసీఆర్ ఆ నాటకమూ ఆడడం లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని మంత్రి ఈటల రాజేందర్ కేంద్రాన్ని కోరానని చెప్పారు. తెలంగాణకు మౌలిక సదుపాయాల సృష్టి కోసం నాలుగు డ్రై పోర్టులను ఇస్తామని కేంద్రం హామీ ఇచ్చిందన్నారు. అందులో దామరచర్ల పోర్టు ఒకటని, దానికి రూ.7 వేల కోట్లు ఖర్చవుతుందన్నారు. కేంద్రం వాటా ఇస్తామని చెప్పి ఇప్పటికీ ఇవ్వడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అడగడం లేదన్నారు. 4 ఏండ్లలో కేంద్రం నుంచి వాగ్దానాలు, ఎన్ని నిధులు మంజూరయ్యాయో, ఎన్ని నిధులు ఖర్చు చేశారో శ్వేతపత్రం ప్రకటించాలని కేసీఆర్‌ను డిమాండ్ చేశారు.

అన్ని పక్షాలనూ కలుపుకొని కేంద్రంపై ఒత్తిడి పెంచాలని కోరారు. కేంద్రంపై ఒత్తిడి పెంచిందన్న గౌరవం టీఆర్ఎస్‌కు దక్కుతుందని చెప్పారు. అది చేయకపోతే బంగారు తెలంగాణవైపు తీసుకెళ్తామన్న వాగ్దానానికి టీఆర్ఎస్ ప్రభుత్వమే నీళ్లొదిలిందన్న అభిప్రాయం వస్తుందన్నారు. గిరిజన విశ్వవిద్యాలయం నెలకొల్పుతామని అన్నారని, నాలుగేండ్లయినా ఊసే లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు, బి వెంకట్, జూలకంటి రంగారెడ్డి, నల్లగొండ జిల్లా నాయకులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, తుమ్మల వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రక్షణ లేని రక్షకులు

- ప్రతీ మూడు రోజులకు దేశం కోసం ప్రాణాలు విడుస్తున్న ఒక సైనికుడు
- బుల్లెట్ ప్రూఫ్ ఎక్విప్‌మెంట్ లేకుండానే జవాన్లు,పోలీసులు రణరంగంలోకి..



**కన్నవారిని, సొంతఊరిని వదిలిపెట్టి ఎక్కడో సరిహద్దుల్లో దేశ రక్షణ కోసం అహర్నిశలు శ్రమిస్తుంటాడు జవాను. దేశంలో ఉన్న ప్రజలను దోపిడీలు, దొంగతనాల నుంచి అనుక్షణం కనిపెట్టుకొని ఉంటాడు పోలీసు. తమ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి.. శత్రువులను ఎదిరిస్తూ.. ప్రాణదీపం ఎప్పుడు ఆరిపోతుందో కూడా తెలియని జీవితాల్ని గడుపుతున్న ఈ త్యాగజీవుల రక్షణ బాధ్యత పాలకులపై ఎంతైనా ఉన్నది. ఐతే, మన ప్రభుత్వాలు ఆ బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తున్నాయా? ఆ నేపథ్యంపై 'నవతెలంగాణ' స్పెషల్ ఫోకస్..**

**కడవేర్గు**

గత 13 ఏండ్లలో 1,684 మంది సైనికులు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారని భారత సైన్యం తాజాగా ఓ నివేదికను వెల్లడించింది. మొత్తంగా చూసుకుంటే, గత 13 ఏండ్లలో ప్రతి మూడు రోజులకు ఒక జవాను అమరుడవుతున్నాడని తేలడం విస్తుగొలుపుతోంది. కాగా, ఉగ్రవాదుల చేతుల్లోనో, శత్రు దేశాల కాల్పుల్లోనో నిత్యం మన దేశంలో వేల సంఖ్యలో జవాన్లు ప్రమాదకర పరిస్థితులు ఎదుర్కొంటూ.. కొన్ని సార్లు ప్రాణాలు కోల్పోతున్న విషయం తెలిసిందే! ప్రత్యర్థుల నుంచి రక్షణ కల్పించే సరైన ఎక్విప్‌మెంట్ లేకనే అత్యధిక సైనికులు నేలకొరిగారని తెలిస్తే మనసులు చివుక్కుమనక మానవు. ఇక, ప్రస్తుతం.. ఎంత లేదన్నా దేశవ్యాప్తంగా పోలీసులకు తక్కువలో తక్కువ కనీసం 50వేల బుల్లెట్ ప్రూఫ్ కిట్లు అత్యవసరమని ఓ స్వచ్ఛంధ సంస్థ నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. ఐతే, దేశ రాజధాని ఢిల్లీలో సుమారు 90 వేల మంది పోలీసులకు కేవలం 250 బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు మాత్రమే ఉన్నాయని ఢిల్లీ పోలీస్ మాజీ చీఫ్ బిఎస్ బస్సీ ఓ సందర్భంలో పేర్కొనడాన్ని చూస్తే, మన రక్షకుల రక్షణపై మన పాలకుల చిత్తశుద్ధి ఎంత గొప్పగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక, దేశ రాజధాని నగరమైన ఢిల్లీలోనే పరిస్థితి ఇలా ఉంటే..మిగతా చోట్ల ఎలా ఉంటాయో ఊహించుకోవచ్చు.

**కాపాడేవి కూడా నాసిరకమేనా?**

పిస్తోళ్లు, గ్రెనేడ్లు, తూటాలు, పేలుడు పదార్థాలు, లైమర్లు, ఏకే-47 మొదలు అత్యాధునిక ఆయుధాలతో ఉగ్రమూకలు దేశంపై ఉన్నపళంగా విరుచుకుపడితే..? వారిని ఎదుర్కొనే గుండె ధైర్యం మన ఆర్మీ, పోలీసు బలగాలకు ఎంతున్నప్పటికీ.. స్వరక్షణ కోసం బుల్లెట్ ప్రూఫ్ జాకెట్, హెల్మెట్ వంటి ఎక్విప్‌మెంట్ మన సైనికులకు, రక్షకభటులకు తప్పనిసరి. ఐతే, ఇప్పుడు ఆ విషయంపై మరోసారి రచ్చ మొదలైంది. తాజాగా, చండీగఢ్ సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబోరేటరీలో నిర్వహించిన ఏకే-47 టెస్టులో.. కాన్పూర్ లోని ఎంకెయూ సంస్థ తయారు చేసిన సుమారు మూడింట ఒక వంతు బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు ఫెయిల్ అవ్వడంతో.. మహారాష్ట్ర పోలీసు శాఖ సుమారు 1,430 జాకెట్లను తిరిగి వెనక్కి పంపివేయడం ప్రాధాన్యతను సంతరించుకున్నది. కాగా, నాణ్యమైన బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు, ఆయుధాలు లేకపోవడం వల్లే ఎటిఎస్ చీఫ్ హేమంత్ కర్కరే 26/11 ముంబై ఉగ్ర దాడుల్లో చనిపోయారని అప్పట్లో విమర్శలు వెల్లువెత్తగా.. ప్రభుత్వం ఆ వాదనను తోసిపుచ్చింది. ఇప్పుడు, స్వదేశీ భద్రతాదళాలకు అందించాల్సిన బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లలో బయటపడిన నాసిరకం వ్యవహారం ఎంతదూరం వెళ్తుందో చూడాలి.

**ఎగుమతులకైతే సిద్ధం**

మేక్ ఇన్ ఇండియాలో భాగంగా కేంద్రప్రభుత్వం.. కాన్పూర్‌లో వున్న ఎంకెయూ లాంటి పరిశ్రమలు దేశంలో ఇబ్బడి ముబ్బడిగా ఏర్పాటు చేయాలని ప్రణాళికలను సిద్దం చేస్తోంది. వీటి ద్వారా ఉత్పత్తి అయ్యే బుల్లెట్ ప్రూఫ్ కిట్‌లను మన సైనికులకు, పోలీసులకు అందించడానికే మోడీ ప్రభుత్వం ఈ పరిశ్రమలను నెలకొల్పుతుందని అనుకుంటే పొరపాటే! బ్రిటన్, జర్మనీ, స్పానిష్, ఫ్రెంచ్ ఇలా దాదాపు 100 దేశాల్లో 230 భద్రతా దళాలకు మన దేశంలో తయారైన బుల్లెట్ ప్రూఫ్ కిట్‌లను ఎగుమతి చేయాలని లెక్కలేసుకుంటోంది మన ప్రభుత్వం. ఐతే, మన దేశ సరిహద్దుల్లో తరుచూ భీభత్సం సృష్టిస్తోన్న ఉగ్రవాదుల చేతుల్లో ప్రాణాలు కోల్పోతున్న సైనికులకు,పలు రాష్ట్రాల్లో భద్రతా దళాలకు ఆయా బుల్లెట్ ప్రూఫ్ ఎక్విప్ మెంట్ అందించాలన్న కనీస ధర్మం మన పాలకులకు లేకపోవడం నిజంగా దురదృష్టకరం.

**అక్కడ అలా.. ఇక్కడ ఇలా..**

మన పొరుగున ఉన్న చైనా తమ భద్రతా దళాల కోసం అత్యాధునిక, శక్తివంత, సౌకర్యవంతమైన బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లను తయారు చేస్తుంటే, మనం ఇంకా పాత పద్ధతుల్లో తయారు చేసినవాటినే మన సైనికులకు అరకొరగా అందిస్తుండటం గమనార్హం. సాధారణ బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లలో ఉపయోగించే పదార్థాల కంటే పటిష్టంగా ఉండి, బెలూన్ కంటే తేలికగా ఉండే సూపర్ మెటీరియల్(గ్రాఫేన్ ట్యూబ్‌ల్లో నురగ లాంటి పదార్థం)తో బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లను చైనా శాస్త్రవేత్తలు విజయవంతంగా ప్రవేశపెట్టారు. ఈ జాకెట్లలో ఉపయోగించిన మెటీరియల్ దాని బరువు కంటే 40 వేల రెట్లు ఎక్కువగా సపోర్ట్ చేస్తూనే, చదరపు అంగుళానికి 6577 కేజీల కంటే ఎక్కువ శక్తితో వచ్చే దెబ్బను కూడా తట్టుకునే సామర్థ్యాన్ని కలిగి ఉండటం విశేషం. ఇక, మన దేశంలో తయారవుతున్న బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ల విషయానికి వస్తే.. బుల్లెట్ ప్రూఫ్ స్టీల్, సిరామిక్ ప్లేట్, పాలిథైలిస్ ప్లేట్‌లతో కూడిన మూడు పొరలు కలిగి నైలాన్ లేక కెవ్లాన్ ఫ్యాబ్రిక్‌తో మూడు కిలోల బరువుండే కెవ్లార్ అనే ప్రత్యేక వస్త్రంతో తయారు చేసిన బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లను పోలీసులకు అందిస్తుండగా, కమెండోలకు సుమారు 5 కేజీల నుంచి 11 కేజీల బరువు కలిగిన బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లను మన అధికారులు ఇస్తుండటంతో వాటిని ధరించి ప్రత్యర్థులతో పోరాడటం మన సైనికులు, భద్రతా దళాలు, పోలీసులకు కష్టంగా మారుతోంది.

"అధికారంలో ఉన్న ప్రతిఒక్కరికీ ఎక్స్, వై, జడ్ కేటగిరీల పేరుతో రక్షణ కల్పిస్తూ, దేశాన్ని కాపాడుతోన్న తమకు రక్షణ కరువైందని, తమ ప్రాణాలకు విలువ లేకుండా పోతోంద"ని సీఆర్పీఎఫ్ జవాన్ పంకజ్ మిశ్రా గత సంవత్సరం ఏప్రిల్ లో ఆవేదన వ్యక్తం చేయడంలో అర్థం ఉన్నది. ఇప్పటికైనా, మన పాలకులు దేశ భద్రతను, ప్రజా సంక్షేమాన్ని ఎల్లవేళలా పరిరక్షిస్తోన్న ఆ నిస్వార్థుల రక్షణకు నడుంబిగించే సమయం వచ్చింది. ఇప్పటికైనా, మన ప్రభుత్వాలు ఆ దిశగా చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం.

**బుల్లెట్ చేసిన మరకలు- వాస్తవాలు**

2015లో పంజాబ్‌లోని గురుదాస్‌పూర్ పోలీస్ స్టేషన్‌పై ఉగ్రవాదులు దాడికి పాల్పడిన విషయం తెలిసిందే! ఆ ఘటనలో ముష్కరులను ప్రతిఘటించిన ఎస్ పి బల్జీత్‌సింగ్.. హెల్మెట్, బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ లేని కారణంగానే.. కొన్ని నిమిషాల వ్యవధిలోనే ఉగ్రవాదుల తూటాలకు బలయ్యారు.

| సంవత్సరం | అమరులైన జవాన్లు |
|---|---|
| 2017 | 91 |
| 2016 | 86 |
| 2015 | 85 |
| 2014 | 65 |
| 2013 | 64 |
| 2012 | 75 |
| 2011 | 71 |

ఆధారం: ఇండియన్ ఆర్మీ నివేదిక

2008 నవంబర్ 26.. యావదారేతాన్ని వణికించిన ముంబై దాడుల ఘటనలో మహారాష్ట్ర ఏటీఎస్ చీఫ్ గా వ్యవహరించిన యాంటి టెర్రరిస్ట్ స్క్వాడ్ ఆఫీసర్ హేమంత్ కర్కరే ఒకేసారి పదిమంది ఉగ్రవాదులను ఎదుర్కొన్నప్పటికీ, నాసిరకమైన బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు, ఆయుధాలతో.. కామా ఆస్పత్రి సమీపంలో ఉగ్రవాదుల చేతిలో విగతజీవులయ్యారు.

"బీజేపీ అధికారంలోకి వస్తే భారత సైనికులపై దాడి చేయటానికి పాక్ జంకుతుందని ఎన్నికల్లో హామీ ఇచ్చారని, మరి ఇప్పుడు జరుగుతున్నది ఏంటీ?" అంటూ సాక్షాత్తు ప్రధానినే మాజీ సైనికుడు ధరమ్ వీర్ సింగ్ భార్య గత సంవత్సరం ఓ లేఖ ద్వారా ప్రశ్నించడమే గాక, 56 అంగుళాల జాకెట్ ను

| సెన్సెక్స్ ▼561 | నిఫ్టీ ▼168 | డాలరుకు రూపాయి విలువ | బంగారం(10గ్రా) | వెండి (కేజీ) | కోడిగుడ్లు | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 34,195 | 10,498 | 64.25 | రూ. 31,283 | రూ. 42,600 | హైదరాబాద్ 368 | ఒక్కగుడ్డుకు 4.30 | వరంగల్ 370 | |
| | | | | | విజయవాడ 374 | చెన్నై 397 | ముంబయి 410 | |






## కార్పొరేట్లకు హామీలను నెరవేర్చుతాం: జైట్లీ



**న్యూఢిల్లీ:** కార్పొరేట్లకు ఇది వరకు ఇచ్చిన హామీలను నెరవేర్చుతా మని ఆర్థిక శాఖమంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. భవిష్యత్తులో కార్పొరేట్, పరోక్ష పన్నుల కు కోత పెడుతామని చెప్పారు. మంగళ వారం న్యూఢిల్లీలో ఫిక్కీ ఏర్పాటు చేసిన సమావేశంలో జైట్లీ మాట్లాడుతూ పరిశ్రమ వర్గాలకు 2015లో హామీ ఇచ్చిన విధంగా కార్పొరేట్ పన్నును 30 శాతం నుంచి 25 శాతానికి తగ్గిస్తున్నారు. దశల వారిగా దీనికి కోత పెడుతామని మంత్రి చెప్పారు. అయితే కార్పొరేట్ వర్గాలకు ఇచ్చే ప్రోత్సాహకాలు అన్నీ ముగిసిన తర్వాతే ఇది సాధ్యపడుతుందన్నారు.

## ఎగిసిన పసిడి ధర..

**ముంబయి:** ప్రపంచ మార్కెట్లలో బలహీన పరిణామాలు చోటు చేసు కోవడంతో బంగారంపై పెట్టుబడులు పెరుగుతున్నాయి. ఇదే క్రమంలో దేశీ యంగా వచ్చే పెళ్లిళ్ల సీజన్ అవసరాల నిమిత్తం స్థానిక వర్తకులు కూడా ముందస్తు అవసరాల కోసం పసిడి కొనుగోళ్లకు మొగ్గు చూపడంతో మంగళవారం బంగారం ధర 14 మాసాల గరిష్ట స్థాయికి చేరింది. న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం, 99.5శాతం స్వచ్ఛత కలిగిన 10గ్రాముల బంగారంపై రూ.330 పెరిగి వరుసగా రూ.31,600, రూ.31,450కు చేరింది. 2016 నవం బర్ 19న బంగారం ధర ఈ స్థాయిలో నమోదయ్యింది. కిలో వెండిపై రూ.500 ప్రియమై రూ.40,000కు చేరింది.

## వారానికి 25 లక్షల పాన్ కార్డులు..

న్యూఢిల్లీ : ప్రతీ వారంలో దాదాపుగా 15-25 లక్షల పాన్ కార్డులకు దరఖాస్తులు వస్తున్నాయని ఆదాయపు పన్ను శాఖ వెల్లడించింది. కాగా కొన్ని గంటలు లేదా రెండువారాల్లో పాన్ కార్డులను జారీ చేస్తున్నట్లు ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివ్ ప్రతాప్ శుక్లా మంగళవారం లోకసభకు లిఖితపూర్వకంగా తెలిపారు. జనవరి 28నాటికి మొత్తం 20,73,434 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

## ఫ్యాబ్ ఇండియాపై కేసు..

**న్యూఢిల్లీ:** అక్రమంగా తమ ట్రేడ్‌మార్క్‌ను ఉపయోగించుకుంటున్నా రని, దుస్తుల ఖాదీ ట్యాగ్‌తో అమ్ముతున్నారని ఆరోపిస్తూ ఖాదీ, గ్రామ వ్యాపార కమిషన్ (కెవిఐసి) రిటైల్ చైన్ దుస్తుల విక్రయ సంస్థ ఫ్యాబ్ ఇం డియాకు నోటీసులు పంపించింది. ట్రేడ్ మార్క్ విధానం కింద నోటీ సులు ఇచ్చింది. ఇందుకుగాను నష్టపరిహారంగా రూ.525 కోట్లను చెల్లిం చాలని డిమాండ్ చేసింది. లేదంటే చట్టపరమైన చర్యలకు సిద్ధంగా ఉండాలని కెవిఐసి హెచ్చరించింది. అంతేకాదు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని కూడా కోరింది.

# ఆవిరైన సంపద 10 లక్షల కోట్లు

### మూడు రోజులు.. 711 పాయింట్లు

- కొనసాగిన నష్టాలు... సెన్సెక్స్ మరో 561 పాయింట్ల పతనం
- ఇంట్రా ట్రేడింగ్‌లో 1200 ఫట్
- కొత్తగా అమెరికా భయాలు



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్లు కేంద్ర బడ్జెట్ షాక్ నుంచి కోలుకోకముందే అమెరికా పరిణామాలు ఉపద్రవం లా ముంచుకొచ్చాయి. ఈ రెండు దెబ్బలతో మంగళవారం కూడా మార్కెట్లు చతికిల పడ్డాయి. సెన్సెక్స్ ప్రారంభంలోనే ఏకంగా 1,274 పాయింట్ల పతనంతో 33,500 పాయింట్ల దిగువకు పడిపోయింది. దీంతో కొన్ని సెకన్లలోనే మదుపర్లు రూ.5.40 లక్షల కోట్ల విలువను కోల్పోయారు. అమెరికా మార్కెట్లు గత ఆరేండ్లలో ఎప్పుడూ లేని విధంగా పతనం కావడంతో భారత మార్కెట్లపై ప్రభావం పడింది. దీనికి తోడు దేశీయంగా ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ ప్రవేశపెట్టిన బడ్జెట్ మదుపర్లను తీవ్ర నిరుత్సాహానికి గురి చేసిన విషయం తెలిసిందే. మరోవైపు రిజర్వు బ్యాంకు వడ్డీ రేట్లు పెంచనుందన్న అంచనాల్లో ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గు చూపారు. కాగా బడ్జెట్‌లో ఈక్విటీలపై దీర్ఘకాల పెట్టుబడులపై లాభాలు రూ.1లక్ష దాటితే 10 శాతం పన్ను అమలు చేయాలని కేంద్రం నిర్ణయించడం మార్కెట్ల నష్టాల కొనసాగింపునకు కారణమైంది. ఈ పరిణామాల వల్ల గత మూడు రోజుల్లో సెన్సెక్స్ 1711 పాయింట్ల నష్టాన్ని చవి చూసింది. మదుపర్లు దాదాపుగా రూ.10 లక్షల కోట్లు నష్టపోయారు. మార్కెట్లలో మరింత దిద్దుబాటు కొన సాగనుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

**ప్రతికూల అంశాలు..**

పలు పరిణామాల మధ్య అమెరికా మార్కెట్లు తీవ్ర పోటును ఎదుర్కొన్నాయి. ఈ ప్రభావం భారత, ఇతర ప్రపం చ మార్కెట్లపై ప్రభావం చూపింది. కేంద్ర బడ్జెట్‌లో ప్రతిపాదించిన ఎల్‌టీసీజీ పన్ను, ద్రవ్యలోటు కూడా భారత మార్కెట్లను పడగొట్టింది. అమెరికా స్టాక్‌మార్కెట్లు డోజోన్స్, ఎస్అండ్‌పీ సూచీలు అతిపెద్ద ఇంట్రాడే పతనాలను నమోదుచేశాయి. ద్రవ్యోల్బణ భయాలు పెరుగడంతో ఆర్‌బీ ఐ కీలక వడ్డీరేటు అయిన రెపోను పెంచే అవకాశాలున్నా యని విశ్లేషణలు జోరందుకున్నాయి. దీంతో మదుపర్లలో మరిన్ని భయాలు చోటు చేసుకోవడం మార్కెట్లను భారీ పతనం వైపు తీసుకెళ్లాయి.

**అధికంగా నష్టపోయినవి..**

సెన్సెక్స్ 30లో అత్యధికంగా టాటా మోటార్స్ 5.45 శాతం, టీసీఎస్ 3.58 శాతం, కొటాక్ మహీంద్రా బ్యాంకు 2.70 శాతం, ఇన్ఫోసిస్ 2.62 శాతం, హీరో మోటో కార్ప్ 2.52 శాతం, ఇండుస్‌ఇండ్ బ్యాంకు 2.31 శాతం చొప్పున అధిక నష్టాలు చవి చూసిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. నిఫ్టీలో రంగాల వారిగా ఐటీ 2.90 శాతం, ఫార్మా 2.19 శాతం, ఆటో 1.80 శాతం, ఎఫ్ఎంసీజీ 1.91 శాతం, రియాల్టీ 1.88 శాతం, పీఎస్‌యూ బ్యాంకు 2.11 శాతం, బ్యాంకింగ్ 1.10 శాతం చొప్పున నష్టపోయి మార్కెట్లను ఒత్తిడికి గురి చేశాయి.

**రూపాయి విలవిల**

వరుసగా పడిపోతున్న మార్కెట్ల వల్ల రూపాయి విలువ ఒత్తిడికి గురై రెండు నెలల కనిష్ట స్థాయికి పడిపోయింది. మంగళవారం సెషన్‌లో అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 0.28 శాతం కోల్పోయి 64.25కు దిగజారింది. రూ.64.40 వద్ద మొదలైన రూపీ ఇంట్రా ట్రేడింగ్‌లో ఏకంగా 64.40 కనిష్ట స్థాయిని తాకింది. ప్రస్తుత ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటి వరకు రూపాయి విలువ 0.6 శాతం తగ్గింది.

**అమెరికా మార్కెట్లు ఢమాల్**

వివిధ పరిణామాల వల్ల అమెరికా స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. మదుపర్ల అమ్మకాల ఒత్తిడితో సోమవారం ఇక్కడి సూచీలు ఆరు సంవత్సరాల కనిష్టానికి దిగజారాయి. ఈ ప్రభావం ప్రపంచ దేశాల స్టాక్ మార్కెట్లతో పాటు భారత సూచీలపై కూడా పడింది. అగ్రరాజ్యంలో ద్రవ్యోల్బణం ఎగిసిపడనుందన్న అంచనాలు అక్కడి మార్కెట్లను కుదేలు చేశాయి. అంచనాలకు మించిన వేగంతో ఫెడ్ వడ్డీ రేట్లను పెంచడంతో అమెరికాలో బాండ్ల లాభదాయకత పెరగనుంది. దీంతో షేర్లపై పెట్టే పెట్టుబడులను ఇన్వెస్టర్లు బాండ్లకు తరలించనున్నారనే విశ్లేషణలు మార్కెట్లలో మరింత ప్రతికూలతను పెంచాయి. ఈ పరిణామాల మధ్య ఎస్ అండ్ పి 500, డో ఇండస్ట్రియల్ సూచీలు రెండూ కూడా 4.0 శాతానికి పైగా పతనమయ్యాయి. చరిత్రలోనే తొలిసారి డో ఒక దశలో 1600 పాయింట్లు పతనమైంది. తుదకు 1175.21 పాయింట్ల నష్టంతో 25వేలకు దిగజారింది. 2011 ఆగస్టు తర్వాత ఇదే అతిపెద్ద నష్టం. ఎస్అండ్‌పీ 500 చివరికి 2648.94 వద్ద ముగిసింది. నాస్‌డాక్ కాంపోజిట్ కూడా 3.8 శాతం నష్టపోయింది.

## మునుగుతున్న బిట్ కాయిన్

**లండన్:** గత కొన్ని నెలలుగా అంతర్జాతీయ డిజిటల్ కరెన్సీలో సంచలనం రేపిన క్రిప్టో కరెన్సీల బుడగ పేలిపోతోంది. మంగళవారం బిట్ కాయిన్ విలువ 20శాతం మేర క్షీణించడమే ఇందుకు నిదర్శనం. మూడు నెలల కాలంలో తొలిసారి 6,200 డాలర్ల దిగువకు పతనమైంది. గతేడాది డిసెంబర్ మధ్య నాటికి ఈ కరెన్సీ విలువ 19000డాలర్ల గరిష్ట స్థాయిని తాకింది. వివిధ దేశాలు ఈ కరె న్సీపై వరుసగా నిషేధాన్ని ప్రకటించడంతో బిట్ కాయిన్ విలువ బిత్తరపోతోంది. భారత్‌లో కూడా దీనిపై నిషేధం ఉందని ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటించ డంతో మరింత ఒత్తిడికి గురైవుతుంది.

## వడ్డీ రేట్లు పెరగొచ్చు: పీఎన్‌బీ

**న్యూఢిల్లీ :** ద్రవ్యోల్బణం ఎగిసిపడటం వల్ల వడ్డీ రేట్లు పెరగొచ్చని పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) ఎండీ సునీల్ మెహతా అభిప్రాయపడ్డారు. ఇప్పటి వరకు ద్రవ్యోల్బణం పెరిగిన రేట్లు స్థిరంగా ఉన్నాయన్నారు. భవిష్యత్తులో ఈ పరి స్థితి ఉండకపోవచ్చున్నారు. రిజర్వు బ్యాంకు ఫిబ్రవరి 7న ద్వై మాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో వడ్డీ రేట్లపై నిర్ణయం తీసుకోనుంది. 2017 అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో పీఎన్‌బీ నికర లాభాలు 11.10శాతం పెరిగి 230.11 కోట్లకు చేరాయి. గతేడాది ఇదే సమయంలో రూ.207.18 కోట్లుగా ఉంది. గత త్రైమాసికంలో బ్యాంకు మొత్తం ఆదాయం రూ.14,123.98 కోట్ల నుంచి రూ.15,257.50 కోట్లకు చేరింది.



డప్పు కొట్టి షాట్‌ను ప్రారంభిస్తున్న జూలకంటి, ఉమామహేశ్వర్‌రావు

## సఫ్దర్‌హష్మీ ఆశయాలను సాధించాలి

- పీఎన్ఎం సేవలు ప్రజలకు అవసరం
- వీధి నాటకోత్సవాలను ప్రోత్సహించాలి : షాట్‌ను ప్రారంభించిన సినీ దర్శకులు ఉమామహేశ్వర్‌రావు, నాయకులు జూలకంటి

**నవతెలంగాణ-క్లాక్‌టవర్ (నల్లగొండ)**

కళాకారులంతా సఫ్దర్‌హష్మీని ఆదర్శంగా తీసుకొని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని సినీ దర్శకులు సి.మామహేశ్వర్‌రావు, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. నల్లగొండ ఎన్జీ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర వీధి నాటకోత్సవాల చివరి రోజు మంగళవారం షాట్‌ను వారు ప్రారంభించారు. ప్రజానాట్యమండలి కళాకారులు అనేక సమస్యలపై ప్రదర్శనలిస్తూ ప్రజలను చైతన్యవంతం చేయడం గొప్ప విషయమన్నారు. ప్రస్తుతం సమాజానికి ఉపయోగపడే సినిమాలను అడ్డుకునేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయన్నారు. మరోవైపు యువతను చెడు మార్గంవైపు మళ్లించి తప్పుడు ఆలోచనలు కలిగేలా కూడా సినిమాలు తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంచి వాటిని తక్కువగా, చెడువాటిని ఎక్కువగా వీక్షిస్తున్నారన్నారు. ప్రజలు మంచిని మాత్రమే ఆదరించాలన్నారు. ఢిల్లీలో సఫ్దర్‌హష్మీ వీధినాటకాలేస్తుంటే కొందరు దుండగులు హత్య చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆ సమయంలో హష్మీ భార్య అదే ప్రదేశంలో ప్రాణాన్ని సైతం లెక్క చేయకుండా నాటకాన్ని ప్రదర్శించారని తెలిపారు. ప్రస్తుతం రైతుల సమస్యలు, దోపిడీలు, మహిళలపై దాడులు, నిరుద్యోగ సమస్య తదితర అంశాలపై కళాకారులు తక్కువ సమయంలో ఎక్కువ విషయాలను కళారూపంగా ప్రజలకు వివరించడం అభినందనీయమన్నా రు. ప్రభుత్వాలు మారుతున్నాయే తప్ప పేదరికం, అసమానతలు, అవినీ తి తగ్గకపోగా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాల వైఫల్యాల వల్లే సమాజంలో పేదరికం, దాడులు, దౌర్జన్యాలు, మహిళలపై లైంగికవేధింపులు, అన్యాయాలు, అక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. వాటిన్నింటిపై ప్రజలకు అర్థమయ్యే రీతిలో చక్కటి కళాప్రదర్శనలిచ్చిన కళాకారులను అభినందించారు. వీధినాటకోత్సవాలను ప్రోత్సహించాలని కోరారు.

అనంతరం నల్లగొండ జిల్లా కళాకారులు 'అక్టోబర్ మహావిప్లవం'పై కళారూపాన్ని ప్రదర్శించారు. సూర్యాపేట కళాకారులు 'కోలాటం', హైదరాబాద్ కళాకారులు 'బోలోబోలో', యాదాద్రి భువనగిరి కళాకారులు 'గోసంగి', మంచిర్యాల, కొమరభీం, వరంగల్ జిల్లాల కళాకారులు 'అమ్మా నేనేపోతనే' కళారూపాలను ప్రదర్శించారు. భద్రాద్రి కొత్తగూడెం కళాకారులు 'కూలి బతుకులు', ఉమ్మడి నల్లగొండ జిల్లా కళాకారులు 'వీర తెలంగాణ' కళారూపాన్ని ప్రదర్శించారు.

కార్యక్రమంలో పీఎన్ఎం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వి.ఆనంద్, కట్ట నర్సింహా, రాష్ట్ర ఉపాధ్యక్షులు వేల్పుల వెంకన్న, ప్రముఖ కవి, రచయిత బెల్లి యాదయ్య, ఏపీ పీఎన్ఎం రాష్ట్ర నాయకులు అనిల్‌కుమార్, నాటక రంగ ప్రముఖులు తడకమల్ల రామచందర్‌రావు, జానపద వృత్తికళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి సాంబరాజు యాదగిరి, నియోకర్సర్ డైరెక్టర్ భిక్షమయ్య, పీఎన్ఎం నల్లగొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాంపల్లి చంద్రమౌళి, కుమ్మరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మేడారం హుండీల లెక్కింపు ప్రారంభం

- మొదటిరోజు లెక్కింపులో కోటి 72 లక్షల 40వేలు

**నవతెలంగాణ-కాశిబుగ్గ**

మేడారం జాతర హుండీల లెక్కింపును హన్మకొండలోని టీటీడీ కల్యాణమండపంలో మంగళవారం ప్రారంభించారు. జాతర హుండీలను మేడారం నుంచి కల్యాణమండపానికి ఆదివారం తరలించారు. ఇనుప హుండీలు 432, క్లాత్ హుండీలు 24 ఉన్నాయి. వడిబియ్యం హుండీలు 3 ఉన్నాయి. మొదటిరోజు 85 హుండీలు లెక్కించారు. కోటి 72 లక్షల 40వేలు వచ్చింది. కోటి రూపాయలను ఆంధ్రాబ్యాంకుకు, మిగిలినవి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుకు ఇచ్చినట్టు ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు తెలిపారు. బంగారం, వెండి, చినిగిన నోట్లను పక్కన పెట్టారు. వాటిని చివరికి లెక్కించనున్నారు. హుండీల్లో డాలర్లు కూడా పడ్డాయి. హుండీల లెక్కింపు వారం రోజుల పాటు జరిగేలా ఉంది.

## ఏకం కావాలే...

# కేసీఆర్‌ను గద్దెదించాలే

### దోపిడీ లేని రాజ్యమే కమ్యూనిస్టుల లక్ష్యం

- ఊరూరు బీఎల్ఎఫ్‌ను తీసుకెళ్లాలి : నవతెలంగాణతో సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు మల్లు స్వరాజ్యం

ప్రజలంతా ఏకం కావాలని... కేసీఆర్‌ను గద్దెదించాలని సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు మల్లు స్వరాజ్యం చెప్పారు. నల్లగొండ పట్టణంలో జరుగుతున్న సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర ద్వితీయ మహాసభలకు వచ్చిన ఆమెను నవతెలంగాణ ప్రతినిధి బొల్లె జగదీశ్వర్ పలకరించారు. పలు విషయాలపై ఆమె మాట్లాడుతూ ఎర్రజెండా పుట్టిన గడ్డ నల్లగొండ మాది. మాక్సింగోర్కి రాసిన అమ్మ నవల చదివి ఎంతో ఉత్తేజం పొందాను. ప్రజల కష్టాలను తీర్చాలని, బానిస వ్యవస్థ పోవాలని, వెట్టిచాకిరీ నిర్మూలించాలని కమ్యూనిస్టు పార్టీలో చేరాను. నిజాంకు వ్యతిరేకంగా పోరాడేందుకు నాడు ఆంధ్ర మహాసభ వేదికైంది. విసునూరు దొర, భూస్వాములకు వ్యతిరేకంగా సమరశీలంగా పోరాడాం. దొరల ఆకృత్యాలకు వ్యతిరేకంగా పాటలు పాడుకునే వాళ్లం. బతుకమ్మ అగ్రకులాలకే పరి మితం. బహుజనులు ఉయ్యాల పాటలు పాడేవాళ్లు. భారతి... భారతి ఉయ్యాలో, నైజాం రాజ్యమూ ఉయ్యాలో, ఎవ్వరు ఈ దొరలు ఉయ్యాలో, ఎందుకు ఈ శకలు ఉయ్యాలో, పాలివ్వదోలమని ఉయ్యాలో, పాలివ్వదోలక ఉయ్యాలో, పసిపిల్లలెడ్చిరి ఉయ్యాలో, నాగండ్ల మీదున్న ఉయ్యాలో, నాయన్నలార ఉయ్యా లో, తిరగబడరేమయ్య ఉయ్యాలో అని ప్రజల్లో చైతన్యం నింపాం. అదే తరహాలో ఇప్పుడు ఊరూరు ఏకం కావాలే... కేసీఆర్‌ను గద్దెదించాలే. బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్)ను ఊరూరుకి తీసుకెళ్లాలి. నల్లగొండలో జరిగే మహాసభలు అందుకు వేదికవు తుంది. నాడు దొరల స్థానంలో నేడు కంపెనీల పేరుతో కార్పొరేట్లు దోచుకుంటున్నారు. ఇక్కడ కేసీఆర్, అక్కడ మోడీ కార్పొరేట్ల చేతిలో ఉన్నారు. రాజ్యాంగ వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్నారు. దోపిడీ లేని రాజ్యమే కమ్యూనిస్టుల లక్ష్యం. కార్పొరేట్



సంస్థలకు ఇచ్చే భూములను గుంజుకుంటాం. సమిష్టి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తాం. ప్రజలంతా ఓటుహక్కును ఆలోచించి వినియోగించాలి. బీఎల్ ఎఫ్‌ను ప్రతిఒక్కరూ బలపరచాలి. ప్రతి గ్రామంలో బీఎల్ఎఫ్ జెండా ఎగరేయాలి. కాంగ్రెస్, టీడీపీ, టీఆర్ఎస్, బీజేపీ అన్నీ ఒకే విధానాలు అవలం బిస్తాయి. వామపక్ష పార్టీలే ప్రత్యామ్నాయ విధా నాలతో ప్రజలకు న్యాయం చేస్తాయి. నల్లగొండలో హత్యారాజకీయాలు సరైంది కాదు.



## మద్దతు ధర కోసం రైతుల ఆందోళన

**ఎర్రజొన్న, పసుపును ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్**

**నవతెలంగాణ-కమ్మర్‌పల్లి**

మద్దతు ధర కోసం ఎర్రజొన్న, పసుపు రైతులు రోడ్డెక్కారు. మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని 63వ నెంబర్ జాతీయ రహదారిపై మహాధర్నా చేపట్టారు. సుమారు రెండు గంటల పాటు ధర్నా జరగడంతో కిలో మీటరు వరకు వాహనాలు నిలిచి పోయాయి. ఈ సందర్భంగా మాజీ స్పీకర్ కేఆర్.సురేష్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు కష్టపడి పండించిన ఎర్రజొన్న, పసుపుకు మద్దతు ధర కల్పిం చడం లేదని అన్నారు. 2008లో వ్యాపారి మోసం చేస్తే రైతులకు అండగా నిలిచి 153 జీవో విడుదల చేసి రూ.35 కోట్లు మంజూరు చేశామని గుర్తుచేశారు. ఇప్పటి పరిస్థితులకనుగుణంగా రైతులకు క్వింటా ఎర్రజొన్నకు రూ.4,500 మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి వి.ప్రభాకర్ మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. ఎకరం ఎర్రజొన్న సాగుకు రూ.45,500 ఖర్చవుతుంటే.. ప్రస్తుతం దళారులు, వ్యాపారులు నిర్ణయించిన ప్రకారం రైతుకు రూ.7,500 నష్టం వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకుడు రాజారాం యాదవ్ మాట్లాడుతూ పసుపు క్వింటాకు రూ.15వేల మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ అర్చనకు అందజేశారు.

# బీఎల్ఎఫ్ అధికారంలోకి వస్తే కార్మికులకు పండుగ

### ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ

- నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయి : నవతెలంగాణతో సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు పి రాజారావు

బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) అధికారంలోకి వస్తే కార్మికుల పండుగేనని సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు పి రాజారావు అన్నారు. నల్లగొండ పట్టణంలో జరుగుతున్న సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర ద్వితీయ మహాసభలకు వచ్చిన ఆయనను నవతెలంగాణ ప్రతినిధి బొల్లె జగదీశ్వర్ పలకరించారు. పలు అంశాలపై ఆయన మాట్లాడుతూ సీపీఐ(ఎం) అంటేనే కార్మికవర్గ పార్టీ. ఇతర పార్టీలకు, దీనికి ఉన్న తేడా అదే. కార్మికవర్గానికి ఏది మేలు కలిగిస్తుందో, అది కమ్యూనిస్టు పార్టీకి మేలు చేస్తుంది. కార్మికవర్గానికి ఏది హాని చేస్తే, అది కమ్యూనిస్టు పార్టీని హాని కలిగిస్తుంది. పార్టీ పనిచేసేదే కార్మికులు, పేదల కోసం. పేదలు ఎదుర్కొనే ఏ సమస్యనూ పార్టీ పోరాడకుండా విస్మరించలేదు. ఆస్తులు కోల్పోయి, రెక్కలు మాత్రమే ఉన్న, కష్టజీవుల గురించి సీపీఐ(ఎం) పనిచేస్తుంది. అసంఘటిత కార్మికులకు అండగా ఉండేది సీఐటీయూ దాని ప్రాణం సీపీఐ(ఎం). ఆశా వర్కర్లు వంద రోజుల చారిత్రక సమ్మె జరిగింది. వంద రోజుల సమ్మె తర్వాత హైదరాబాద్‌కు వంద కిలోమీటర్ల దూరం నుంచి నాలుగు వైపులా ఆశా వర్కర్లు పాదయాత్ర చేసుకుంటూ రావడం అందరినీ ఆకర్షించింది. మున్సిపల్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల పోరాటాలు జరిగాయి. ఈ పోరాటాలకు సీపీఐ(ఎం) అండగా నిలబడింది. బీఎల్ఎఫ్ ప్రభుత్వం ఏర్పడితే కార్మికులకు పండుగే. వామపక్ష ప్రభుత్వం కేరళలో ఉంటే కనీస వేతనం రూ.18 వేలు అమలవుతున్నది. ఇక్కడా అదే జరుగుతుంది. కార్మికులకు వ్యతిరేకంగా ఆలోచించే సమస్యే లేదు. బూర్జువా పార్టీల నాయకత్వంలో ఉన్న ప్రభుత్వాలు మాటలు కార్మికులకు, చేతలు కార్పొరేట్లకు చేస్తున్నాయి. అది టీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్, టీడీపీ పార్టీ ఏదైనా ఇదే చేస్తుంది. చట్టాలు చట్టుబండలయ్యాయి. కార్మికులకు భద్రత లేదు. నియామకాలన్నీ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన జరుగుతున్నాయి. సింగరేణిలో ఒకప్పు డు 1.17లక్షల మంది ఉద్యోగులుంటే, 2.50కోట్ల టన్నుల బొగ్గు ఉత్పత్తి అయ్యేది. ప్రస్తుతం 50వేల మంది ఉద్యోగులుంటే, 6.50కోట్ల టన్నుల బొగ్గు ఉత్పత్తి అవుతున్నది. కార్మికులు తగ్గుతున్నారు, ఉత్ప త్తి పెరుగుతున్నది. ఉన్న వారిపై పనిభారం ఎక్కువ వుతున్నది. ఇంకోవైపు చదువుకున్నోళ్లు పెరుగుతున్నా రు. నిరుద్యోగం పెరుగుతున్నది. బీఎల్ఎఫ్ అధికా రంలోకి వస్తే కార్మికులకు మేలు కలగడంతోపాటు ప్రభుత్వరంగ సంస్థలు పరిరక్షణ అవుతాయి. నిరుద్యోగులకు



ఉద్యోగావకాశాలు మెరుగవుతాయి. కార్మికవర్గం ఐక్యమై బీఎల్ఎఫ్‌ను అధికారంలోకి తేవాలి.

# సభ్యత్వం మా ధైర్యం

నాడు ఆంధ్ర మహాసభ సభ్యత్వం (చిట్టీ) మాకు కొండంత ధైర్యం ఇచ్చిందని సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు కల్లెపు వెంకటయ్య చెప్పారు. 1964లో కమ్యూనిస్టు పార్టీలో విభేదాలు వచ్చినపుడు నర్సంపేటలో పుచ్చలపల్లి సుందరయ్య ప్రసంగం విని ఎంతో ఆకర్షితుడినై సీపీఐ(ఎం)లో చేరానని అన్నారు. నల్లగొండ పట్టణంలో జరుగుతున్న సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర ద్వితీయ మహాసభలకు వచ్చిన ఆయనను నవతెలంగాణ ప్రతినిధి బొల్లె జగదీశ్వర్ పలుకరించారు. పలు అంశాలపై ఆయన మాట్లాడుతూ మాది వరంగల్ జిల్లా హన్మకొండ మండలం తిమ్మాపూర్ అల్లిపురం గ్రామం. తిమ్మాపూర్ రెవెన్యూకు, అల్లిపురం జాగీర్దార్‌కు కేంద్రం. 1948-49 రజాకార్ల కాలంలో జాగీర్దార్ అన్వర్‌పాషా తమ్ముడు ఊర్లో నుంచి పోతుంటే తాపీ వర్కర్లు (ముదిరాజులు) లేచి నమస్కరించలేదు. జాగీర్దార్ తమ్ముడు వెంటనే 50 మంది రజాకార్లను తెచ్చి తాపీ వర్కర్లపై దాడి చేశారు. కొందరి తలలు, మరికొందరి కాళ్లు, చేతులు విరిగాయి. అప్పుడు నాకు 14 ఏండ్లు. నా మనసు కలచివేసింది. 1949-50లో మా గ్రామానికి ఆంధ్రమహాసభ వచ్చింది. సంఘంలో చేరాలని, సభ్యత్వం (చిట్టీ) తీసుకున్నాం. జాగీర్దార్ దౌర్జన్యాన్ని ఆపేందుకు అందరూ చిట్టీ తీసుకున్నారు. మరుసటి రోజు జాగీర్దార్ కొందరిని గడీకి లాక్కెళ్లారు. చిట్టీ ఉన్న ధైర్యంతో పిట్టట బుచ్చన్న నాయకత్వంలో గడీపై దాడి చేశాం. తుపాకులను ఎదిరించి మా వారిని తెచ్చాం. గ్రామం మొత్తం ఆశ్చర్యపోయింది. చిట్టీకి ఇంత బలముందా?అని అందరూ ఆలోచించారు. 1952లో ఆంధ్ర మహాసభకు జై కమ్యూనిస్టు పార్టీకి జై అంటూ ఎన్నికల్లోకి వెళ్లాం. పీడీఎఫ్ పేరుతో పోటీ చేశారు. చాలా మంది అజ్ఞాతంలో ఉండడం వల్ల పెండ్యాల రాఘవరావు వరంగల్ పార్లమెంటు, మూడు అసెంబ్లీ స్థానాలకు పోటీ చేశారు. పార్లమెంటు, రెండు అసెంబ్లీ సీట్లలో గెలిచారు. 1953లో వరంగల్‌లో కమ్యూనిస్టు పార్టీ మహాసభలో నేను వాలంటీర్‌గా పనిచేశాను. 1955లో పార్టీ సభ్యునిగా మారాను. కుటుంబ ఆర్థిక కారణాలతో ఏడో తరగతి వరకే చదివాను. సీపీఐ,



సీపీఎం మధ్య సైద్ధాంతిక విభేదాలు వచ్చినపుడు నర్సంపేటకు పుచ్చలపల్లి సుందరయ్య వచ్చారు. ఓంకార్ కమ్యూనిస్టు శ్రేణులను సమీకరించి ఆ సభకు తీసుకెళ్లారు. సుందరయ్య ప్రసంగానికి ఆకర్షితుడినై సీపీఐ(ఎం)లో చేరాను. అప్పటి నుంచి సీపీఐ(ఎం)తోనే ఉన్నా. సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల్లో ఎన్నో మార్పులొచ్చాయి. ప్రతి ఒక్కరిపైనా ప్రపంచీకరణ ప్రభావం చూపుతున్నది. నీతి, నిజాయితీ, ప్రజలకు సేవ చేసే గుణం, పట్టుదల తగ్గిపోతున్నది. బూర్జువా నాయకుల్లో లేదు. కమ్యూనిస్టుల్లో మాత్రం ఆ విలువలు ఇంకా ఉన్నాయి. అందుకే

### సుందరయ్య ప్రసంగానికి ఆకర్షితుడినై సీపీఎంలో చేరా

- బూర్జువా నాయకుల్లో ప్రజల కోసం పనిచేసే గుణం లేదు
- కమ్యూనిస్టుల్లోనే నీతి, నిజాయితీ, సేవ, పట్టుదల
- మరింత కష్టపడితే సమాజ మార్పు ఖాయం : నవతెలంగాణతో సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు కల్లెపు వెంకటయ్య

కమ్యూనిస్టులపై సమాజంలో ఎంతో గౌరవముంది. ప్రజల్లో వ్యక్తిగత లాభం, స్వార్థం పెరిగిపోయింది. సమాజం, గ్రామం, కుటుంబం బాగుపడాలనే బదులు నేను బాగుపడాలన్న అభిప్రాయం ఎక్కువవుతున్నది. ఇలాంటి పరిస్థితుల్లో కమ్యూనిస్టులు మరింత కష్టపడాలి. అప్పుడే సమాజంలో మార్పు వస్తుంది. రాజకీయాల్లో ప్రత్యామ్నాయం కోసమే బీఎల్ఎఫ్ ఆవిర్భవించింది.

భారతదేశ కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఒకటిగా ఉంటూ పర్యాటకంగా అభివృద్ధి చెందిన ఒక అందమైన సాగరతీర ప్రాంతం పుదుచ్చేరి. ఇక్కడుండే రకరకాల బీచ్‌లు, విశాలమైన సరస్సులు, బోటింగ్, చారిత్రక కట్టడాలు, పురాతన మ్యూజియం, అరుదైన వృక్షసంపద ఇలా మరెన్నో రకాల అద్భుత పర్యాటక శోభను అలంకరించుకుని దేశ విదేశీ పర్యాటకులను ఆకర్షిస్తున్నది. ఇలా భిన్నసంస్కృతులు, పాశ్చాత్య సంప్రదాయాలతో నిత్యం కళకళలాడుతూ సందర్శకులకు సరికొత్త పర్యాటక అందాలను అందిస్తున్నది పుదుచ్చేరి... అలరించే ఫ్రెంచ్ సౌందర్యం.. అందమైన బీచ్‌లు.. చూడాలనుకునే వారు తప్పనిసరిగా వెళ్లాల్సిన ప్రాంతం. తక్కువ బడ్జెట్‌లో ఎక్కువ ప్రదేశాలను చూడాలనుకునే వారు ఈ పర్యాటక కేంద్రాన్ని సందర్శించవచ్చు. అద్భుతమైన 'పుదుచ్చేరి' ప్రయాణంలోని కొన్ని విశేషాలు మీకోసం...



# సాగర తీరాన సొగసైన పుదుచ్చేరి



దక్షిణ భారత దేశంలోని ఒక కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి లేదా పాండిచ్చేరి. తమిళంలో 'పుదు–చ్చేరి' అంటే 'కొత్త–ఊరు' అని అర్థం. ఫ్రెంచి ఉచ్ఛారణ ప్రకారం దీన్ని ఫ్రెంచివారు 'పాండిచ్చేరి' అని పిలిచారు. ఎప్పుడో పొరబాటున ఆంగ్లంలో 'యూ' అక్షరానికి కు బదులుగా 'ఎన్' అని రాయడం వల్ల దీన్ని ఆంగ్లంలో 'పాండిచ్చేరి' అని పిలవడం మొదలు అయింది. ప్రస్తుతం ఆంగ్లంలో అధికారికంగా 'పుదుచ్చేరి' అని పేరు మార్చే ప్రయత్నం జరుగుతున్నది. 2006 ముందు వరకూ పుదుచ్చేరిని పాండిచ్చేరి అని పిలిచేవారు. 1954 వరకూ ఫ్రెంచ్ పరిపాలన కొనసాగడం వలన నేటికీ ఫ్రెంచ్ సంస్కృతి కనిపిస్తుంది. ఇంటి చుట్టూ బౌగన్‌విలియాలు అల్లుకున్న కొలొనియల్ కాలనీలు ఓ పక్క, అంతర్జాతీయంగా పేరుపొందిన అరబిందో ఆశ్రమం మరోపక్క, పర్యాటకులకు మిశ్రమ అనుభూతుల్ని అందించే యనాం మరోపక్క.


## ఓ అందమైన అనుభూతి...

బీచ్ రోడ్‌లో నడుస్తూ.. కడలి అందాలను చూస్తూ.. కాఫీ తాగటం ఓ అందమైన అనుభూతి. దీనికి ఎదురుగానే టూరిజం డిపార్ట్‌మెంట్ ఉంటుంది. ఇక్కడ బ్రోచర్ కలెక్ట్ చేసుకుంటే నడుస్తూ చూడదగ్గ ప్రదేశాల వివరాలు తెలుస్తాయి. దీంట్లోనే అకామిడేషన్, సైట్ సీయింగ్, షాపింగ్ వివరాలన్నీ ఉంటాయి. ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ ప్రతిరోజూ సాయంత్రం నాలుగు గంటలకు హెరిటేజ్ వాక్ నిర్వహిస్తున్నది. ఇలా నడుస్తూ టౌన్‌లోని ఫ్రెంచ్, తమిళ క్వార్టర్లను చూడొచ్చు. దారి పొడవునా మనతోపాటు ఇంటాక్ గైడ్ నడుస్తూ అక్కడి సంస్కృతి, సంప్రదాయాలను, పర్యాటక విశేషాలను వివరిస్తూ ఉంటాడు. ఫ్రెంచ్ పరిపాలననాటి రొమెయిన్ రొలాండ్, పరిసరాల్లోని పెద్ద పెద్ద చెట్లు, ఇన్నర్ కోర్ట్‌యార్డ్ ఎంతో ప్రశాంతంగా ఉంటాయి. హెరిటేజ్ వాకర్స్ ఇక్కడికి చేరుకోగానే మందార పూలతో తయారుచేసిన జ్యూస్ అందిస్తారు. ఫ్రీగానే! హైబిస్కస్ జ్యూస్ చాలా రుచిగా ఉంటుంది. ముఖ్యంగా మందార పూలతో తయారు చేసిన జ్యూస్ ఇక్కడి ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. పుదుచ్చేరిలో చూడాల్సిన ప్రదేశాలు ఆరోవిల్లి, అరవిందో ఆశ్రమం, బొటానికల్ గార్డెన్, పాండిచ్చేరి మ్యూజియం, క్రూజ్ ప్రయాణం...

## అద్భుత ప్రపంచం 'ఆరోవిల్'...

ఆరోవిల్ అంటే అరుణోదయ నగరం అని అర్థం. తమిళనాడు రాష్ట్రం లోని విళుప్పురం జిల్లాలో ఒక "ప్రయోగాత్మక" పట్టణసముదాయం. ఇది దక్షిణభారత దేశంలోని పుదుచ్చేరి వద్ద ఉంది. దీన్ని 1968లో మీరా రిచర్డ్ స్థాపించారు. ఇక్కడ ప్రజలు ఒక దేశానికి చెందిన వాళ్ళుకాదు. కానీ వీళ్ళందరూ ఒకే గ్రామం లో ఉంటున్నారు. ఈ ఊళ్ళో ఉన్న ప్రజలకు మతం లేదు, వీళ్ళకి తమ ఊరు అన్న గుర్తింపుతప్ప మరే పౌరసత్వమూ అక్కర్లేదు. ప్రపంచంలో ఉన్న ఏ మత సాంప్రదాయమూ, నమ్మకాలూ వీళ్లకి ఉండవు. తమ ఊరినే ఒక దేశంగా మలుచుకున్నారు వీళ్ళు. ప్రపంచంలో ఏ మూలన జీవిస్తున్న వారైనా సరే ఈ గ్రామానికి రావచ్చు. ఇక్కడ హాయిగా ప్రశాంతంగా జీవించవచ్చు. ఇంకా విచిత్రం ఏమిటంటే ఇక్కడి ప్రజలందరూ అసలు డబ్బుని వాడరు. తమ తమ పనులకు, సేవలకు, వస్తువులకు ఒకరి దగ్గర మరొకరు డబ్బులు తీసుకోరు. కేవలం వస్తు మార్పిడి వినిమయ పద్ధతి ఉంటుంది.

ఇక్కడికి ఒక రోజులో వెళ్లిరావొచ్చు. కులమతాలు, ప్రాంతాలు, దేశాలకు అతీతంగా ప్రజలు నివసించే అరుదైన యూనివర్సల్ టౌన్‌షిప్ 'ఆరోవిల్'. భిన్నత్వంలో ఏకత్వాన్ని స్ఫురించేలా, మానవాళి ఐక్యతే ప్రధాన ఉద్దేశంతో 1968లో మన దేశంలోని అన్ని రాష్ట్రాలతోపాటు 124 దేశాల ప్రతినిధులు వారివారి ప్రాంతాల నుంచి తెచ్చిన మట్టిని ఈ టౌన్‌షిప్ నిర్మాణానికి వాడటం ఆరోవిల్ ప్రత్యేకత. ఇక్కడ నివసించే వారంతా అక్కడే పంటలు పండించుకుంటారు. వస్తువులను తయారుచేసి అమ్మి సంపాదించుకుంటారు. పుదుచ్చేరికి తూర్పు దిక్కున పది కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ప్రదేశానికి బస్సు, క్యాబ్‌ల్లో చేరుకోవచ్చు. ప్రస్తుతం ఇక్కడ 49 దేశాలకు చెందిన 2,400 మంది నివసిస్తున్నారు. 109 హెక్టార్ల విస్తీర్ణంలో విస్తరించిన ఆరోవిల్‌ను ఇండస్ట్రియల్, ఇంటర్నేషనల్, కల్చరల్, పీస్, రెసిడెన్షియల్, గ్రీన్ జోన్లుగా విభజించారు. ఈ టౌన్‌షిప్‌ని చూడాలనుకుంటే అతిథిగా అక్కడ ఒక రోజు నుంచి వారం రోజులపాటు ఉండే సౌలభ్యం ఉంది. అయితే దానికోసం గెస్ట్‌హౌస్‌లను ముందుగానే బుక్ చేసుకోవాలి. అక్కడి విజిటింగ్ సెంటర్‌కెళ్లి ఆరోవిల్లిలో మీరు ఎన్ని రోజులు ఉంటున్నారో చెబితే అందుకు వీలుగా ఆ ప్రాంతాన్ని ఎలా చుట్టిరావాలో వాళ్లు సూచిస్తారు. ఇక్కడ అద్దెకు సైకిళ్లు కూడా దొరుకుతాయి. ఆరోవిల్ సందర్శనకు డిసెంబర్ నుంచి ఫిబ్రవరి వరకు అనువైన సమయం.



## బొటానికల్ గార్డెన్...

బొటానికల్ గార్డెన్ 22 ఎకరాల విస్తీర్ణంలో పరుచుకున్న అందమైన వనం. ఈ పార్కులో దాదాపు 1,500 రకాల మొక్కలు ఉంటాయి. సంధ్యా సమయాల్లో మాత్రమే మ్యూజికల్ ఫౌంటెన్ షోలు జరుగుతాయి. జపనీస్ రాక్, డాన్సింగ్ ఫౌంటెన్, అందమైన వాటర్ ఫౌంటెన్లు, అతిపెద్ద అక్వేరియం, చిన్నపిల్లల ట్రైన్ ఈ బొటానికల్ గార్డెన్ ప్రత్యేకతలు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పార్కు తెరిచి ఉంటుంది. గార్డెన్ లోనికి వెళ్లడానికి ప్రవేశం ఉచితం.

## అరబిందో ఆశ్రమం...

పుదుచ్చేరిలో ప్రధాన పర్యాటక ప్రదేశం 'అరబిందో ఆశ్రమం'. 1926 లో స్థాపించిన ఈ ఆశ్రమాన్ని ప్రపంచవ్యాప్త పర్యాటకులు సంవత్సరం పొడవునా





సందర్శిస్తూనే ఉంటారు. ఇదే ఆశ్రమంలోనే అరబిందోతోపాటు, తల్లి మీరా అల్ఫాస్కా సమాధులు కూడా ఉన్నాయి. ప్రతి రోజూ ఉదయం 8.30 గంటలకు సందర్శకుల కోసం అరబిందో, మదర్‌ల వీడియో ప్రదర్శిస్తారు. ఆశ్రమంలో హ్యాండ్‌లూమ్ వస్తువులు, డ్రాయింగ్స్, పెయింటింగ్స్ కూడా దొరుకుతాయి. ఇక్కడున్న లైబ్రరీ, క్రాఫ్ట్ సెంటర్లలో పర్ఫ్యూమ్స్, హెర్బల్, ఆయుర్వేద మందులు దొరుకుతాయి. హ్యాండ్‌ప్రింట్ సిల్క్ చీరలు, స్కార్ఫ్‌లు, స్టోల్స్ కూడా కొనుక్కోవచ్చు. ఇక్కడి కాఫిటేరియాలో దొరికే స్నాక్స్, మీల్స్, డిజర్ట్స్ తినేసి ఓపికగా ఆశ్రమమంతా చుట్టిరావొచ్చు. ఈ ఆశ్రమం ఉదయం 8 నుంచి 12 వరకూ, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటలవరకు తెరిచి ఉంటుంది.

## యానాం...

యానాం రాజధాని పాండిచ్చేరి. ఇది తమిళనాడుకు 870 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. యానాం ప్రముఖ పర్యాటక ప్రాంతంగా చెప్పుకోవచ్చు. యానాం 1954 వరకు ఫ్రెంచ్ కాలనీగా ఉంది. ప్రస్తుతం యానాం పుదుచ్చేరి కేంద్ర పాలిత ప్రాంతంలో భాగం. యానాంలో ఫ్రెంచ్ వారు నిర్మించిన కెథడ్రల్ చర్చి చూడాల్సిందే! దీన్ని సెయింట్ ఆన్స్ కెథడ్రల్ చర్చి అని పిలుస్తారు. ఈ చర్చి నిర్మాణానికి అవసరమైన వస్తువులను ఫ్రాన్స్ నుంచి తెప్పించారు. చర్చి నిర్మాణశైలి అన్నింటి కన్నా భిన్నంగా, అద్భుతంగా కనిపిస్తుంది.




## పాండిచ్చేరి మ్యూజియం...

ఈ మ్యూజియంలో అద్భుతమైన శిల్ప కళాకృతులు, చేత్తో తయారుచేసిన బొమ్మలు, ఫ్రెంచ్ పాలననాటి నాణేలు, పురావస్తు తవ్వకాల్లో బయటపడిన రకరకాల వస్తువులు ఉంటాయి. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒకటి వరకు తెరుచుకొని ఉంటుంది. తర్వాత మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ తెరిచి ఉంటుంది. మ్యూజియం ప్రవేశ రుసుం 15 రూపాయలు. ఆర్ట్స్, హిస్టరీ, ఆర్కిటెక్చర్ విద్యార్థులకు చూడదగినది పాండిచ్చేరి మ్యూజియం.

## చున్నంబర్ డిన్నర్ క్రూజ్...

పుదుచ్చేరిలో తప్పక చూడాల్సిన మరో అందమైన ప్రదేశం చున్నంబర్. పాండిచ్చేరి నుంచి కడలూరు వెళ్లే దారి నుండి ఏడు కిలోమీటర్ల లోపలికి ప్రయాణిస్తే చున్నంబర్ చేరుకోవచ్చు. తెల్లని ఇసుక తీరాలతో ఎంతో అందంగా ఉంటుంది. చున్నంబర్ మీదుగా ప్రవహించే నది బంగాళాఖాతంలో కలిసే స్పాట్ ను తిలకించవచ్చు. ఇక్కడ అలల ఉధతి ఎక్కువగా, లోతు తక్కువగా ఉంటుంది. కాబట్టి ఎలాంటి భయం లేకుండా నీళ్లలో ఆడుకోవచ్చు. లేదంటే కాస్త ముందుకు నడిచి సముద్రం ఒడ్డున సేదతీరొచ్చు. బోటింగ్ చేయాలంటే పిల్లలకు, పెద్దలకు వేరు వేరు చార్జీలు ఉంటాయి. చివరి బోటు సాయంత్రం 6.30కి బయలు దేరుతుంది. పండు వెన్నెల్లో నదీ విహారం చేయాలనుకునే వారికి డిన్నర్ క్రూజ్ చక్కటి విడిది. ఇక్కడ పట్టుచీరలు, లెదర్ వస్తువులు, ట్రెడిషనల్ హ్యాండి క్రాఫ్ట్స్, బ్యాగ్స్, పింగాణీ వస్తువులు ఇంకా ఎన్నో యాక్సెసరీస్ అందుబాటు ధరకు లభిస్తాయి.

## ఫ్రెంచ్ సంస్కృతి...

తెలుపు, లేత గులాబీ రంగులో పద్ధతిగా కట్టిన ఫ్రెంచి కొలొనియల్ కాలనీలలో నడుస్తూ తిరగాలి. రాళ్లతో నిండిన ప్రొమెనేడ్ బీచ్‌లో రాతి బల్లలమీద కూర్చుని సూర్యాస్తమయాన్ని చూడటం మర్చిపోలేని అనుభవం. అలాగే బ్రౌన్ వైట్ చర్చి నిర్మాణ కౌశలం చూడముచ్చటగా ఉంటుంది. ఈ చర్చి అందమంతా స్టెయిన్డ్ గ్లాసు విండోల్లోనే కనిపిస్తుంది. ప్యారడైజ్, కరైకల్ బీచ్‌ల్లో బోటింగ్, కయాకింగ్, క్యాంపింగ్, స్కూబా డైవింగ్, నీటిలో సర్ఫింగ్ చేయవచ్చు.




## చుట్టుపక్కల ప్రదేశాలు...

పుదుచ్చేరికి 100 నుంచి 150 కి.మీ పరిధిలో చూడదగ్గ ప్రదేశాలెన్నో ఉన్నాయి. వాటిలో చెప్పుకోదగినది...గంగైకొండచోళపురం. పాండిచ్చేరికి దక్షిణంగా 100 కి.మీ దూరంలో ఉంటుంది. ఇక్కడో ప్రసిద్ధ శివాలయం ఉంది. తంజావూరులోని బహదీశ్వరాలయం తర్వాత అంతటి ప్రసిద్ధి పొందిన రెండో శివాలయం ఇదే! పాండిచ్చేరికి తూర్పున 100 కి.మీ దూరంలోని చిదంబరం కూడా చూడదగ్గ ప్రదేశం. పుదుచ్చేరికి 57 కి.మీ దూరంలో మంగడం పట్టు లోఉన్న రాతి దేవాలయం మంగడంపట్టు త్రిమూర్తి. ఎటువంటి ఇటుక, కలప, లోహం ఉపయోగించకుండా పూర్తిగా కొండలో తొలిచిన దేవాలయం ఇది.

## పాండీ సైకిల్ టూర్...

ప్రకతికి పట్టుకొమ్మలా ఉండే పుదుచ్చేరి పరిధి కేవలం 19.50 చదరపు కిలోమీటర్లు మాత్రమే. ఈ సిటీలో టూరిస్ట్ ప్లేసెస్ తిప్పి చూపించటానికి పుదుచ్చేరి టూరిజం ప్రత్యేక ప్యాకేజీలతో బస్సులను నడుపుతోంది. తక్కువ ఖర్చులో సిటీ చుట్టిరావాలంటే బస్సు ప్రయాణమే ఉత్తమం. సిటీ చూడాలనుకునే వారికి ఇక్కడ అద్దెకు కార్లు, మోటర్‌సైకిళ్లు, సైకిళ్లు దొరుకుతాయి. మోటర్ సైకిళ్లు, సైకిళ్లను మనమే నడుపుకుంటూ అన్ని ప్రదేశాలు చూసి రావొచ్చు. సైకిల్ మీద ఒంటరిగా ఊరు చుట్టిరావడం బోర్ అంటారా..? అందుకే ఇక్కడి సిటీ కల్చరల్ సెంటర్ పాండీ సైకిల్ టూర్ అనే సంస్థ పర్యాటకులతో, స్థానికులతో సైకిల్ టూర్లు కూడా నిర్వహిస్తుంటుంది. ఈ గ్రూప్‌లో మీరు చేరిపోతే సరి. హాయిగా, స్వేచ్ఛగా కడలి అందాలను ఆస్వాదించవచ్చు.

– రూప ✆ 7661910634

---



# భువిపై వెలిసిన 'చంద్ర వదనం'

**హైదరాబాద్ అనగానే మనకు వెంటనే గుర్తుకు వచ్చేది కళలకు పట్టం కట్టిన నగరం అనీ. కళల పట్ల అంతులేని ప్రేమను అంతకు మించి వ్యామోహం వున్న కళాకారులను నెత్తిన పెట్టుకున్న నగరమనీ.. కళే జీవితం... జీవితమే కళగా బతికిన ఎంతో మంది నాట్యకారులను సమున్నత గౌరవంతో సత్కరించుకున్న నగరమనీ. అలాంటి నగరంలో ఒక కళాకారిణి తన తల్లి జ్ఞాపకార్థం నిర్మించిన కట్టడం కూడా దేశ విదేశీ పర్యాటకులను ఆకట్టుకుంటూ మన హైదరాబాద్ ఔనత్యాన్ని, వందల ఏండ్ల నాటి జ్ఞాపకాల్నీ కథలు కథలుగా చెబుతుంది. అదే మౌలాలిలోని 'చందా బాఘ్'...**

చంద బాయి అంటే చాలా మందికి తెలియదు. కానీ 'మహ లఖా బాయి' అంటే వెంటనే గుర్తుకు వస్తుంది. ప్రసిద్ధి చెందిన నర్తకీ మణిగా, ఉర్దూలో గజల్స్ రాసిన రచయిత్రీగా, అనాధలకు, అభాగ్యులకు అండగా నిలిచిన తల్లిగా, అనేక దాతృత్వ కార్యక్రమాలకు అండదండలు అందించడమే కాకుండా దేశంలో పేరెన్నికగల 'ఉస్మానియా విశ్వవిద్యాలయం' కూడా ఆమెకు చెందిన స్థలంలోనే నిర్మించారనే విషయం ఎంతమందికి తెలుసూ. అలాంటి అద్భుతమైన మహిళ తనకు జన్మనిచ్చిన తల్లి జ్ఞాపకార్థం నిర్మించిన కట్టడమే 'చందాబాఘ్'. తల్లితో పాటూ ఆమె మరణాంతరం కూడా తన సమాధిని కూడా తల్లి చెంతనే ఉండేలా ముందే ఏర్పాటు చేసుకున్న ప్రదేశమంటే అది ఎంత ప్రత్యేకమైందో అర్థం చేసుకోవచ్చు. నిత్యం పక్షుల కిలకిలరావాలతో, ఆకుపచ్చని పరిసరాలు వాటిమధ్య గంభీరంగా కనిపిస్తూ ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న ఆ ప్రాంతం మౌలాలి ప్రాంతంలో కొండకు కింది భాగంలో మౌలా అలీ పాదాల చెంత కొలువై ఉంది.

రాజ్ కన్వర్ బాయి, తాజ్ అలీషా అనే ముస్లిం దంపతులకు పుట్టిన ఏకైక సంతానం 'చందా బాయి". ఈమె తల్లిదండ్రులు ఔరంగబాద్ నుంచి ఇక్కడ వచ్చి స్థిరపడ్డారు. ఇక్కడే చందాబాయికి జన్మనిచ్చారు. అయితే చందా పుట్టుక గురించి, ఈ ప్రాంతంలోనే ఈ కట్టడాన్ని నిర్మించడానికి వెనుక ఒక ఆసక్తికరమైన కథ ప్రచారంలో ఉంది. ఆమె తల్లి ఆరు నెలల గర్భవతిగా ఉన్న సమయంలోనే మౌలాలీ దర్గా సందర్శనానికి మెట్లు ఎక్కుతున్నప్పుడే గర్భస్రావం అయ్యే అవకాశం ఉందని తెలిసిన వెంటనే ఆమె భర్త పరిగెత్తి దర్గా దగ్గరికి వెళ్లి మొక్కుకుని ప్రసాదాన్ని తెచ్చి ఆమెకు తినిపింగానే ప్రమాదం తప్పిపోయి నెలలు నిండిన తర్వాత ఆడపిల్లకు జన్మనిచ్చిందని, తన పుట్టుకకు, తల్లి క్షేమంగా ఉండటానికి కారణమని భావించి, ఈ మౌలాలి దర్గ చెంతనే తల్లి జ్ఞాపకార్థం 1792లో స్మృతి వనాన్ని నిర్మించి అక్కడే ఏటా మూషాయిరాను ఏర్పాటు చేసింది మహ లఖా బాయి.

పదహారు సంవత్సరాలకే సంగీత, సాహిత్య, నృత్య, గానాలలో గొప్ప విదూషీమణి అయిన చందా రెండవ నిజాం అలీఖాన్ దర్బారులో ఆస్థాన నర్తకిగా (తవాయిఫ్) 1802లో రంగ ప్రవేశం చేసి అతని మనసు గెలుచుకున్నది. నిండుపున్నమిలో పండు వెన్నెలలా కళాత్మకంగా, రసాత్మకంగా చేసే నృత్య ప్రదర్శనకు ఫిదా అయిన రెండో నిజాం నవాబు 'మహ లఖా' ('చంద్ర వదన') అను బిరుదు ప్రసాదించాడు. దీంతో చంద బాయి కాస్త "మహ లఖ్ చందా బాయి" గా మారిపోయిందని చరిత్ర చెబుతుంది. నాట్య ప్రదర్శనే కాకుండా యుద్ధకళలైన విలువిద్య, గుర్రపు స్వారీ, చిత్రలేఖనం, పుస్తక పఠనం పట్ల అభిరుచి ఉండటంతో 'ఉర్దూలో గజల్స్' రాసిన మొట్టమొదటి మహిళగా పేరు ప్రఖ్యాతులు సంపాదించింది. ఆమెకున్న అభిరుచిని, కళా ప్రదర్శనకు ఒక్క నవాబు గారే కాక సంస్థానంలోని అప్పటి ప్రముఖులైన మహారాజా చందూలాల్, మీరాలం, అరస్తు జా, సర్‌జాన్ మాల్కం లాంటి వారెందరో ఆమె కటాక్ష వీక్షణాల కోసం ఎదురుచూసే వారంటే ఆమె ఎంత ప్రజ్ఞావంతురాలే తెలుసుకోవచ్చు. అయితే ఆమె తెలివి తేటల పట్ల ఆకర్షితుడైన రెండో నిజాం ఆమె కోసం ఒక జాగీరును మంజూరు చేశాడు. అదే బాగ్‌లింగంపల్లి నుండి మౌలాలీ దాకా ఉన్న నేటి ప్రాంతం.

ఒకవైపు కళా ప్రదర్శనలో అందరిని అబ్బురపరుస్తూనే అనేక దాతృత్వ కార్యక్రమాలలో పాల్గొంటూ వందలాది మంది అమ్మాయిలకు విద్యాబుద్ధలు నేర్పించే బృహత్తర బాధ్యతతోపాటూ అనేక మంది పేద రచయితలకు, కవులకు, కళాకారులకు ఆర్థిక సహాయాలను అందచేసేంది. ఫార్సీ, అరబ్బీ గ్రంథాలను ఉర్దూలోకి సమర్థ వంతంగా తర్జుమా చేయించినట్లు చరిత్ర సాక్షంగా చెబుతుంది. అయితే వందల వేళ ఏండ్ల చరిత్ర సంస్కృతులకు సజీవ సాక్షంగా నిలిచిన ఈ వారసత్వ కట్టడాన్ని మహాలఖ్ బాయి మరణాంతరం (1824) పాలకులు పట్టించుకోకపోవడం మూలంగా శిధిలావస్థకు చేరుకుంది. అయితే ఈ కట్టడం వెనుక ఉన్న మహోన్నత చరిత్రను అధ్యయనం చేసిన విదేశీ పరిశోధకులు చొరవ తీసుకొని స్థానిక సెంటర్ ఫర్ దక్కన్ స్టడీస్, విదేశీ నిధులతో దీన్ని మరమత్తులు చేశారు. మహాలఖ్ చందా బాయి వర్ధంతి నాడు ప్రతి ఏటా అక్కడ 'మహెఫిల్ – ఏ – సమా" ముషాయిరా, సంగీత నృత్యకార్యక్రమాలు నిర్వహిస్తుంటే నగరంలో ఇంగ్లీష్ అండ్ ఫారెన్ లాంగ్వేజ్ యూనివర్సిటీ విద్యార్థులు తమ క్యాంపస్‌లోని మహిళా హాస్టల్‌కు 'మహాలఖ్ చందా బాయి' అని నామకరణం చేసుకొని ఆమెను నేటికీ గుర్తుకు చేసుకుంటున్నారు. రెండువందల ఏండ్ల చరిత్రతో అబ్బురపరిచే ఆర్కిటెక్చర్‌తో ఆనాటి భిన్న సంస్కృతుల కళాత్మక దృష్టితో నేటికీ ఆశ్చర్యపరుస్తున్న ఈ కట్టడాన్ని చూడాలంటే మౌలాలికి వెళ్లాల్సిందే. దీన్ని చూసేందుకు ఎలాంటి ప్రవేశ రుసుం ఉండదు. ఏరోజైన, ఏ సమయంలోనైనా ఈ ప్రాంతాన్ని సందర్శించవచ్చు. సో... ఇంకేందుకు ఆలస్యం మీరు ఒకసారి వెళ్లి చూసి వచ్చేయండి మరీ.

– స్వేచ్ఛ



**చరిత్ర అంటే సంఘటనల సమాహారమే కాదు. వక్రీకరణల కలబోత కూడా..**

**– ఇ.హెచ్. కార్**



# భారత్‌కు ఎదురుందా?

## • దక్షిణాఫ్రికాతో కోహ్లిసేన మూడో వన్డే నేడు
## • గాయాలు, ఓటములతో నైరాశ్యంలో సఫారీలు

**నవతెలంగాణ-కేప్‌టౌన్**

టెస్టు సిరీస్‌లో తొలి రెండు మ్యాచులు ముగిసే సరికి దక్షిణాఫ్రికా 2-0తో ఆధిక్యం. వన్డే సిరీస్‌లో తొలి రెండు మ్యాచుల తర్వాత టీమ్ ఇండియా 2-0తో తిరుగులేని ఆధిపత్యం. టెస్టుల్లో నం.1 జట్టుగా సిరీస్ కోల్పోయిన కోహ్లిసేన.. ఇప్పుడు వన్డేల్లో నం.1 జట్టు నుంచి సిరీస్ లాగేసుకునేందుకు రంగం సిద్ధం చేసింది. టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మన్ సూపర్ ఫామ్‌కు తోడు మణికట్టు స్పిన్నర్ల జోరుతో సిరీస్‌లో 3-0తో మరో అడుగు ముందుకు వేయాలని భారత్ భావిస్తోంది. మరో వైపు గాయాలతో వరుసగా కీలక ఆటగాళ్ల నిష్క్రమణ ఒకవైపు, భారత మణికట్టు స్పిన్నర్ల పీడకల మరోవైపు దక్షిణాఫ్రికా కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మానసికంగా సిరీస్‌పై ఆశలు కోల్పోయిన సఫారీలు అచ్చొచ్చిన కేప్‌టౌన్‌లో కనీస పోటీ ఇవ్వాలని బలంగా కోరుకుంటోంది.

**సాయంత్రం 4.30 నుంచి సోనీటెన్‌లో**

**రోహిత్ రాణించేనా :** టెస్టుల్లో దారుణంగా విఫలమైన రోహిత్ శర్మ..భీకర రికార్డున్న వన్డేల్లోనూ గాడిలో పడలేదు. వరుసగా రెండు వన్డేల్లో 20, 15 పరుగులకే వికెట్ పారేసుకున్నాడు. దక్షిణాఫ్రికాలో ఆడిన ప్రతిసారీ పరుగుల వేటలో విఫలమవుతున్న రోహిత్ శర్మ ఈసారీ ఈ గండం నుంచి గట్టెక్కలేదు. సహచర ఓపెనర్ శిఖర్ ధావన్, కెప్టెన్ విరాట్ కోహ్లి సహా అజింక్య రహానెలు అద్భుతంగా ఆడేస్తుంటే రోహిత్ మాత్రం వెనకబడిపోయాడు. మూడో వన్డేలో నైనా రోహిత్ ఫామ్‌లోకి వస్తాడని జట్టు మేనేజ్‌మెంట్ ఆశిస్తోంది. సిరీస్‌లో భారత మిడిల్ ఆర్డర్‌కు ఇంకా పరీక్ష ఎదురు కాలేదు. కేదార్ జాదవ్, హార్దిక్ పాండ్య, ఎం.ఎస్ ధోనిలకు బ్యాటింగ్ చేసే అవసరం రాలేదు. కేప్‌టౌన్ భారీ స్కోర్ల వేదిక కావటంతో నేడు వీరికి బ్యాట్‌తో అవకాశం దక్కవచ్చని చెప్పవచ్చు.

**సఫారీపై సవారీ :** వన్డే వరల్డ్ నం.1 దక్షిణాఫ్రికాకు మన మణికట్టు స్పిన్నర్ల ఫోబియో పట్టుకున్నది. నెమ్మదిగా బంతులేస్తూ వేగంగా వికెట్లు కూల్చేస్తోన్న కుల్దీప్ యాదవ్, యుజ్వేందర్ చాహల్‌లు దక్షిణాఫ్రికాకు కోలుకునే అవకాశం సైతం ఇవ్వటం లేదు. కుల్దీప్, చాహల్ మణికట్టు మాయకు సఫారీలు దాసోహం అవటం తప్ప మరేమీ చేయాలో తెలియని అయోమయ పరిస్థితి. మూడో మ్యాచ్‌లోనూ మణికట్టు మాయకు సఫారీ వద్ద విరుగుడు ఉండబోదని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ప్రాక్టీస్ సెషన్లో దక్షిణాఫ్రికా ఆటగాళ్లు ముమ్మరంగా మణికట్టు స్పిన్ సాధన చేశారు. కానీ మ్యాచ్‌లో ఇది ఏ మాత్రం ఉపయోగపడుతుందో ఇప్పుడే చెప్పలేం. డివిలియర్స్, డుప్లెసిస్ లేని వేళ సీనియర్ ఆటగాడు హషీమ్ ఆమ్లాపై మరింత భారం పడింది. బ్యాట్స్‌మన్‌గా పరుగులు చేయటంతో పాటు సీనియర్‌గా కెప్టెన్‌కు సహకారం అందించటం ఆమ్లా ముందున్న రెండు సవాళ్లు.



సిక్కిరెడ్డి
పి.వి సింధు

# భారత్ శుభారంభం

## • రాణించిన పి.వి సింధు, కిదాంబి శ్రీకాంత్
## • ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

**అలోర్ సెతార్ (మలేసియా) :** ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ భారత్ శుభారంభం చేసింది. ఒలింపిక్ సిల్వర్ స్టార్ పి.వి సింధు రాణించటంతో గ్రూప్ డబ్ల్యూ తొలి పోరులో మహిళల జట్టు 3-2తో హాంగ్‌కాంగ్‌పై గెలుపొందింది. సింగిల్స్ పోరులో సింధు 21-12, 21-18తో యిప్ పుయిన్‌ను ఓడించింది. ఎన్ సిక్కిరెడ్డి జతగా డబుల్స్‌లో 21-15, 15-21, 21-14తో ఎన్‌జి తాస్జుయౌ, యువెన్ సిన్‌యింగ్‌ల జంటను ఓడించింది. కిదాంబి సారథ్యం లోని పురుషుల జట్టు 5-0తో ఫిలిప్పైన్స్‌ను చిత్తు చేసింది.

తొలి మహిళల సింగిల్స్ మ్యాచ్‌తోనే భారత జట్టు శుభారంభం చేసింది. గత వారమే సొంతగడ్డపై ఇండియా ఓపెన్ రన్నరప్‌గా నిలిచిన సింధు.. ఆసియా పోరులో ఆత్మ విశ్వాసంతో బరిలో దిగింది. సహచర స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్ లేని వేళ.. ఒంటి చేత్తో జట్టుకు తొలి గెలుపు అందించింది. యిప్ పుయిన్‌ను వరుస సెట్లలో ఓడించి 1-0తో భారత్‌ను ఆధిక్యంలో నిలిపింది. తొలి మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప, ప్రజక్తా సావంత్‌ల జోడీ 22-20, 20-22, 10-21తో పోరాడి ఓడారు. ఎన్‌జి వింగ్‌యుంగ్, యెవుంగ్ ఎన్గాటింగ్‌ల జంటకు తొలి రెండు సెట్లలో గట్టిపోటీనిచ్చినా, నిర్ణాయక సెట్లో తడబడ్డారు. రెండో సింగిల్స్‌లో యువ షట్లర్ కుదరవల్లి శ్రీ కృష్ణ ప్రియ సైతం మూడు సెట్లు సాగిన హోరాహోరీ పోరులో ఓడింది. 12-21, 21-18, 20-22తో చెయుర్ యింగ్‌మెయ్‌కు మ్యాచ్ కోల్పోయింది. దీంతో భారత్ 1-2తో వెనుకంజ వేసింది. ఈ దశలో రెండో డబుల్స్ సమరంలో సిక్కి, సింధుల జోడీ రాణించి టై స్కోరును 2-2తో సమం చేసింది. ఆఖరుదైన మూడో మహిళల సింగిల్స్‌లో గద్దె రుత్వికా శివాని మెరిసింది. 16-21, 21-16, 21-13తో గెలుపొందింది. తొలి సెట్ ఓడినా తదుపరి రెండు సెట్లనూ కైవసం చేసుకున్న శివాని.. జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. గురు వారం సింధు సేన.. బలమైన ప్రత్యర్థి జపాన్‌తో తలపడనున్నది. ప్రపంచ రెండో ర్యాంకర్ అకానె యమగూచి, ప్రపంచ చాంపియన్ నొజొమి ఒకుహారలతో కూడిన జపాన్ జట్టును భారత్ ఎలా ఎదుర్కొంటునేది ఆసక్తికరం.

పురుషుల జట్టులో ఆటగాళ్లు అన్ని విభాగాల్లో ఏకపక్ష విజయాలు నమోదు చేశారు. శ్రీకాంత్ 21-11, 21-12తో లియోనార్డ్ పెడ్రోసాపై నెగ్గగా, బి సాయి ప్రణీత్ 21-6, 21-10తో ఆర్థర్ సామ్యేల్‌ను ఓడించాడు. మూడో పురుషుల సింగిల్స్‌లో సమీర్ వర్మ 21-15, 21-12తో రాల్ఫ్ జఫ్రాను మట్టికరిపించాడు. డబుల్స్‌లో మను అత్రి, సుమీత్ రెడ్డిల జోడీ 21-15, 21-13తో కార్లోస్ ఆంటోనీ, ఫిలిప్ జోపర్ జోడీపై గెలుపొందింది. ఎమ్.ఆర్ అర్జున్, రామచంద్రన్ శ్లోక్‌ల మరో భారత జోడీ 21-18, 21-17తో పీటర్ గాబ్రియేల్, ఆల్విన్ మోరాడాలపై విజయం సాధించారు. గ్రూప్-డి రెండో పోరులో కిదాంబి సేన నేడు మాల్దీవ్స్ జట్టుతో తలపడనున్నది.



# ఏకలవ్యులే ఎదుగుతారు!

## • స్వీయ దిద్దుబాటు, ప్రేరణే ముందుకు తీసుకెళ్తుంది
## • అండర్-19 కోచ్ రాహుల్ ద్రవిడ్ ఇంటర్వ్యూ

**నవతెలంగాణ-ముంబయి**

విజయం సాధించినప్పుడు గెలుపు గురించి మాట్లాడే కోచ్‌లను చూశాం. జట్టుగా ఆడే ఆట అయినా ఒకరిద్దరి ప్రదర్శనతో విజయం సాధించామని వ్యక్తిపూజ చేసిన గురువులను చూశాం. కానీ దిగ్గజ హోదా, కోరుకుంటే సీనియర్ జట్టు శిక్షణ సారథ్య పగ్గాలే ఎర్ర తివాచీతో సిద్ధంగా ఉన్నా యువ క్రికెటర్లను తీర్చిదిద్దేందుకు మొగ్గుచూపిన రాహుల్ ద్రవిడ్ అందుకు భిన్నం. గెలుపు కాదు ఆటే ముఖ్యం, వ్యక్తిగత ప్రదర్శన కాదు సమష్టి కృషి కీలకమని నమ్మిన కోచ్ ద్రవిడ్. యువ భారత్‌ను అండర్-19 ప్రపంచకప్ విజేతలుగా నిలిపిన తరుణంలో కుర్రాళ్ల కోచ్ రాహుల్ ద్రవిడ్ ఇంటర్వ్యూ విశేషాలు. గత 18 నెలల ప్రయాణంపై ద్రవిడ్ వెల్లడించిన పలు ఆసక్తికర విషయాలు ఆయన మాటల్లోనే..

**ప్రశ్న : కోచ్‌గా 2016, 2018 అండర్-19 ప్రపంచకప్‌ల్లో మీరు భాగస్వామి. ఈ సారి విజయంతో తిరిగొచ్చారు. ఈ కప్పు ఎంతమేరకు సంతృప్తినిచ్చింది?**

**ద్రవిడ్ :** ఈ మొత్తం ప్రక్రియ సంతృప్తికరం. 2016లో ప్రపంచకప్‌కు రెండు-మూడు నెలల ముందు మాత్రమే కోచ్‌గా ఎంపికయ్యాను. అంతా ప్రణాళికబద్ధంగా సాగేందుకు అంత సమయం లేదు. టోర్నీకి ముందు 15-16 మంది కుర్రాళ్ల ఆట చూశాను. అప్పుడు ఫైనల్లో వెస్టిండీస్ చేతిలో ఓడిపోయాం. కానీ ఈ సారి అంతా ప్రణాళిక ప్రకారం సాగింది. అంతిమ ఫలితం గురించి ఆలోచించకుండా శ్రమించాం. కప్పు నెగ్గటం ఆనందంగా ఉంది. కానీ, అదే మా ఆలోచన కాదు. అండర్-19 స్థాయిలో వీలైనంత మంది కుర్రాళ్లకు అవకాశం ఇవ్వాలి. 30-35 కంటే ఎక్కువ మందే ఈ సమయంలో భారత అండర్-19 తరఫున ఆడారు. వారిలో అందరూ ప్రపంచకప్‌కు ఎంపిక కాకపోవచ్చు. ఈ టోర్నీలో ఆడని వారు రేపు భారత్‌కు ఆడొచ్చు. గతంలో ప్రపంచకప్ ఆడి అర్హత ఉన్న వాషింగ్టన్ సుందర్ వంటి వారిని తీసుకోలేదు. అతడు ఇప్పుడు భారత్‌కు ఆడుతున్నాడు. మళ్లీ వెనక్కి వచ్చి ఆడాల్సిన అవసరం లేదు. ప్రస్తుత జట్టులో కొందరు రంజీ జట్లలో రెగ్యులర్ ఆటగాళ్లు కావచ్చు. అండర్-19 స్థాయి క్రికెటర్లను తీర్చిదిద్ది కోరుకునేది ఇదే. అందుకే ఈ మొత్తం ప్రక్రియ నాకెంతో సంతృప్తినిస్తుంది.

**ప్రశ్న : ఒక్కో ఆటగాడిని ఏ విధంగా సిద్ధం చేస్తారు? అందరికీ సాధారణంగా ఉంటుందా? లేక ఆటగాడిని బట్టి శిక్షణ తీరు మారుతుందా?**

**ద్రవిడ్ :** నాకు నచ్చే కొన్ని విషయాల్లో.. వాళ్లతో పాటు పని చేయటం, వారికి ఏం కావాలో తెలుసుకోవటం. నా ప్రిపరేషన్‌ను వాళ్లపై రుద్దను. నిజమే, కొన్ని సార్లు కచ్చితంగా చేయాల్సిందే అని చెబుతాం. ఇదే సమయంలో వారు ఏం చేయాలనుకుంటున్నారో దానికీ పూర్తి స్వేచ్ఛనిస్తాం. కొందరు మ్యాచ్‌కు ముందు పెద్దగా బ్యాటింగ్ ప్రాక్టీస్‌కు ఇష్టపడరు. కొన్ని బంతుల్ని హిట్టింగ్ చేయడానికే పరిమితం అవుతారు. ఈ వయసులోనే వారు ఏం చేయాలో, ఏది వారి ఉపయుక్తంగా ఉంటుందో తెలుసుకుంటున్నారు. అందుకు వారికో అవకాశం ఇవ్వాలి. ఎప్పుడూ చెబుతూనే ఉంటే, వారు సొంతంగా నేర్చుకునేందుకు అవకాశం ఉండదు!. ఈ జట్టుతో సుమారుగా ప్రయత్నించాం. మ్యాచ్‌కు ముందు రోజు ప్రాక్టీస్‌లో కుర్రాళ్లు చేసినదే ఎక్కువ, మా నుంచి పెద్దగా ఏమీ లేదు. వారు అదనపు బ్యాటింగ్ కోరుకుంటే ఆ అవకాశం ఇచ్చేవాళ్లం. కొందరు అసలు మ్యాచ్‌కు ముందు బ్యాటింగ్‌కు మొగ్గుచూపరు, వారి అభ్యర్థనను మన్నించాం. మ్యాచ్ రోజు ఇదీ వారికి నేర్చుకునేందుకు ఓ అవకాశం ఇస్తుంది.

**ప్రశ్న : మైదానం బయట కుర్రాళ్లను ఏ విధంగా హ్యాండిల్ చేశారు? చర్యలకు వారినే బాధ్యత వహించడం అనుకోవచ్చా?**

**ద్రవిడ్ :** క్రికెట్ అంటే డిసీషన్ మేకింగ్ (నిర్ణయం తీసుకోవటం). మేం అదే పాటించాం అనుకుంటున్నా. అందుకు వారికి సేచ్ఛతో పాటు బాధ్యత నేర్పాం. కానీ వారికి తెలుసు, కొన్ని పరిధులు ఉంటాయని దాటవద్దని. ఎందుకంటే వారు భారత్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్నారు. ఉన్న పరిధిలో స్వేచ్ఛనిచ్చి, బాధ్యతతో మెలిగేలా చేయటమే వారు ఎదిగేందుకు దోహదం చేసింది.

**ప్రశ్న : పని పూర్తి కాకుండా వెనక్కి రావద్దని శుభ్‌మన్ గిల్‌కు చెప్పినట్టు అతడు మ్యాచ్ అనంతరం వెల్లడించాడు? కుర్రాళ్లకు ఆ బాధ్యత నేర్పారా?**

**ద్రవిడ్ :** ఇది పనికి ముందు చేయాల్సిన దానిపై దృష్టి నిలిపేందుకు దోహదం చేసే వచనాలు. కుర్రాళ్లకు చాలా విధాలుగా ప్రేరణ ఇవ్వవచ్చు. 2002 హెడింగ్లే మ్యాచ్‌లో లంచ్ విరామంలో జాన్‌రైట్ నాతో చెప్పిన మాటలను గుర్తు చేస్తాను.. ' ఈ వికెట్‌పై నువ్వు సెంచరీ సాధిస్తే, అది గుర్తిండిపోతుంది. జట్టుకు అదెంతో విలువైనది కూడానూ' అని అన్నాడు. ఆ మాటలు నన్నెంతో ప్రేరేపించాయి. ఇది కుర్రాళ్లకు గుర్తు చేయటం వంటిది. బ్యాటింగ్ అద్భుతంగా చేయగల శుభ్‌మన్ గిల్ వంటి బ్యాట్స్‌మన్ ఆఖరు వరకూ ఉండి పని పూర్తి చేస్తే తర్వాతి స్థాయిని చేరుకుంటాడు, ఎదుగుతాడు. అందుకే ' చూడండి మీ ముందు ఈ ఆప్షన్లు ఉన్నాయి. వీటికి మీరు తీసుకోవచ్చు' అని చెబుతాం. ఈ వయసులో వారు మనం చెప్పినదంతా గుర్తుంచుకోరు, అలాగని నేను సుదీర్ఘ జట్టు సమావేశాలు, ఏకదంపుడు ఉపన్యాసాలు ఇవ్వను. ఎందుకంటే వీళ్లు ఇంకా కుర్రాళ్లే.

**ప్రశ్న : కుర్రాళ్లు అండర్-19 స్థాయిని దాటి వెళ్లాలని మీరు కోరుకుంటున్నారు? ఈ అనుభవం వారికి ఏం నేర్పింది?**

**ద్రవిడ్ :** వీరికి నిజమైన సవాల్ ఇక్కడ్నుంచే మొదలవుతుంది. ఈ స్థాయిలో వీరు ప్రతిభావంతులైన, మంచి ఆటగాళ్లు. కానీ ఇప్పట్నుంచి అండర్-23కి ఆడాల్సి ఉంటుంది. లేదంటే రంజీ జట్టుకు ప్రాతినిథ్యం వహించాలి. అక్కడ వీరి కంటే అనుభవజ్ఞులైన, మెరుగైన క్రికెటర్లతో పోటీ పడాలి. బావిలోని పెద్ద చేప, సముద్రంలో పడినట్టు ఇదంతా షాక్‌లా ఉంటుంది. ఇది పూర్తిగా భిన్నమైన వాతావరణం అని తెలుసుకుని, వేగంగా నేర్చుకోవాలి. అండర్-19 స్థాయిలో ఓ రక్షణ వలయం ఉంటుంది. తర్వాత అది ఉండదు. సొంతంగా నేర్చుకోవాలి, సొంతంగా ఎదగాలి. పరిస్థితులకు వీలైనంత త్వరగా అలవడిన వారే ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో విజయవంతం కాగలరు.

**ప్రశ్న : గాయాల పరంగా ఎన్నో ఎదురుదెబ్బలు. అవి జట్టు స్థైర్యాన్ని దెబ్బతీశాయా? ఈ పరిస్థితిని ఎలా అధిగమించారు?**

**ద్రవిడ్ :** కుర్రాళ్ల యోగ క్షేమాలే మాకు ముఖ్యం. ఎందుకంటే ఇక్కడికొచ్చింది ప్రపంచకప్ అనుభవం పొందటం కోసమే. కానీ కుర్రాళ్లు టోర్నీలో తేడా చూపించాలని అనుకున్నారు. ఫిజియో యోగేశ్ పర్మార్, ట్రైనర్ ఆనంద్‌లదే ఈ ఘనత. ఏడాది కాలంగా గాయాలు వేధిస్తున్నాయి. కానీ జాతీయ క్రికెట్ అకాడమీలో వీరు ఎంతో ప్రొఫెషనల్‌గా పని చేశారు. కమలేశ్ నాగర్‌కోటి, శివం మవిలను మనం అభినందిస్తున్నాం, జాతీయ క్రికెట్ అకాడమీకి ఆ ప్రశంస దక్కాలి. రియాన్ పరాగ్ బాగా బ్యాటింగ్ చేస్తాడు. దురదృష్టశావత్తు వేలికి గాయం అయ్యింది. ఇంటికి పంపాలనే అనుకున్నాం. కానీ కాస్త సమయం ఉండటంతో ఫిజియో భరోసా ఇచ్చాడు. ఇషాన్ పొరెల్ విషయంలోనూ ఇదే కథ. తొలి మ్యాచ్‌లో మంచి బంతులేశాడు, కానీ గాయానికి గురయ్యాడు. నిజానికి ఇషాన్ పొరెల్ అత్యుత్తమ బౌలింగ్ ఇంకా చూడలేదు. అతడు ఫిట్‌గా ఉంటే నిలకడగా 140 కిమీ వేగంతో బంతిని సంధించగలడు.

**ప్రశ్న : చాలా మంది కుర్రాళ్లు అప్పడే ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అడుగుపెట్టారు. భారత్-ఎ జట్టుకు సైతం మీరే కోచ్. ఇప్పుడు మీ ముందున్న భవిష్యత్ రూట్‌మ్యాప్ ఏమిటి?**

**ద్రవిడ్ :** రెండేండ్లుగా నేను ఆస్వాదించిన విషయాల్లో సీనియర్ సెలక్షన్ కమిటీ, జూనియర్ సెలక్షన్ కమిటీలతో జరిపిన సంభాషణలు. వారు నిజాయితీగా భారత్‌కు ఏది అవసరం, ఏది అత్యుత్తమమో అని వివిధ మార్గాల్లో అన్వేషిస్తున్నారు. కొందరు అండర్-19 కుర్రాళ్ల గురించి సీనియర్ సెలక్షన్ కమిటీ తరచుగా నన్ను అడుగుతూనే ఉంది. అయితే రంజీ ట్రోఫీ విలువను గుర్తించటం, రంజీ పరుగులను పరిగణనలోకి తీసుకోవటం ఎంతో మంచి విషయం. ఇక్కడి నుంచి ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లోకి వెళ్లాలి, అక్కడ పరుగులు, వికెట్లు తీయాలి. రిషబ్ పంత్‌నే తీసుకుంటే అతడు 900 పరుగులు చేశాడు, ఇషాన్ కిషన్ సైతం 800 పరుగులు బాదాడు. అప్పుడే భారత్-ఎ జట్టుకు ఎంపికవుతారు. దీని తర్వాత మనకో వ్యవస్థ ఉంది. అక్కడ నిరూపించుకోవాలి. నేర్చుకోవాలి, ఎదగాలి, నిరూపించుకోవాలి, తర్వాతి స్థాయి క్రికెట్ ఆడగల సత్తా ఉందని చాటాలి. దీనికి కొన్నేండ్లు పట్టినా పెద్ద విషయం కాదు, ఎందుకంటే విలువైన అనుభవం తోడవుతుంది. ఇప్పటికంటే మెరుగ్గా సన్నద్ధం కావాలి, భారత్-ఎ సవాల్ మరింత కఠినం.

# సమంగా ఇవ్వాల్సింది!

## • నగదు ప్రోత్సాహకంపై ద్రవిడ్ మనోగతం

**ముంబయి :** అండర్-19 ప్రపంచకప్ నెగ్గిన యువ జట్టుకు బీసీసీఐ నగదు నజరానా ప్రకటించింది. ఆటగాళ్లకు రూ. 30 లక్షలు చొప్పున, సహాయక సిబ్బందికి రూ. 20 లక్షల చొప్పున ఇవ్వనున్నట్టు తెలిపింది. క్రికెట్ దిగ్గజం, కోచ్ రాహుల్ ద్రవిడ్‌కు రూ. 50 లక్షలు నజరానా ప్రకటించింది. గురువే ప్రధానం కాబట్టి కోచ్‌కు సింహభాగం దక్కాలని బోర్డు భావించిందని ఓ అధికారి అన్నాడు. కానీ సహాయక సిబ్బందిలో అందరూ సమానంగా పని చేశామని, ఎవ్వరూ ఎక్కువ తక్కువ కాదని ద్రవిడ్ మనోగతంగా ఓ పత్రిక కథనం ప్రచురించింది. తనకు ఎక్కువ ఇవ్వకుండా, అందరితో సమానంగానే ఇవ్వాల్సినదని ద్రవిడ్ అభిప్రాయపడినట్టు తెలుస్తోంది. 2008లో డేవ్ వాట్‌మోర్, 2012లో భరత్ అరుణ్‌లకు సైతం కోహ్లి, ఉన్ముక్త్ చంద్ సేనల కంటే ఎక్కువ నజరానా ఇవ్వని విషయాన్ని ఇక్కడ ప్రస్తావించినట్టు సమాచారం!. ప్రపంచకప్ నెగ్గిన యువ భారత్‌కు బీసీసీఐ అధికారిక విందు ఏర్పాటు చేసింది. సహాయక సిబ్బందితో పాటు ఆటగాళ్లందరూ ఈ విందులో పాల్గొన్నారు.



# సిరీస్‌పై కన్నేసి..

## • నేడు అమ్మాయిల రెండో వన్డే

**కింబర్లె :** సుదీర్ఘ విరామం అనంతరం మైదానంలో అడుగుపెట్టినా.. ఆటలో, ఫలితంలో తేడా రానీయని మిథాలీసేన నేడు రెండో వన్డేకు సిద్ధమవుతోంది. దక్షిణాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో ఘన విజయం సాధించిన అమ్మాయిలు నేడు నెగ్గితే సిరీస్ సొంతం చేసుకోనున్నారు. కెప్టెన్ మిథాలీ రాజ్, యువ బ్యాట్స్‌వుమెన్ స్మృతి మంధాన సహా హర్మన్‌ప్రీత్ కౌర్‌లు మంచి ఫామ్‌లో ఉన్నారు. సీనియర్ బౌలర్ జులన్ గోస్వామి లయ అందిపుచ్చుకున్నది. దీంతో మరో వన్డే ఉండగానే సిరీస్ సాధించాలని అమ్మాయిలు ఉవ్విళ్లూరుతున్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకు మ్యాచ్ ఆరంభం అవుతుంది.

# హైదరాబాద్ అదుర్స్

## • విజయ్ హజారే ట్రోఫీ

**హైదరాబాద్ :** ప్రతిష్టాత్మక విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్ జట్టు దుమ్ము రేపుతుంది. మంగళవారం జరిగిన రెండో గ్రూప్ డి మ్యాచ్‌లో జార్ఖండ్‌పై 66 పరుగులతో గెలుపొందింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్.. రోహిత్ రాయుడు (126), అక్షత్ రెడ్డి (75), భవనాక సందీప్ (69) మెరుపులతో నిర్ణీత ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 333 పరుగులు చేసింది. బౌలర్లు సమిష్టిగా రాణించి జార్ఖండ్‌ను 223 పరుగులకే ఆలౌట్ చేశారు. మహ్మద్ సిరాజ్, మెహదీ హసన్‌లు, ఎమ్ రవి కుమార్‌లు తలా రెండు వికెట్లు పడగొట్టగా.. టి రవి తేజ, చైతన్య రెడ్డి, రోహిత్ రాయుడులు ఒక్కో వికెట్ తీసుకున్నారు. తొలి రెండు మ్యాచులకు దూరమైన అంబటి రాయుడు గురువారం విదర్భతో జరుగనున్న మ్యాచ్‌కు అందుబాటులోకి రానున్నాడు.

# అంకిత పైనే అందరి చూపు



**న్యూఢిల్లీ :** నేటి నుంచే ఫెడ్‌కప్ ప్రపంచ గ్రూప్‌కు అర్హత రౌండ్లు ప్రారంభం కానున్నాయి. ఆసియా/ ఓసియానా గ్రూప్ 1 చాలెంజ్‌లో సీనియర్ టెన్నిస్ ప్లేయర్ అంకిత బాంబ్రీ కెప్టెన్సీలో అంకిత రైనా జట్టు బరిలో దిగనున్నది. 1991 నుంచి ఒక్కసారి కూడా భారత్ ఫెడ్ కప్ ప్రపంచ గ్రూప్‌కు అర్హత సాధించలేదు. దీంతో ఈసారి భారమంతా అంకిత, కర్మన్ కౌర్‌ల పైనే ఉన్నది. టాప్ 125 ర్యాంకుల క్రీడాకారులతో ఆడిన అనుభవం అంకిత సొంతం. 'నిలకడే ప్రధానం. ఉన్నత శ్రేణి ఆటగాళ్లతో ఎలా తలపడాలో మాకు తెలుసు. ఆ దిశగా ప్రయత్నించి సఫలమవుతాం అన్న నమ్మకముంది' అని అంకిత తెలిపింది.

# భారత్‌కు సులువైన డ్రా

**న్యూఢిల్లీ :** కామన్‌వెల్త్ గేమ్స్ బ్యాడ్మింటన్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో భారత్‌కు సులువైన డ్రా లభించింది. గ్రూప్-ఎ లో భారత్ పాకిస్థాన్, శ్రీలంక, స్కాట్లాండ్ జట్లతో తలపడనున్నది. అద్భుత ఫామ్‌లో ఉన్న భారత్ గ్రూప్ దశ పోరుల్లో నెగ్గి నాకౌట్‌కు చేరుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఏప్రిల్ 5 నుంచి గోల్డ్ కోస్ట్ వేదికగా ప్రారంభం కానున్న పోటీల్లో మొత్తం 16 దేశాలు నాల్గు గ్రూపులుగా పాల్గొంటాయి. భారత్ సహ మలేసియా, ఇంగ్లాండ్‌లు టైటిల్ ఫేవరెట్లు.



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.